www.jagritiweekly.com

సంపుటి : 77 సంచిక : 35 పుటలు : 52

# జాగృతి

కలి 5127-శ్రీ విశ్వావసు జ్యేష్ఠ బహుళ త్రయోదశి

23-29 జూన్ 2025

వెల : ₹20/-

# ఎమర్జెన్సీ @ 50




జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

77 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక

# విమాన ప్రమాద బాధితుల సేవలో స్వయంసేవకులు

జూన్ 12న అహ్మదాబాద్‌లో సంభవించిన విమాన ప్రమాదంపై యావత్ ప్రపంచం తల్లడిల్లిపోతున్న తరుణంలో ఆర్ఎస్ఎస్ స్వయంసేవకులు బాధితులకు అండగా నిలిచారు. 350 మంది స్వయంసేవకులు రెండు దశల్లో సేవా కార్యక్రమాలను చేపట్టారు. అత్యంత క్రమశిక్షణతో నిస్వార్థంగా ప్రమాదస్థలి వద్ద సహాయక చర్యలు చేపట్టారు. వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. బాధిత కుటుంబాలకు మార్గదర్శనం చేశారు.ఆస్పత్రిలో క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బందికి సాయపడ్డారు. పోస్టుమార్టమ్ గదిలోనూ సేవలందించారు. డీఎన్ఏ నమూనాల సేకరణకు తోడ్పడ్డారు. రక్తదానం చేశారు. 2,000 మందికిపైగా ప్రజలకు టీ, తాగునీరు, ఆహారం సమకూర్చారు. కాలుపూర్ స్వామినారాయణ్ మందిర్ సహకారంతో అవసరార్థులకు ఆహారాన్ని పంపిణీ చేశారు.





# బాలానందం









మూడు దేశాల పర్యటనలో భాగంగా జూన్ 15న సైప్రస్ చేరుకున్న ప్రధాని నరేంద్ర మోదీకి అక్కడి ప్రవాస భారతీయులు ఘనంగా స్వాగతం పలికారు. 'జైహింద్.. ఆపరేషన్ సిందూర్', 'ఫాదర్ ఆఫ్ మోడర్న్ ఇండియా' అని రాసి ఉన్న ప్లకార్డులను ప్రదర్శించారు. ప్రధాని చిత్రపటంపైన ఆయన సంతకాన్ని తీసుకున్నారు.  మోదీ ఆ కాసేపు పెద్దలతో పాటుగా వచ్చిన చిన్నారులతో ఆనందంగా గడిపారు. వారితో కరచాలనం చేశారు. ఆశీర్వదించారు. ఓ చిన్నారిని ఎత్తుకున్నారు. ఆ మహత్తరమైన క్షణాలను నమోదు చేసుకుంటున్నట్టుగా చిన్నారుల తల్లిదండ్రులు వారి దగ్గర ఉన్న మొబైల్ ఫోన్లతో ఫోటోలు తీసుకున్నారు. వాటిని చూసుకొని మురిసిపోయారు.

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.**

జి.తుకారాం : సర్క్యులేషన్ మేనేజర్
**040-27561453 / 9959997013**

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)**

| | | |
|---|---|---|
| కె. దుర్గారెడ్డి : | అసోసియేట్ ఎడిటర్ | - |
| సబ్ ఎడిటర్ : | - | **9959991304** |

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ

## చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ **"To Bank / UPID"** ఆప్షన్ వాడండి.

**Link / QR Code** ద్వారా మీ చందా చెల్లించినప్పుడు **Remarks** దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

5 సం॥ల చందా రూ.4000 సంవత్సర చందా రూ.850

**బ్యాంకు ఖాతా వివరాలు**

A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

– సర్క్యులేషన్ మేనేజర్, జాగృతి

***మనందరికీ తెలిసిన ఆ మహిళ బాల్యంలో:***
***ఒక వివశత్వ స్థితిలో మాతృభూమి కోసం***
***తనకెంతో ఇష్టమైన బొమ్మని దగ్ధం చేసింది.***
***అందుకే ఆశ్చర్యం పడక్కరలేదు, ఎదిగాక అదే చేసింది***
***ప్రాణమున్న తన బొమ్మకోసం***
***మాతృభూమిని దగ్ధం చేసింది*** (ది లేడీ వాయిస్, ఇస్మాయిల్)

ఏడున్నర దశాబ్దాల స్వతంత్ర భారత చరిత్రలో ఒకే ఒక్కసారి దేశం అత్యవసర పరిస్థితి కిందకు వెళ్లింది. ఆ పరిణామాలనీ, ఆ పరిస్థితులనీ స్మరించుకోవడానికి మామూలు మాటలలో చెప్పినా గుండె బరువెక్కుతుంది. అదొక చీకటియుగం. ఇందుకు కారణం నాటి ప్రధాని ఇందిరాగాంధీ. ఆమె మనస్తత్వం, పెరిగిన వాతావరణం అలాంటి తీవ్ర చర్యకు ఆమెను ప్రేరేపించాయి. నెహ్రూ తన సోదరి విజయలక్ష్మీ పండిట్‌కు రాసిన లేఖలు, పార్టీ పెద్దలకు ఆయన రాసిన లేఖలు ఇందుకు ప్రబలమైన సాక్ష్యాలు. ఆమె మనస్తత్వాన్ని పుణికిపుచ్చుకున్న ఆమె రెండో కుమారుడు సంజయ్ గాంధీ అత్యవసర పరిస్థితి అనే నిప్పుకు గాలివలె తోడయ్యాడు. ఆమె తొందరపడి ఎమర్జెన్సీ విధించారు. ప్రచ్ఛన్నయుద్ధ భూతం కల్పించిన భయాలతో ఆ చర్యకు పాల్పడ్డారు. ఎమర్జెన్సీ ఎలాంటి సమయంలో విధిస్తారు? అంతర్యుద్ధం, తెగలూ ప్రాంతాల మధ్య సాయుధ ఘర్షణ, అదుపు తప్పిన హింస నేపథ్యంలోనే ఎమర్జెన్సీని ఆశ్రయిస్తారు పాలకులు. అలాంటి వాతావరణానికే రాజ్యాంగం ఎమర్జెన్సీని పరిమితం చేసింది. 1975కు అలాంటి పరిస్థితులు ఉన్నాయా? ఈశాన్యంలో వేర్పాటువాదం కొంత ఉంది. శ్రీకాకుళం అడవులలో నక్సలైట్ల సవ్వడులు ఉన్నాయి. 1974 నుంచి గుజరాత్, బిహార్‌లలో పెరిగిన మెస్ బిల్లుల గురించి విద్యార్థుల ఘోష ఉంది. అవినీతి మీద ఆగ్రహం ఉంది. వీటికి గాంధేయవాదులు జయప్రకాశ్ నారాయణ్, మొరార్జీల మద్దతు ఉంది. ఈ నేపథ్యానికి అంతర్యుద్ధమని పేరు పెట్టవచ్చా? తెగల మధ్య హింసాత్మక పోరు అనొచ్చా?

ఎమర్జెన్సీ విధింపు ప్రపంచ చరిత్రలో కొత్తకాదు. అమెరికా, ఆస్ట్రేలియా, బ్రిటన్, కెనడా, జర్మనీ, రష్యా సహా అన్ని దేశాలు ఆ అవకాశాన్ని అమ్ములపొదిలో ఉంచుకున్నాయి. ఎమర్జెన్సీ విధించుకున్న దేశాలు ఎలాంటివి? రెండేళ్ల అంతర్యుద్ధంతో

**శాలివాహన 1947 శ్రీ విశ్వావసు జ్యేష్ఠ బహుళ త్రయోదశి**

## లోపలి పేజీలలో...




ముఖపత్ర కథనం
**ఎమర్జెన్సీ @ 50** 6లో

ప్రత్యేక వ్యాసం
**'సమర్పణ'భావం సర్వధర్మాత్మకం** 26లో

ప్రత్యేక వ్యాసం
**బోనాలకు వేళాయె...** 32లో





# జాగృతి
## సంపాదకీయం

# ఎప్పటికీ గుణపాఠమే!

కునారిల్లిపోతూ, ఆకలికి అలమటిస్తూ సూడాన్ విధించుకుంది. కోటీ ముప్పయ్‌లక్షల మంది నిరాశ్రయులయ్యారు. నలభయ్ లక్షలమంది పొరుగు దేశాలకు శరణార్థులుగా వలసపోయారక్కడ. ఎడతెగని వర్గాల ఘర్షణతో సిరియా కూడా ఎమర్జెన్సీని ఆశ్రయించింది. కోటీ అరవైలక్షలకు పైగా నిరాశ్రయులయ్యారు. సాయుధ ముఠాల ఘర్షణ కారణంగా కాంగోలో దాదాపు పాతిలక్షల మంది సర్వం కోల్పోయిన పరిస్థితులలో అక్కడ ఎమర్జెన్సీ విధించుకున్నారు. యెమెన్, ఉక్రెయిన్, ఇథియోపియా, హైతీ, సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్– ఇవన్నీ రాజకీయ అనిశ్చితితో, తెగల మధ్య ఆధిపత్య పోరుతో అత్యవసర పరిస్థితి విధించుకున్నాయి. అల్బేనియా అనే దేశంలో పార్లమెంట్ ఎమర్జెన్సీని ప్రకటిస్తుంది. 60 నుంచి 90 రోజులే అమలు చేయాలి. ఇక పాకిస్తాన్ వంటి నికృష్టదేశంలో ఐదు పర్యాయాలు (1958–2007) ఎమర్జెన్సీ విధించక తప్పలేదు. ఇప్పుడు ఒక్కసారి ఇందిర విధించిన అత్యవసర పరిస్థితిని అంచనా వేయండి. 21 మాసాలు దేశం ఎమర్జెన్సీలో మగ్గిపోయింది. ఆ సమయంలో నిరాశ్రయులైనవారు ఏడులక్షలు (డిసెంబర్ 9, 2021, హిందుస్తాన్ టైమ్స్).

ఇందిర విధించిన అత్యవసర పరిస్థితికి మరొక ప్రత్యేకత– కోటీ పదకొండు లక్షలమందికి కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు. ఇది ఆమె కుమారుడు సంజయ్ స్వకపోల కల్పితం. ప్రపంచ చరిత్రలో అమానుషం. పది చదివే బాలుడి దగ్గర నుంచి ఎనభయ్ ఏళ్ల వృద్ధుని వరకు వదిలిపెట్టలేదు. రాజ్యాంగాన్ని ఒక వ్యక్తికి అనుకూలంగా మార్చిన కాలం కూడా అదే. ఏ విధంగా చూసినా అత్యవసర పరిస్థితి స్వతంత్ర భారతదేశానికి గొప్ప గుణపాఠం. విస్మరించకూడని చారిత్రక సత్యం. ఇలాంటి పరిస్థితి నుంచి దేశంలో తిరిగి స్వేచ్ఛావాయువులు వీచేందుకు దోహదం చేసినవారు ఎందరో ఉన్నా, ఎమర్జెన్సీ వ్యతిరేక సాహసోపేత పోరాటంలో అగ్రస్థానం సంఘ పరివార్‌దే. లోక్‌సంఘర్ష సమితికి మహోన్నత స్వయంసేవక్ నానాజీ దేశ్‌ముఖ్‌ను ఎన్నుకోవడమే ఇందుకు నిదర్శనం. ఈ నిజాన్ని కాదనేవారూ ఉన్నారు. అయితే వారంతా దివాంధులన్న విషయం భారతజాతికి తెలుసు. ఆ అంధత్వంతోనే కాలగర్భంలోకి నడిచారు వారంతా. అందుకే 'దృష్టి' సక్రమంగా ఉన్నవారి వైపే భారతజాతి చూసింది.

ఎమర్జెన్సీ నుంచి విముక్తం చేయడానికి స్వయంసేవకులు అహరహం పోరాడారు. తమ సంస్థ ఉనికి కంటే పెద్ద దుష్టశక్తి మీద పోరాటమే ప్రధానమని నమ్మింది జనసంఘ్. అందుకే ఎన్నింటికో రాజీపడి, ఎలాంటి రాజకీయ నిబద్ధత, జాతీయశీలం లేని వ్యక్తులతో కూడా పనిచేయడానికి సిద్ధపడింది. ఒక గీతను చిన్నదిగా చూపడానికి పక్కన పెద్ద గీత గీయాలని అనుకోవడం కుత్సితత్వమే తప్ప మరొకటి కాదు. ద్వంద్వ సభ్యత్వం పేరుతో జనతాపార్టీ నుంచి జనసంఘ్ వారికి పొగ పెట్టడం అలాంటిదే. ఇందిరకు నాటి సరసంఘ్‌చాలక్ లేఖ రాసిన లేఖ మీద వక్రభాష్యాలు చెప్పడమూ అంతే. సోవియెట్ రష్యా భక్తులు, చైనా తైనాతీలు సహించలేని పెద్ద వాస్తవం– దేశ రాజకీయపటంలో కాషాయ ధ్వజం ఎగరడం. మతశక్తులకు ప్రాధాన్యం ఇవ్వడం జేపీ చేసిన తప్పిదమని, విశ్వవిద్యాలయాలలో కూర్చుని, పరిశోధక పత్రాల పేరుతో వికృత వ్యాఖ్యలు చేసిన వారు కూడా లేకపోలేదు. ఎమర్జెన్సీ విధించి కాంగ్రెస్ తన రాజకీయ ప్రత్యర్థిని తానే సృష్టించుకుంది. మిగిలిన పక్షాలు కూడా అంతే మంచి చేశాయి. ఒక నిర్మాణాత్మక దృష్టి ఉన్న జాతీయశక్తి ఆవిర్భవించడానికి తమ వంతుగా దోహదం చేశాయి. ఎమర్జెన్సీ విధింపు మాత్రమే కాదు, కాంగ్రెస్ అనే దుష్టశక్తి దేశానికి ఎంత చేటు చేసిందో బీజేపీ హయాంలో ఇప్పుడు వాస్తవాలు వెలుగు చూస్తున్నాయి. ఈ సందర్భంలో ఒక ప్రశ్న. అయోధ్య వివాదాస్పద కట్టడం కూల్చినందుకు కాంగ్రెస్ ముస్లింలకు క్షమాపణలు చెప్పాలని అడిగినవారు కోకొల్లలు. మరి ఎమర్జెన్సీ విధించినందుకు జాతి మొత్తానికి క్షమాపణలు చెప్పాలని దేశం అడగొద్దా! ఎమర్జెన్సీ ఉదంతానికి యాభయ్ ఏళ్లు నిండిన సందర్భంగా నాటి అమరులందరికీ ఇదే మా నివాళి. ★

23 జూన్ 2025, సోమవారం | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్



40లో

కథ

**పాత నారాయణ**

– డా. పేరం ఇందిరాదేవి

ధరహాసం




'యమర్జెన్సీలో ధిక్కార స్వరాలు (మహిళ) – 30
విశ్వరక్షకుడి విశిష్టతలు... (ప్రత్యేక వ్యాసం) – 32
ప్రహసనంగా సినిమా పురస్కారాల ప్రదానం (తెలంగాణ) – 34
కొల్లేరు పరిశీలనకు కేంద్ర సాధికారత కమిటీ (ఆంధ్రప్రదేశ్) – 36
పర్వతారోహణలో పదహారేళ్ల తెలుగుతేజం ! (క్రీడ) – 43
బాలజాగృతి – 46
వారఫలాలు – 48
'కుబేర' నుండి 'డెకాయిట్' వరకూ.... (సినిమా) – 50

# ఎమర్జెన్సీ


ఎడిటర్: పండితారాధ్యుల నాగేశ్వ...

సంపుటి : 40 సంచిక: 160 విజయవాడ 13-6-1975 శుక్రవారం 6 పేజీలు 25 పైసలు

...క్ సభకు ఇందిరాగాంధి ఎన్నిక రద్దు

...నారాయణ్ పిటిషన్‌పై అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి శ్రీ సిన్హా తీర్పు

...కు ఎన్నికలలో పోటీ చేయరాదని ఆంక్ష:
అవినీతిపద్ధతులకు పాల్పడినట్లు స్పష్టీకరణ

అలహాబాద్, జూన్ 12:
1971లో జరిగిన మధ్యంతర ఎన్నికలలో, ఉత్తరప్రదేశ్ లోని

ప్రధాని రాజీనామా చేసే ప్రసక్తిలేదు

ఢిల్లీలో దావానలం వలె వ్యాపించిన వార్త


ఇందిర ప్రభుత్వం అత్యవసర పరిస్థితి విధించింది.

జూన్ 25, 1975 అర్ధరాత్రి అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ సిఫారసుతో రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహమ్మద్ (1905–1977) అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) ప్రకటించారు. రాజ్యాంగంలో ఆర్టికల్ 352లోని 1వ నిబంధన ఎమర్జెన్సీ విధించే అధికారాన్ని రాష్ట్రపతికి దాఖలు పరుస్తున్నది. ఇదే నిబంధన కింద ఎక్స్‌టర్నల్ ఎమర్జెన్సీ, ఫైనాన్షియల్ ఎమర్జెన్సీని ప్రకటించే అధికారం రాష్ట్రపతికి ఉన్నది. ఆంతరంగిక భద్రతకు విఘాతం వాటిల్లిందని రాష్ట్రపతి విశ్వసిస్తే, ప్రధాని, కేంద్ర క్యాబినెట్ సిఫారసు చేస్తే రాష్ట్రపతి ఈ అసాధారణ చర్య తీసుకుంటారు. కానీ, లోక్‌సభకు ఇందిర ఎన్నిక చెల్లదంటూ జూన్ 12న అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై 25న సుప్రీంకోర్టు షరతులతో కూడిన స్టే మంజూరు చేసిన నేపథ్యంలో జయప్రకాశ్ నారాయణ్ (జేపీ), మొరార్జీ దేశాయ్ వంటి విపక్ష ప్రముఖులు ఇందిర పదవిలో కొనసాగరాదన్న నినాదం వినిపించారు. అలహాబాద్ హైకోర్టు, సుప్రీంకోర్టు ఆదేశాలకు కట్టుబడి ప్రధాని ఇందిర రాజీనామా చేయాలని, ఈ డిమాండ్‌తో దేశంలో ఉద్యమం నిర్వహించాలని అదే రోజున ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరిగిన గొప్ప బహిరంగ సభలో ప్రతిపక్షాలు నిర్ణయం తీసుకున్నాయి. ఆ రాత్రే

జూన్ 25, 1975 నాటికి దేశంలో ఎలాంటి పరిస్థితులు నెలకొని ఉన్నాయి? అవి అత్యవసర పరిస్థితి విధించడానికి ఏ పరిస్థితులు ఉండాలో రాజ్యాంగం చెప్పిన స్థాయిలో అవి ఉన్నాయా? ఒకటిన్నర సంవత్సరం క్రితానికి వెళ్లినా అంత తీవ్ర మైన పరిస్థితులుగా కనిపించవు. జనవరి 1,1974న గుజరాత్‌లో విద్యార్థి ఆందోళన మొదలయింది. ఏప్రిల్ 6న జేపీ, ప్రభుత్వం అవినీతిపై ప్రసంగించారు. జూలై 29న ఆల్ ఇండియా యూత్ కాన్ఫరెన్స్‌లో, నవంబర్ 19న పట్నా బహిరంగ సభలో జేపీ మాట్లాడారు. 1975 జనవరిలో దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిన సంఘటన జరిగింది. బిహార్‌లోని సమస్తిపూర్ అనే చోట రైల్వే మంత్రి ఎల్ఎన్ మిశ్రా ప్రసంగిస్తున్న సభలో బాంబు పేలింది.

కానీ దీనిని జేపీ ఉద్యమంతో ముడిపెట్టలేకపోయారు. ఆ ప్రయత్నమే జరగలేదు. జేపీ ప్రారంభించిన సంపూర్ణ విప్లవానికి మద్దతుగా జనవరి 18న పార్లమెంటుకు జనతా మార్చ్ నిర్వహించాలని విపక్షాలన్నీ (సీపీఐ మినహా) నిర్ణయించాయి. మార్చి 18న అలహాబాద్ హైకోర్టు బోనులో ఇందిరాగాంధీ నిలబడ్డారు. బిహార్‌లో విద్యార్థులు ఆరోజే మూడు కిలోమీటర్ల మేర జనతా మార్చ్ నిర్వహించారు. అవినీతి ఆరోపణలతో ఉన్న చిమన్‌భాయి పటేల్ ప్రభుత్వాన్ని దించి, గుజరాత్ అసెంబ్లీకి ఎన్నికలు నిర్వహించాలని మొరార్జీ దేశాయ్ ప్రారంభించిన నిరాహార దీక్ష ఏప్రిల్ 13న విరమించారు. ఆయన గాంధేయవాది. ఆ మార్గంలోనే చేశారు. ఎన్నికలు జరిపించడానికి ఇందిరాగాంధీ సుముఖత వ్యక్తం చేశారు. చిత్రంగా మే 7న మీసా చట్టాన్ని సవరించాలని విపక్షాలు లోక్ సభలో ఒక బిల్లు ప్రవేశపెట్టాయి. ఇవన్నీ ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే, దేశంలో అంతు ర్యుద్ధం వంటి తీవ్ర పరిస్థితులు ఉంటేనే అత్యవసర పరిస్థితి వంటి తీవ్ర నిర్ణయం తీసుకోవాలి. కానీ అవేమీ లేవు. అందుకు ఈ పరిణామాలే నిదర్శనం. అలజడు లన్నీ పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని అనుసరించినవే.

అలహాబాద్ హైకోర్టు తీర్పు, సుప్రీంకోర్టు

# @౫౦

భారతదేశానికి స్వాతంత్ర్యం తమ ఘనతేనన్నది కాంగ్రెస్ భ్రమ. జాతిని నిరంతరాయంగా చేస్తున్న దగా. అంతటి కాంగ్రెస్ తమ జేబు సంస్థ అని గాంధీ–నెహ్రూ కుటుంబ అహంకారం. అందుకే దేశ స్వాతంత్ర్యాన్ని ఎప్పుడైనా, ఏ కారణానికైనా కాలరాసే సర్వాధికారాలు తమకు దఖలు పడి ఉన్నాయని ఆ కుటుంబం, కాంగ్రెస్‌ల ప్రగాఢ విశ్వాసం. ప్రధాని పదవి ఆ కుటుంబ జన్మహక్కు అనీ, దేశం కాంగ్రెస్ గుప్పిట్లో మాత్రమే ఇమిడిపోతుందని ఆనాడు రాజ్యమేలిన నిశ్చితాభిప్రాయం. వీటన్నిటి ఫలశ్రుతే 1975 నాటి అత్యవసర పరిస్థితి. ప్రపంచం నిద్రిస్తున్న వేళ భారత్ మేలుకొన్నది అంటూ స్వాతంత్ర్యం సిద్ధించిన తొలి ఘడియలలో ప్రథమ ప్రధాని నెహ్రూ పలికిన మాటలు జనం మరవకముందే, కేవలం 28 ఏళ్లకే మళ్లీ ఒకే ఒక్క కలం పోటుతో ఆయన కుమార్తె ఇందిరాగాంధీ దేశాన్ని నియంతృత్వం కింద నిద్రపుచ్చారు. స్వరాజ్య స్పృహ మీద నీళ్లు చల్లారు. అప్పుడప్పుడే జాతి జ్ఞాపకాల నుంచి నిష్క్రమిస్తున్న బ్రిటిష్ పాలనను మరొకసారి రుచి చూపించారు. అక్రమ అరెస్టులు, జైలు గోడల వెనుక ఆక్రందనలు, నడిరోడ్ల మీద లాఠీల తాండవాలు అన్నీ స్వరాజ్య సమరకాలాన్ని పునరావృత్తం చేశాయి. బలవంతపు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు భారతీయ సమాజానికి శతాబ్దాలు గడిచినా వదలని గర్భశోకాన్ని మిగిల్చాయి. నిజమైన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, వారి స్వప్నాలు, ఆ పోరాటం వెనుక ఉన్న ప్రజాస్వామ్య దృష్టి, స్ఫూర్తి నిర్వీర్యం చేసింది ఎమర్జెన్సీ. రాజ్యాంగం ఇస్తే మాత్రమేమిటి! ప్రజలందరి ప్రాథమిక హక్కులన్నీ చచ్చుపడిపోయాయి. న్యాయదేవత కళ్లకు పాత గంతలతో పాటు, నోటికి కొత్తగా తాళం వచ్చింది. రాజ్యాంగ పదవులలో ఉన్న వాళ్ల మీద కోర్టులకెక్కే హక్కే హరించుకుపోయింది. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమని చెప్పే పత్రికల వెన్నెముక వంగిపోయింది. అలాంటి అత్యవసర పరిస్థితి విధించి అర్ధ శతాబ్దం గడిచింది. ప్రజాస్వామ్య ప్రియులంతా గుర్తు చేసుకోవలసిన సందర్భమిది. చరిత్రను పునర్ లిఖించడం ప్రతితరం బాధ్యత అని విశ్వసించేవారు గమనించవలసిన పరిణామం. విశ్లేషించుకోవడమూ వారి కర్తవ్యమే.



ఫక్రుద్దీన్

షరతులతో కూడిన స్టేలతో ఇక ఇందిర పదవిలో కొనసాగడానికి అనర్హులని ప్రకటిస్తూ విపక్షాలు ఉద్యమానికి పథక రచన చేశాయి. జూన్ 25,1975 (సుప్రీంకోర్టు షరతులతో స్టే ఇచ్చిన రోజే) లోక్ సంఘర్ష సమితిని ప్రకటించాయి. దీనికి అధ్యక్షుడు మొరార్జీ దేశాయ్. కార్యదర్శి నానాజీ దేశ్‌ముఖ్, కోశాధికారి అశోక్ మెహతా. ఆ సాయంత్రమే రామ్‌లీలా మైదానంలో చరిత్రాత్మక బహిరంగ సమావేశం జరిగింది. ఆ రాత్రే సరిగ్గా 11.45 నిమిషాలకు రాష్ట్రపతి ఎమర్జెన్సీ ప్రకటనపై సంతకం చేశారు (ది జడ్జిమెంట్, కులదీప్ నయ్యర్). రామ్‌లీలా మైదానంలో జరిగిన సభని, అందులో వినిపించిన కొన్ని మాటలను అడ్డం పెట్టుకుని, దానితోపాటు ఏడాదిన్నర



ఆంధ్రజ్యోతి

ఎడిటర్ : నార్ల వెంకటేశ్వరరావు

విజయవాడ, జూన్ 27, 1975 శుక్రవారం

6 పేజీలు 25 పైసలు

అత్యవసర పరిస్థితి ప్రకటన



# బోనులో నిల

భారత న్యాయ వ్యవస్థ చరిత్రలో అదొక అపురూప ఘట్టం. అది అలహాబాద్ హైకోర్టు ద్వారా నమోదయింది. ఆ హైకోర్టుకు రెండు ప్రత్యేకతలు ఉన్నాయి. ఒకటి, దేశ ప్రధాని ఎన్నిక చెల్లనేరదని చెప్పిన తొలి కోర్టు అదే. వరసగా రెండు రోజులు క్రాస్ ఎగ్జామినేషన్ కోసం సాక్షాత్తు దేశ ప్రధాని వచ్చి బోనులో నిలబడిన కోర్టు కూడా అదే. మార్చి 18,19–1975న ప్రధాని ఇందిరాగాంధీ వచ్చి బోనులో నిలబడ్డారు. కాబట్టి ఆ వ్యాజ్యం కూడా చరిత్రాత్మకమే. 1971 నాటి సాధారణ ఎన్నికలలో రాయబరేలీ (ఉత్తరప్రదేశ్) లోక్‌సభ నియోజక వర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి ఇందిరాగాంధీపై పోటీ చేసిన సంయుక్త సోషలిస్ట్ పార్టీ ఉమ్మడి అభ్యర్థి రాజ్‌నారాయణ్ దాదాపు లక్ష ఓట్లతో తేడాతో ఓడిపోయారు. కానీ ఇందిర ఎన్నిక చెల్లదని రాజ్‌నారాయణ్ ఏప్రిల్ 24, 1971న పిటిషన్ దాఖలు చేశారు. ఆ ఎన్నికలలో ఆమె అక్రమాలకు పాల్పడ్డారన్నది ఆయన ఆరోపణ. 1971లో మొదలైన విచారణ 1975 జూన్ రెండోవారంతో పూర్తయింది. ఈ కేసు కోసం ఇందిర స్వయంగా కోర్టుకు హాజరై అందరి మన్ననలు పొందారు.

ఫిబ్రవరి 12, 1975 నుంచి సాక్షుల వాఙ్మూలాలు నమోదు చేశారు. ఆ సమయంలో పీఎన్ హక్సర్ (ప్లానింగ్ కమిషన్ ఉపాధ్యక్షుడు) ఇందిరకు అనుకూలంగా సాక్ష్యం ఇచ్చారు. ఎల్‌కే అద్వాణి (నాటి జనసంఘ్ జాతీయ అధ్యక్షుడు), కర్పూరీ ఠాకూర్ (బిహార్ మాజీ ముఖ్యమంత్రి), ఎస్. నిజలింగప్ప (కాంగ్రెస్–ఒ అధ్యక్షుడు) రాజ్‌నారాయణ్ తరపున సాక్ష్యం ఇచ్చారు. హైకోర్టులో ఎస్‌సీ ఖేర్ ఇందిర తరపు న్యాయవాది. శాంతిభూషణ్, ఆర్‌సీ శ్రీవాస్తవ రాజ్‌నారాయణ్ న్యాయవాదులు. జూన్ 12న అలహాబాద్ హైకోర్టు కిక్కిరిసిపోయింది. విపక్ష ప్రముఖులు మధులిమాయే, శ్యామ్‌నందన్ మిశ్రా, రబీరేలు సహా ప్రముఖ న్యాయవాదులు కూడా వచ్చారు. రాజీవ్‌గాంధీ, సోనియా గాంధీ కూడా హాజరయ్యారు. అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జగ్‌మోహన్‌లాల్ సిన్హా జూన్ 12న తీర్పు ప్రకటించారు. తన 258 పేజీల తీర్పుతో సిన్హా ఆమెను రెండు ఆరోపణలపై దోషిగా ప్రకటించారు. ఒకటి– ప్రధానమంత్రి సచివాలయోద్యోగి యశ్‌పాల్ కపూర్‌ను ఇందిర తన గెలుపునకు ఉపయోగించుకున్నారు. రెండు–తన ఎన్నికల ప్రచారానికి ఇందిర రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల సహాయం తీసుకున్నారు. ఈ అధికార దుర్వినియోగం వల్ల ఇందిర ఎన్నిక చెల్లదని, ఆరేళ్లు ఆమె ఎన్నికలలో పోటీ చేయరాదని సిన్హా తీర్పు చెప్పారు. కానీ, ప్రధాని పదవికి ఉన్న ప్రాధాన్యం దృష్ట్యా తీర్పు రెండు వారాల వరకు అమలు కాకుండా ఉండే వెసులుబాటును కల్పించారు. అంతవరకు ఇందిర ప్రధానిగా కొనసాగవచ్చు. అప్పీలు చేసుకోవచ్చు కూడా.

కాగా, సిన్హా తీర్పు 'టెక్నికల్ గ్రౌండ్స్'తో కూడుకున్నదని సుప్రీంకోర్టు

కాలంగా ప్రతిపక్షాలు అనుసరిస్తున్న ధోరణులని ఉటంకిస్తూ ఇందిర తరువాత ఎమర్జెన్సీ విధింపును గట్టిగా సమర్థించు కున్నారు. అంటే, ఎమర్జెన్సీ విధింపునకు అలహాబాద్ హైకోర్టు తీర్పు, దీనిపై సుప్రీంకోర్టు స్టే అత్యవసర కారణాలు మాత్రమే.

1974 ప్రారంభం నుంచి దేశంలో ఒకటొక టిగా వచ్చిన మార్పులు, పరిణామాలు, రాజకీయ కేంద్రీకరణలు అంతిమంగా ఇందిరను ఈ అసాధారణ చర్యకు పురికొల్పాయి. 26వ తేదీ ఉదయం ఆరుగంటలకి ఇందిర నివాసంలో జరిగిన సమావేశంలో మంత్రిమండలి ఎమర్జెన్సీ ప్రతి పాదనను లాంఛనంగా ఆమోదించింది. ఒక గంట తరువాత ఆకాశవాణిలో ప్రసంగిస్తూ ఇందిర ఎమర్జెన్సీని విధిస్తున్నట్టు ప్రకటించారు. ఎమర్జెన్సీ సంగతి అప్పటి కేంద్ర హోంమంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డికి రాష్ట్రపతి సంతకం పడిన తరువాత తెలిసింది. ఆ రాత్రి, నిద్రపోతున్న కాసును లేపి ఆయన చేత్తో సంతకం చేయించి ప్రకటన పని పూర్తి చేసిన వ్యక్తి హోంశాఖ సహాయమంత్రి ఓం మెహతాయే ('నా జీవిత కథ' జలగం వెంగళరావు).

## నియంతృత్వస్థాపనే ధ్యేయం?

ఇందిర హయాంలో కాంగ్రెస్ పార్టీ భారత పాలనా వ్యవస్థకు కొత్త స్వరూపం ఇవ్వాలని అనుకున్న మాట నిజం. పైన ఉదహరించిన పరిణా మాలలో అందుకు సంబంధించిన ఛాయలు స్పష్టంగా కనిపిస్తాయి. దేశాభివృద్ధి అధ్యక్ష తరహా పాలనలోనే సాధ్యమన్న ఒక వాదాన్ని అప్పటికి చాలా ముందే ప్రచారంలో పెట్టారు. 1973లో సోవియెట్ రష్యా అధ్యక్షుడు లియోనిడ్ బ్రెజ్నేవ్ భారత్‌కు వచ్చినప్పుడు మధులిమాయే ఆయనను కలిశారు. 'ప్రతిపక్షాలు అనేవి ఉంటే ప్రభుత్వానికి ప్రజలకీ మధ్య ఉద్విగ్న భరిత బంధం ఉండదు' (టైమ్స్ ఆఫ్ ఇండియా, నవంబర్ 30,1973) అన్నాడు. నాటి కాంగ్రెస్ అధ్యక్షుడు దేవ్‌కాంత్ బారువా అదే సమయంలో తరుచు చేసిన ఒక వ్యాఖ్య బాగా ప్రాచు ర్యంలో ఉ ండేది–ఇందిరే ఇండియా, ఇండియాయే ఇందిర. కానీ ఆయన మరొక నినాదం కూడా ఇచ్చారు. 'వర్తమాన పరిస్థితులలో భారత దేశానికి అసలు ప్రతిపక్షమే అవసరం లేదు' అని. చరిత్ర కారుడు ఆచార్య శ్రీనాథ్ రాఘవన్ ఇలాంటి విషయాలు తన గ్రంథం (ఇందిరాగాంధీ అండ్ ది ఇయర్స్ దట్ ట్రాన్స్‌ఫార్మ్‌డ్ ఇండియా)లో చాలా విషయాలు వెల్లడించారు. కాంగ్రెస్ నాయకులు, అధికారులు కొందరు అధ్యక్ష తరహా పాలనవైపు దేశాన్ని మళ్లించే ప్రయత్నం చేశారని రాఘవన్ కుండ బద్దలు కొట్టి చెప్పారు. ఇందుకు వారు ఆదర్శంగా తీసుకున్న వ్యక్తి చార్ల్స్ డీగోల్ (ఫ్రాన్స్). 1975 సెప్టెంబర్‌లో ఇందిర సన్నిహితుడు బీకే నెహ్రూ రాసిన లేఖను మరొక ఉదాహరణగా చూపారు రాఘవన్. ఎమర్జెన్సీ పేరుతో విశేష ప్రజా మద్దతు వచ్చిందని, దీనిని ఉపయోగించుకోవాలని బీకే నెహ్రూ రాశారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం మన అవసరాలకు తగినట్టుగా లేదని కూడా బీకే తేల్చారు. ఏం చేయాలన్నా ఎన్నికల తంతు ఒకటి ఉంటుందని ఆయన బాధపడిపోయారు. బీకే నెహ్రూ ప్రతిపాద నకు అనూహ్యంగా జగ్జీవన్‌రామ్, స్వరణ్ సింగ్‌ల మద్దతు కూడా లభించింది. నాటి రక్షణ మంత్రి బన్సీలాల్ ఇందిరను జీవితకాలపు అధ్యక్షురా లిని (పార్టీకి) చేయాలని అభిప్రాయపడ్డాడు. హరియాణా, పంజాబ్, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రులు కొత్త రాజ్యాంగ పరిషత్ ఏర్పాటుకు అక్టోబర్ 1976న పిలుపునిచ్చారు.

## అంతర్జాతీయ కోణం

చాలా ప్రశ్నలు ఇప్పటికీ సమాధానాల కోసం వేచి ఉన్నాయి. నాటి జాతీయ అంతర్జాతీయ పరిస్థితులు, ఒత్తిడులు అత్యవసర పరిస్థితి విధింపు

# బడిన ప్రధాని



జస్టిస్ జగ్‌మోహన్‌లాల్ సిన్హా



రాజ్‌నారాయణ్

కొట్టివేస్తుందని ఇందిర తరపు కేసు చేపట్టిన ప్రఖ్యాత న్యాయవాది నాని పాల్కీవాలా సలహా ఇచ్చారు. అయితే అలహాబాద్ హైకోర్టు తీర్పుకు బేషరతుగా నిలిపివేయడానికి ఆ సుప్రీంకోర్టు నిరాకరించింది. కేవలం షరతులతో ఒక స్టే మంజూరు చేసింది. ఇందిర ప్రధానిగా కొనసాగవచ్చునని, పార్లమెంటు ఉభయసభలలో జరిగే చర్చలలో పాల్గొనవచ్చునని, కానీ సభలో జరిగే ఓటింగ్‌లో పాల్గొనే హక్కు మాత్రం ఆమెకు లేదని వెకేషన్ జడ్జి వి.ఆర్.కృష్ణయ్యర్ తీర్పునిచ్చారు. తరువాత పాల్కీవాలా తన వకాల్తాను వదులుకున్నారు. ఓటుహక్కులేని ప్రధాని సభలో ఎందుకు అని ప్రతిపక్షం, ప్రధానిగా కొనసాగే హక్కు ఇందిరకు న్యాయస్థానమే ఇచ్చిందని కాంగ్రెస్ పక్షం వాదించాయి. అసలు ఆమె ఎన్నిక చెల్లదని కోర్టు స్పష్టంగా ప్రకటించాక ఇక ప్రధానిగా కొనసాగే నైతిక హక్కు ఎక్కడిదని విపక్షం ప్రశ్న.

రాజ్‌నారాయణ్ తరపు న్యాయవాది శాంతిభూషణ్ కొడుకు ప్రశాంత్ భూషణ్ రాసిన 'ది కేస్ దట్ షుక్ ఇండియా: ది వెర్డిక్ట్ దట్ లెడ్ టు ది ఎమర్జెన్సీ' పుస్తకంలో కొన్ని విషయాలు పొందుపరిచారు. మే 23న కోర్టుకు వేసవి సెలువులు ఇచ్చారు. అప్పటి నుంచి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జగ్‌మోహన్‌లాల్ సిన్హా మీద చాలా ఒత్తిడులు వచ్చాయి. తీర్పులో ఏమి ఉండబోతున్నాయో కూపీ లాగడానికి సీఐడీలోని స్పెషల్ టాస్క్ ఫోర్స్ తన వంతు ప్రయత్నం చేసింది. సిన్హా వద్ద స్టెనోగా పనిచేసిన మన్నాలాల్ ఇంటికి సీఐడీ గుఢచారులు రెండుసార్లు వెళ్లారు (లాల్‌ను జస్టిస్ సిన్హాయే తీర్పు టైప్ చేసిన తరువాత ఎవరికీ దొరక్కుండా సెలవు మీద పంపేశారని కుల్దీప్‌నయ్యర్ రాశారు). సిన్హా ఇంట్లోనే ఉన్నా, ఉజ్జయిన్‌లో ఉన్న తన అన్నగారి (ప్రొఫెసర్) ఇంటికి వెళ్లారని చెప్పించారు. ప్రస్తుతం ప్రయాగ్‌రాజ్‌లోనే ఉంటున్న జస్టిస్ విపిన్ సిన్హా (జేఎంఎల్ సిన్హా కుమారుడు, అలహాబాద్ హైకోర్టు జడ్జిగా 2020లో పదవీ విరమణ చేశారు) అనుభవాలు కూడా కాస్త భయం గొలిపేవిగానే ఉన్నాయి. ఆయన అప్పుడు 11వ తరగతి విద్యార్థి. తీర్పు ఇవ్వడానికి ముందు, ఇచ్చిన తరువాత కూడా చాలా హీనమైన భాషలో ఫోన్‌లో తమ కుటుంబాన్ని దూషించారని ఆయన చెప్పారు.

జస్టిస్ సిన్హా తీర్పుతో ఎందరో దిగ్భ్రాంతికి గురయ్యారు. ఇందిర న్యాయవాది ఖేర్ వెంటనే తన సోదరుని కొడుకు వీఎన్ ఖేర్ (తరువాత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అయ్యారు)ను పిలిచి స్టేకు దరఖాస్తు రాయించారు. వీఎన్ ఖేర్ ఆదరాబాదరా చేతితో రాసి ఇచ్చారు. తరువాత జస్టిస్ సిన్హా తాను ఇచ్చిన తీర్పు మీద తానే 20 రోజులు స్టే విధించారు. ఆ దరఖాస్తును టైప్ కూడా చేయించలేనంత తొందరగా న్యాయమూర్తికి సమర్పించారు. జస్టిస్ జేఎంఎల్ సిన్హా 2008లో కన్నుమూశారు.

నిర్ణయాన్ని ప్రభావితం చేశాయా? ఇందుకు సంబంధించి కూడా పలు వాదాలు వినిపిస్తూనే ఉన్నాయి.

'శ్రీమతి ఇందిరాగాంధీ సోవియెట్ నాయకుల సలహాతో దేశంలో అత్యవసర పరిస్థితి విధించినట్లు అర్థమైంది. సోవియెట్‌లో అసంతృప్తిని ఏ మాత్రం సహించలేరు. అసంతృప్తిని వ్యక్తం చేసిన వారిని ఇక ఎన్నటికీ తిరిగిరాని విధంగా సైబీరియాకు పంపిస్తారు. ఇక్కడా ప్రతిపక్షాల వారిని అదే విధంగా జైళ్ల పాలు చేశారు...' ఈ వాక్యాలు అకాలీదళ్ ప్రముఖుడు, పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి, కేంద్ర మాజీ మంత్రి, మాజీ గవర్నర్ సుర్జీత్ సింగ్ బర్నాలా రాసిన 'క్వెస్ట్ ఫర్ ఫ్రీడమ్: స్టోరీ ఆఫ్ ఏన్ ఎస్కేప్' గ్రంథంలోనివి (స్వేచ్ఛ కోసం: ఒక విహంగయాత్ర, అను: డాక్టర్ జె. చెన్నయ్య, తెలుగు అకాడమి, తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణ, 2003, పే.34). బర్నాలా కూడా అత్యవసర పరిస్థితిలో అరెస్టయి పంజాబ్ జైళ్లలో దుర్భర జీవితం అనుభవించారు. కాలిఫోర్నియా విశ్వవిద్యాలయానికి చెందిన రాజన్ మేనన్ 'ఇండియా అండ్ ది సోవియెట్ యూనియన్:ఏ న్యూ స్టేజ్ ఆఫ్ రిలేషన్స్' పత్రంలో (1978) రాసిన అంశాలు బర్నాలా అభిప్రాయానికి సమీపంగా ఉంటాయి. 'ది మిత్రొఖిన్ ఆర్కైవ్స్ 2:ది కేజీబీ అండ్ ది వరల్డ్' పుస్తకం (రచయిత వాజిలి మిత్రొఖిన్) ప్రకారం ఇందిర హయాంలో కేజీబీ లంచాలు పడేసి కేంద్ర మంత్రుల నుంచి రహస్యాలు కొనుక్కునేది. ఇందులో కేజీబీ జనరల్ ఒలేఫ్ కులుగిన్ చెప్పిన విషయాలు ఎక్కువ. భారత్‌లో కార్యకలాపాల కోసం కులుగిన్‌ను 1970లో ఆ సంస్థ నియమించింది. 'ఇందిరాగాంధీ 1975లో భారత్‌లో అత్యవసర పరిస్థితిని విధించే టట్టు చేయడంలో మా ఏజెంట్లు విజయవంతంగా పని చేశారు. అదే (అత్యవసర పరిస్థితి) విపక్షాల నాయకులను జైళ్లకు పంపించడానికి ఆమె ప్రభుత్వానికి అధికారం కల్పించింది. పౌర హక్కులను రద్దు చేయడానికీ, పత్రికల మీద 19 మాసాల పాటు సెన్సార్‌షిప్ విధించడానికీ అవకాశం చూపింది' అని కులుగిన్ చెప్పాడు. 'ది మిత్రొఖిన్ ఆర్కైవ్స్ 2: ది కేజీబీ అండ్ ది వరల్డ్' పుస్తకంలోని విషయాల ఆధారంగా ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సెప్టెంబర్ 18, 2005లో ఒక లోతైన వార్తా కథనం ప్రచురించింది.

కానీ, అవినీతికి వ్యతిరేకంగా లోక్‌నాయక్ ఉద్యమిస్తే ఆయన మీద దేశ వ్యతిరేక ముద్ర వేశారు ఇందిర. కాబట్టి ఈ ఇద్దరిలో చరిత్ర ఎవరికి పెద్ద పీట వేయాలి?

యూపీఏ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ కార్యదర్శి సంజయ్ బారు రాసిన వ్యాసం (జూన్ 6, 2018, డెయిలీ ఓ)లో ఇంకొన్ని ఆసక్తికరమైన అంశాలు ప్రతిపాదించారు. అవి అత్యవసర పరిస్థితి నేపథ్యంలోనివే. చిలీ పాలకుడు సాల్వెడార్ అలెండి తరువాత నిన్నే అమెరికా లక్ష్యంగా చేసుకుంది అంటూ క్యూబా అధ్యక్షుడు ఫైడెల్ కాస్ట్రో చేసిన హెచ్చరికతోనే ఇందిరాగాంధీ అగమేఘాల మీద అత్యవసర పరిస్థితిని విధించారన్న వాదన గురించి కూడా సంజయ్ బారు ప్రస్తావించారు. అత్యవసర పరిస్థితి నేపథ్యం, కాలం ఇలాంటి చారిత్రక వైచిత్రుల సమ్మేళనమే. వీటి మధ్య వినిపించిన ఇందిర ప్రచార సలహాదారు హెచ్‌వై శారదాప్రసాద్ వ్యాఖ్య అద్భుతం. అది, 'తన ప్రధానమంత్రి పదవి నుంచి తననే కూల్చడానికి ఇందిరాగాంధీ స్వయంగా చేసుకున్న కుట్ర'. మిగతా వాటి కంటే చరిత్రలో నిలిచే వాదన ఇదే అనిపిస్తుంది.

**విద్యార్థి ఉద్యమం, విపక్షాలు**

విపక్షం బలహీనంగానే ఉన్నా, 1974 ప్రారంభం నుంచి దేశంలో ఇందిరకు ఇబ్బంది కలిగించే వాతావరణం నెలకొనడం మొదలయింది. నగర్వాలా కేసు వంటి వాటితో ఇందిర ప్రతిష్ట

కోల్పోయారు. అంతకు ముందువరకు భారతదేశ ప్రగతికి ఆమె ప్రతీక. కాంగ్రెస్ పార్టీకి ఒక ఆశాజ్యోతి. కాంగ్రెస్ పార్టీ తప్ప దేశానికి దిక్కు లేదు. దాదాపు స్థిరపడిపోయిన ఈ అభిప్రాయాలను పటాపంచలు చేయడం ప్రారంభించిన వారు జయప్రకాశ్ నారాయణ్. స్వాతంత్ర్యోద్యమం తరువాత రాజకీయాలకు దూరంగా ఉంటున్న జేపీ 'సంపూర్ణ విప్లవం' పిలుపుతో మళ్లీ రాజకీయాలలో ప్రవేశించారు. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలోను, క్విట్ఇండియా ఉద్యమంలోను ఒక ఊపు ఊపి స్వాతంత్ర్య భారతదేశంలో పదవీ రాజకీయాలకు దూరంగా పౌనార్ (మహారాష్ట్ర)లోని వినోబా ఆశ్రమంలో గడుపుతున్న జేపీ ఆనాటి రాజకీయ పరిస్థితులను బట్టి సంపూర్ణ విప్లవం పిలుపు ఇచ్చారు. రాజకీయ అస్థిరత్వం, రాజకీయ అవినీతి, విలువల పతనం, దిగజారిపోతున్న విద్యా ప్రమాణాలు, నిరుద్యోగం, డబ్బు సంచుల చుట్టూ పరిభ్రమిస్తున్న ఎన్నికల వ్యవస్థ, విధానం, వీటికి వ్యతిరేకంగా జేపీ ఉద్యమించదలిచారు. ఎనభయ్ సంవత్సరాల వృద్ధాప్యంలో ఆయనను ఇలాంటి నిర్ణయం తీసుకునేటట్టు చేసినది బిహార్. అది ఆయన స్వరాష్ట్రం.

అరాచక శక్తులకు, వెనకబాటుతనానికి బిహార్ పెట్టింది పేరు. అలాంటి చోట రాజకీయ స్థిరత్వాన్ని, అభివృద్ధిని సాధించడం కాకుండా అందుకు విరుద్ధంగా కాంగ్రెస్ పార్టీ వ్యవహరించింది. ముఖ్యమంత్రి వ్యవస్థని తోలుబొమ్మలాటకు మించి వినోద భరితం చేసింది. 1967 నుంచి 1971 వరకు అక్కడ పదిమంది ముఖ్యమంత్రులు మారారు. మహామాయా ప్రసాద్‌తో మొదలైన ఈ ప్రహసనానికి బోలా పశ్వాన్‌శాస్త్రి రాకతో తెర పడింది. ఈ పదిమందిలో సతీశ్ ప్రసాద్‌సింగ్ కేవలం నాలుగు రోజులు సీఎంగా ఉన్నారు. ఈ నాటకానికి ఇక తెరదించమని, అసెంబ్లీకి మళ్లీ ఎన్నికలు జరిపించమని, జూన్ 27, 1968న కాంగ్రెస్ నేత ఇందిరకు టెలిగ్రాం విన్నపం పంపినవారు జేపీయే. తరువాత పరిస్థితులు మరింత విషమించాయి. ధరలు అదుపు తప్పాయి. ద్రవ్యోల్బణం పెరిగింది. ఈ స్థితిలో 1973 చివరిలో జేపీ సంపూర్ణ విప్లవం పిలుపుతో ప్రజలను చైతన్యవంతం చేసే కృషి ప్రారంభించారు. సిటిజన్స్ ఫర్ డెమోక్రసి, యూత్ ఫర్ డెమోక్రసి సంస్థలు స్థాపించారు. కేంద్రమంత్రులు బిహార్ మంత్రుల అవినీతి చరిత్రలను బహిరంగ సభలలో ఏకరువు పెట్టారు. విశేషమేమిటంటే జేపీ పిలుపునకు బిహార్ మాత్రం వెంటనే స్పందించలేదు. జేపీ ఊహలన్నీ గుజరాత్ విద్యార్థులు స్థాపించిన నవ నిర్మాణ్ సమితి సాగించిన ఉద్యమం ద్వారా అక్కడ నిజం కావడం మొదలయ్యాయి. గుజరాత్ ఉద్యమ ప్రభావంతో బిహార్‌లో కూడా రాష్ట్ర ప్రభుత్వం రద్దు గురించి ఆందోళన మొదలైంది. ఎమ్మెల్యేలను ఘెరావ్ చేసి, నిల్చున్న పాటున రాజీనామాలు చేయించడం కూడా గుజరాత్ ఉద్యమాన్ని చూసి బిహార్ విద్యార్థులు ప్రారంభించారు. చాలాచోట్ల కాల్పులవరకు వెళ్లింది.

గుజరాత్ విద్యార్థులు పెరిగిన మెస్ చార్జీలు తగ్గించాలని, హాస్టళ్లలో వసతులు మెరుగుపరచాలన్న చిన్న చిన్న డిమాండ్లతో ఉద్యమించారు. ప్రభుత్వం దమననీతిని పాటించింది. దీనితో రెచ్చిపోయిన విద్యార్థులు ముందు విద్యాశాఖ మంత్రి రాజీనామా కోరారు. ఆపై ముఖ్యమంత్రి చిమన్‌భాయ్ పటేల్ రాజీనామా చేయాలంటూ ఆందోళనను మలుపు తిప్పారు. చివరికి అసెంబ్లీని రద్దుచేసి మళ్లీ ఎన్నికలు జరిపించక తప్పలేదు. జూన్, 12, 1975 గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. కాంగ్రెస్ ఓడిపోయింది. జనమోర్చా అధికారంలోకి వచ్చింది. సరిగ్గా అదే రోజున అలహాబాద్ హైకోర్టు తీర్పును ప్రధాన న్యాయమూర్తి జగ్‌మోహన్ లాల్‌సిన్హా ప్రకటించారు. 1971 నాటి లోకసభ ఎన్నికలలో రాయ్‌బరేలీ నుంచి ఇందిర ఎన్నిక చెల్లదని ఆ తీర్పు సారాంశం. ఈ తీర్పును నిలిపివేయాలని కోరుతూ ఇందిర సుప్రీంకోర్టుకు వెళ్లారు. కాని సుప్రీంకోర్టు అలహాబాద్ హైకోర్టు తీర్పును నిలిపివేయకుండా షరతులతో తీర్పుపై స్టే ఇచ్చింది. దీనితో ఇందిర ప్రధాని పదవిలో కొనసాగరాదంటూ ప్రతి విషయాలు జేపీ సారథ్యంలో ఆందోళనకు ఉపక్రమించాయి. ఈ పరిస్థితిని ఎదుర్కొనడానికి సిద్ధార్థ శంకర్ రే ఆమెకు సూచించిన మార్గం ఎమర్జెన్సీ.



జేపీ మొరార్జీ



బాలాసాహెబ్ దేవరస్ ఏబీ వాజపేయి ఎల్‌కే అద్వాణి నానాజీ దేశ్‌ముఖ్



## సర్దార్ పటేల్ కుమార్తె మణిబెన్ నాయకత్వంలో సత్యాగ్రహం

**జూలై 21–25, 1975** తొలి దశ సత్యాగ్రహాలు పది రోజులు జరిగాయి. రెండో దశ సత్యాగ్రహం **నవంబర్ 14, 1975** నుంచి జనవరి **26, 1976** మధ్య జరిగింది. చాందినీ చౌక్ (ఢిల్లీ)లో సత్యాగ్రహం జరిగింది. డిసెంబర్ **12, 1975**న దశల వారీగా జరిగిన సత్యాగ్రహం ప్రత్యేకమైనది. అంతా మహిళలే పాల్గొన్న ఈ సత్యాగ్రహంలో సర్దార్ పటేల్ కుమార్తె మణిబెన్ పటేల్ (ఎంపీ) పాల్గొన్నారు. నాలుగు బృందాలను వరసగా అరెస్టు చేశారు. అందరినీ జైలుకు పంపినా మణిబెన్‌ను మాత్రం పోలీస్ స్టేషన్‌లో కొద్దిసేపు ఉంచి విడుదల చేశారు. దీనికి నిరసనగా ఆమె ఫిబ్రవరి **5, 1975**న పార్లమెంట్‌లో హక్కుల తీర్మానం ప్రవేశపెట్టారు. సత్యాగ్రహం చేస్తున్నవారు అక్కడ నినాదాలు ఇవ్వడంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడిందని, ఆ పరిస్థితులో మణిబెన్‌కు ప్రత్యేక రక్షణ కల్పించవలసి వచ్చినందునే పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లారని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి సమాధానం ఇచ్చారు.



### అర్ధరాత్రి అరెస్టులు

అర్ధరాత్రి రెండు–మూడు గంటల మధ్య జయప్రకాశ్ నారాయణ్‌ను, మొరార్జీ దేశాయ్‌ని పోలీసులు అరెస్టు చేశారు. మదర్లాండ్ (ఇంగ్లీషు) దినపత్రిక ఎడిటర్ కె.ఆర్.మల్కానీని అపుడే అరెస్టు చేశారు. మల్కాని ఇంటిని పోలీసులు చుట్టుముట్టి చాలా హడావిడి చేశారు. (మిడ్‌నైట్ నాక్, మల్కానీ) మరునాడు ఉదయం జనసంఘ్ నాయకులు అటల్ బిహారీ వాజ్‌పేయి, లాల్ కృష్ణ అద్వాణి, మధుదండా వతే, మరికొందరిని బెంగుళూరులో అరెస్టు చేశారు. ఈ అరెస్టులు నిజంగా విశేషమే. పార్టీ ఫిరాయింపుల బిల్లుపై ఎమ్మెల్యేల అభిప్రాయం సేకరించడానికి పార్లమెంటరీ బృందం తరఫున వెళ్లి, ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఉండగానే వాజపేయి తదితరులను పోలీసులు అరెస్టు చేశారు. అది కూడా శాంతిభద్రతలకు విఘాతం కల్గించిన వారిపై ప్రయోగించే ఐ.పి.సి.151 నిబంధనతో అరెస్టు చేశారు. ఇదంతా అద్వాణి తన జైలు డైరీ 'ప్రిజనర్స్ స్క్రాప్‌బుక్'లో వర్ణించారు. జూన్ 30, 1975న నాటి ఆర్‌ఎస్‌ఎస్ సర్‌సంఘచాలక్ బాలాసాహెబ్ దేవరస్‌ను అరెస్టు చేశారు. ఆగస్ట్ 28న నానాజీ దేశ్‌ముఖ్‌ను అరెస్టు చేశారు. సెప్టెంబర్ 16న బొంబాయిలో జరిగిన సమావేశంలో సంఘర్ష సమితి కార్యదర్శిగా రవీంద్ర వర్మను నానాజీ స్థానంలో ఎన్నుకున్నారు. వర్మను కూడా ఫిబ్రవరి 12, 1976న అరెస్టు చేశారు. ఆంధ్రలో పెద్దలు గౌతు లచ్చన్నని, తెన్నేటి విశ్వనాథం, జూపూడి వంటి వారిని అరెస్టు చేశారు. దేశం మొత్తంమీద ఎమర్జెన్సీ పేరుతో ఆ 21 మాసాలలో దాదాపు లక్ష మందిని అరెస్టు చేశారు. లక్షన్నర అని మరో వాదన (జేపీని నవంబర్ 12, 1975న, మొరార్జీని ఫిబ్రవరి 24, 1976న, అటల్ బిహారీ వాజపేయి ఫిబ్రవరి 26, 1976న అస్వస్థత కారణంగా విడుదల చేశారు).

### సెన్సార్‌షిప్

ఎమర్జెన్సీ విధించిన తరువాత వెంటనే తీసుకున్న చర్య సెన్సార్‌షిప్. జూన్ 26 నుంచి ఇది అమలులోకి వచ్చింది. ఆ తరువాత ప్రకటించినదే ఇరవై సూత్రాల ఆర్థిక కార్యక్రమం. ఈ కార్యక్రమం ఎమర్జెన్సీ తీవ్రత ఎలాంటిదో తెలియకుండా దృష్టి మళ్లించడానికి గొప్పగా ఉపయోగపడింది. ఇరవై సూత్రాలతోపాటు ఇందిర కుమారుడు సంజయ్‌గాంధీ ప్రవచించిన నాలుగు సూత్రాల ప్రణాళిక కూడా పనిలో పనిగా అమలులోకి వచ్చింది. ఆ సూత్రాలలో ఒకటి కుటుంబ నియంత్రణోద్యమం. ఇదే అంతిమంగా కాంగ్రెస్‌ను అధికారపీఠం నుంచి కూలద్రోయడానికి ఆయుధమైంది. ఎమర్జెన్సీలో రాజ్యాంగాన్ని సవరించారు. లోకసభ కాలపరిమితి పెరిగింది. న్యాయమూర్తులను బదిలీ చేశారు. క్రమశిక్షణకు ప్రాధాన్యం ఇచ్చామంటూ వందలాది మందిని ఉద్యోగాల నుంచి తొలగించారు. ఒక్క ఆంధ్రలోనే 1975 సెప్టెంబర్ నాటికి 1600మంది ఎన్‌జిఓలను బలవంతంగా పదవీవిరమణ చేయించారు. ఈ విషయాన్ని అప్పటి ముఖ్యమంత్రి జలగం సెప్టెంబర్ 20న సెక్రటేరియెట్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఇలా క్రమశిక్షణ పాటించనందుకు, అసమర్థత పేరుతోనే ఉద్యోగాల నుంచి పలువురిని తొలగించినట్టు అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు చాలా సగర్వంగా పత్రికలకు స్టేట్‌మెంట్లు ఇచ్చారు. ఆర్‌ఎస్‌ఎస్, ఆనందమార్గ్, జామాయతీ ఇస్లాం, సి.పి.ఐ. (ఎం.ఎల్)లతో సహా 26 సంస్థలపై నిషేధం విధించారు. విశేషమేమంటే క్విట్‌ఇండియా నాయిక అరుణా అసఫాలీతో సహా ఎందరో ప్రముఖులు ఇందిర చర్యను ప్రశంసించారు. కాంగ్రెస్ సంగతి సరేసరి.

ఇంతకీ ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ఎవరూ ఎందుకు కోర్టును ఆశ్రయించలేదు? ఇందుకు కారణం ఒక్కటే. ఆగస్ట్ 1,1975న 38వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. జూలై 23 రాజ్యసభ, మరునాడు లోక్‌సభ ఆమోదించాయి. కాబట్టి ఎమర్జెన్సీని ఎవరూ కోర్టులలో సవాలు చేయడం నిషేధం. ఆగస్ట్ 16, 1975న 39వ రాజ్యాంగ సవరణ కోసం మరొక బిల్లు ప్రవేశపెట్టారు. దీని ప్రకారం ప్రధాని, లోక్‌సభ స్పీకర్, రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎంపిక మీద కోర్టులో సవాలు చేయడం నిషేధం.

అయితే ఇందిర రాజీనామా చేయాలన్న తమ డిమాండ్ నుంచి ప్రతిపక్షాలు వెనక్కు తగ్గలేదు. ఆనాడు 542 మంది సభ్యులున్న లోకసభలో ప్రతిపక్షాలన్నింటి బలం అరవైలోపే. కాని, జూన్ 25, 1975 జె.పి.లోకసంఘర్ష సమితిని ఏర్పాటు చేశారు. దీనికి మొరార్జీ దేశాయ్ అధ్యక్షుడు. జనసంఘ్‌కు చెందిన నానాజీ దేశ్‌ముఖ్ కార్యదర్శి ఈ సంస్థ ఆధ్వర్యంలో చెప్పుకోతగిన స్థాయిలో ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా రహస్యోద్యమం జరిగింది. తనకు వ్యతిరేకంగా ఎంత ప్రజాగ్రహం నెలకొని ఉన్నదో ఎన్నికలలో గాని ఇందిరకు తెలియలేదు.




### జనతా పార్టీ

లోకసభకు తాజాగా ఎన్నికలు నిర్వహిస్తున్నట్టు ఇందిర జనవరి 18,1977న ఆకాశవాణి ప్రసంగంలో వెల్లడించారు. అదే రోజున మొరార్జీ, అద్వాణీలు విడుదల అయ్యారు. జనవరి 20, 1977న జనతా

పార్టీ ఆవిర్భవించింది. నిజానికి జనతా పార్టీకి 1976లోనే బీజాలు పడ్డాయి. మార్చి 20-21, 1976న బొంబాయిలో విపక్షాల సమావేశం జరిగింది. జనసంఘ్, కాంగ్రెస్-ఒ, భారతీయ లోక్‌దళ్, సోషలిస్టు పార్టీ, ఆర్ఎస్‌పీ, ఇంకొందరు ప్రముఖులు హాజరయ్యారు. దీనికి డీఎంకే ప్రతినిధి, ఆచార్య జేబీ కృపలానీ కూడా హాజరయ్యారు. విపక్షాల విలీనంతో కొత్త పార్టీ ఏర్పాటు కాబోతున్నదని మే 25న జేపీ ప్రకటించారు. జనవరి 24వ వామపక్షాలు మినహా మిగిలిన పార్టీలు, జనతాపార్టీగా అవతరించాయి. కాంగ్రెస్ (ఒ) జనసంఘ్, భారతీయ లోకసభ, సోషలిస్టు పార్టీ కలిసి పోటీ చేయాలని నిర్ణయించాయి. ఫిబ్రవరి 2న బాబూజగ్జీవన్‌రాం కాంగ్రెస్‌ని, ప్రభుత్వాన్ని విడిచి ఇందిరపై ఆరోపణలు చేయడం ఊహించని పరిణామం. ఎన్నికలు జరిగాయి. ఎమర్జెన్సీలో కీలకపాత్ర వహించిన వారంతా సంజయ్, బన్సీలాల్, వి.సి.శుక్లా మట్టికరిచారు. వీరితోపాటు ఇందిర కూడా ఓటమి పాలయ్యారు. పదవికి రాజీనామా చేస్తూ ఇందిర ఎమర్జెన్సీని ఎత్తివేసినట్టు ప్రకటించారు. మార్చి 21,1977న తాత్కాలిక రాష్ట్రపతి బి.డి.జెట్టి ఎమర్జెన్సీని రద్దు చేశారు. ఎన్నికలు జరిగి, జనతా పార్టీ అధికారంలోకి వచ్చింది. మొరార్జీదేశాయ్ ప్రధాని పదవి చేపట్టారు. ప్రభుత్వం రెండేళ్లలో కూలిపోయింది.

**నమోదు కాని చరిత్ర**

చరిత్రకారులదీ, మేధావులదీ మళ్లీ అదే తప్పిదం. స్వాతంత్ర్య పోరాటాన్ని నమోదు చేయడం దగ్గర, నాటి త్యాగాలను అంచనా వేయడం దగ్గర జరిగిన ఘోర తప్పిదం అత్యవసర పరిస్థితిని అక్షరబద్ధం చేయడం దగ్గరా పునరావృత్తమయింది. ఒక కుటుంబానికీ, ఒక రాజకీయ పార్టీకీ ఇష్టం లేనంత మాత్రాన చరిత్ర నమోదు ప్రక్రియ నిలిచిపోదు. ఏవేవో కారణాలతో ప్రత్యక్షసాక్షులు మౌనం దాల్చినా కూడా చరిత్ర మూగబోదు. ఒక చారిత్రక తప్పిదాన్ని తాము సమర్థించిన వాస్తవం బయటకు రాకుండా ఉండేందుకు అసలు ఆ చరిత్రకే పాతర వేద్దామని ఎవరు భావించినా సాధ్యం కాదు. పరిశోధన కన్నా, చారిత్రక సత్యాల కన్నా వాదాలకూ, రాజకీయ విశ్వాసాలకూ పెద్ద పీట వేసే చరిత్రకారుల కలం తడబడినా చరిత్ర మరుగున పడదు. భారతదేశంలో అత్యవసర పరిస్థితి (1975-77) ఘట్టానికీ ఇదే వర్తిస్తుంది. కోర్టులు అభిశంసించినా పదవి వదలని నేతల ఆదేశాలను సైన్యం, పోలీసులు పాటించ రాదంటూ ఒకరిద్దరు విపక్ష నేతలు ఇచ్చిన పిలుపు ఆధారంగా ఎమర్జెన్సీ వికృత విశ్వరూపాన్ని కుదించి చూపేందుకు శతథా ప్రయత్నిస్తున్న నెత్తురు చల్లారిన వ్యక్తులు వర్తమాన సమాజాన్ని దగా చేయడం సరికాదు. జనతా ప్రయోగం విఫలమైనంత మాత్రాన, దేశంలో ప్రజాస్వామ్య దేవతను పునఃప్రతిష్ఠించ డానికి జరిగిన ఉద్యమం వృథా ప్రయత్నంగా పరిగణించడం చరిత్రకు ద్రోహం చేయడమే. ఎమర్జెన్సీ విధించిన శక్తుల వాదనకు వంత పాడినట్టే. ఆ కాలంలో కాంగ్రెస్‌ను దేశ వినాశకారిగా విశ్వసించి తిరగబడిన పార్టీలూ, ధ్వజమెత్తిన వ్యక్తులూ తరువాత ఎమర్జెన్సీని రుద్దిన పార్టీ మోచేతి నీళ్లతో అధికార దాహం తీర్చుకున్నంత మాత్రాన మిగిలిన వారి పోరాటపటిమ చరిత్ర పుటలలో చోటుకు అనర్హమైపోదు. అత్యవసర పరిస్థితి వ్యతిరేక ఆందోళనలో నిశ్చయంగా ఆర్ఎస్ఎస్‌దే అగ్రస్థానం. సంఘపరివార్ సభ్యుల రాజకీయ వేదిక భారతీయ జనసంఘ్‌దే నాయకత్వం. స్వయంసేవకుల త్యాగాలను సాధారణ పౌరులు మన్నించారు, గుర్తించారు. ఆ పోరాటంలో ఆర్ఎస్ఎస్ నిర్వహించిన నిర్మాణాత్మక పాత్ర భారత ప్రజల అభిప్రాయాన్ని సమూలంగా మార్చేసింది. నాటి సర్‌సంఘచాలక్ దేవరస్ ప్రధానికి రాసిన ఒక లేఖకు వక్రభాష్యం చెప్పి, ఆర్ఎస్ఎస్ చేసిన పోరాటం మీద, వారి చరిత్ర మీద బురద చల్లడం సాధ్యం కాదు. గాంధీజీ హత్యానంతరం పరమపూజనీయ ఎంఎస్ గోళ్వాల్కర్ నాటి కేంద్ర ప్రభుత్వానికి లిఖిత పూర్వకంగా ఇచ్చిన వివరణే దేవరస్ లేఖలోను ప్రతిబింబించింది. అది-మేం ఎన్నికల రాజకీయాలకు దూరం. మా ధ్యేయం హిందూ సమాజ సంఘటన. ఆర్ఎస్ఎస్ మీద కాంగ్రెస్, సీపీఐ చేస్తూ వచ్చిన దుష్ప్రచారం ఎమర్జెన్సీ విధింపు అనే ఆ రెండు విధ్వంసక శక్తుల చర్యలతోనే పటాపంచలు కావడం గొప్ప చారిత్రక వైచిత్రి. చివరికి సీపీఐ తలదించుకుంది. కలకత్తా డేట్‌లైన్‌తో జూన్ 27, 2015న ది హిందూలో వెలువడిన వార్త ఇందుకు నిదర్శనం. 1975 సమయంలో రాజకీయ పరిస్థితిని అంచనా వేయడంలో పార్టీ విఫలమైందని అత్యవసర పరిస్థితిని సమర్థించడం రాజకీయ తప్పిదమని సీపీఐ జనరల్ సెక్రటరీ సురవరం సుధాకరరెడ్డి ఇచ్చిన ప్రకటన అది. అది పెద్ద రాజకీయ తప్పిదమేనని మరొక ప్రముఖ సీపీఐ నేత గురుదాస్ దాస్ గుప్తా కూడా అన్నారు. నిజానికి అలనాటి నాయకుడు చండ్ర రాజేశ్వరరావు తమకు కాంగ్రెస్ ఇవ్వవలసినంత గౌరవం (అత్యవసర పరిస్థితి వంటి పెద్ద నేరాన్ని బాహటంగా సమర్థించినా) ఇవ్వలేదని వాపోయిన మాట గుర్తుకు తెచ్చుకోవాలి. ఆర్ఎస్ఎస్‌కు జాతిలో గౌరవ ప్రతిపత్తులు ఇనుమడించడం భరించలేకనే జనతాపార్టీ ప్రయోగాన్ని విచ్ఛిన్నకర శక్తులు భగ్నం చేశాయి. కానీ అంతకంటే ప్రబలమైన జాతీయశక్తి- భారతీయ జనతా పార్టీ- ఆవిర్భావానికి ఆ పరిస్థితులే బాటలు వేశాయి. ఇదొక వైచిత్రి. అత్యవసర పరిస్థితి పరిణామాల అంతిమ ఫలితం బీజేపీ పుట్టుక. ఇప్పుడు కాంగ్రెస్ చేసిన తప్పిదాలను సరిచేసే పనిలో నిమగ్నమై ఉంది.

**- డా. గోపరాజు నారాయణరావు**

# 'కాంగ్రెస్



**1975లో దేశ రాజకీయ పరిస్థితులు అత్యవసర పరిస్థితి విధించక తప్పనంత తీవ్రంగా, ప్రమాదకరంగా ఉన్నాయా?**

అదంతా నాటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ దుష్ప్రచారం మాత్రమే. జేపీ ఉద్యమం నిర్మాణాత్మకమైనది. దేశం పట్ల ప్రేమ ఉన్నవారిలో అత్యధికులు ఆయన వెంట నడిచారు. అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతున్నందుకు ప్రజలలో ఎంతో ఉత్తేజం కనిపించేది. ప్రజాస్వామ్య పరిరక్షణ గురించి, న్యాయస్థానాల పవిత్రతను నిలబెట్టడం గురించి మాట్లాడుతున్న వాళ్లే నాడు జస్టిస్ జగ్‌మోహన్ లాల్ సిన్హా దిష్టిబొమ్మలను తగులబెట్టారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ మీడియాను దుర్వినియోగం చేసింది. ప్రతిపక్షాల మీద దుష్ప్రచారం చేసి, అధికార పార్టీ మీద కొన్ని భ్రమలు కల్పించింది.

**అత్యవసర పరిస్థితి విధింపునకు వెనుక ఉన్న తక్షణ కారణం గురించి మీ అభిప్రాయం ఏమిటి? జస్టిస్ జేఎంఎల్ సిన్హా ఇచ్చిన తీర్పు, ఈ తీర్పు మీద జస్టిస్ వీఆర్ కృష్ణయ్యర్ ఇచ్చిన షరతులతో కూడిన స్టే కారణమనుకోవాలా?**

ఈ తీర్పులు ఇందిర రాజకీయ అస్తిత్వానికే ప్రశ్నార్థకంగా మారాయి. అదే సమయంలో ప్రతిపక్షాలు ఐక్యమవుతూ, తమ ఉద్యమానికి అనుకూలంగా దేశ ప్రజలలో ఏకాభిప్రాయం తీసుకువచ్చాయి. వీటిని అణచివేయడానికే అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. చట్టాన్ని ఒకరి చేతులలోకి



# కు ప్రత్యామ్నాయాన్ని ఇచ్చింది!'

ఎమర్జెన్సీలో ప్రజల భాగస్వామ్యం గణనీయమైనదని చెప్పారు ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖులు వడ్ల భాగయ్య. ప్రతిపక్షాలు ఏకమై దేశ చరిత్రలోనే తొలిసారి ప్రజల మధ్య కూడా రాజకీయ ఐక్యతకు దారులు ఏర్పరిచాయని ఆయన అన్నారు. కానీ అంతటి కదలికకు తాత్కాలిక స్ఫూర్తి కారణం కావడం అప్పటి పరిస్థితులలో జరిగిందని కూడా చెప్పారు. ఏమైనా కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం నిర్మించడానికి కొంచెం ఆలస్యమైన అత్యవసర పరిస్థితి నేపథ్యంగా పనిచేసిందని భాగయ్య అభిప్రాయపడ్డారు. ఆయన విశాఖ ప్రాంత ప్రచారక్‌గా ఉన్నప్పుడు చేసిన ఇంటర్వ్యూ ఇది.

తీసుకోవడం అనే దుష్ట సంప్రదాయం దానితోనే మొదలయింది.

**అత్యవసర పరిస్థితి విధింపు కేవలం అభివృద్ధిని ఆశించి, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమేనంటూ ఇచ్చిన వివరణలో వాస్తవం ఉందా?**

అసలు ప్రజాస్వామ్యానికి ఏదైనా ముప్పు ఏర్పడితే కదా!

**కొన్ని ఆర్థిక లక్ష్యాలను సాధించడానికే అత్యవసర పరిస్థితిని విధించవలసి వచ్చిందని నాటి నాయకులు చెప్పుకున్నారు. 21 నెలల అత్యవసర పరిస్థితి కాలంలో నిజమైన క్రమశిక్షణ గాని, ఆర్థిక పురోభివృద్ధి గాని సాధ్యమైనాయా?**

దానిని క్రమశిక్షణ అనుకుంటే, అత్యవసర పరిస్థితి విధించిన తొలి రోజులలోనే కనిపించిందనవచ్చు. తరువాత అసలు దాని జాడే లేదు. ఆర్థిక పురోగతి కూడా అచ్చంగా ఇదే పంథాలో కనిపిస్తుంది. ఆ పేరుతో మొదట కనిపించిన హడావిడి తరువాత లేదు.

**పత్రికారంగం గురించి ఒక ప్రశ్న. నాటి ప్రధాని ప్రకటించినట్టు అత్యవసర పరిస్థితి విధించిన సమయానికి భారత పత్రికారంగం ప్రమాదకర పాత్రను పోషిస్తున్నదా?**

ఆ మాట పూర్తిగా తప్పు. ఆ సమయానికి చాలా దినపత్రికలు నిష్పాక్షికమైన పంథాలో వెలువడు తుండేవి. న్యాయం కోసం జరుగుతున్న పోరాటానికి, ఆ పోరాటం చేస్తున్నవారికి నాటి వార్తాపత్రికలు మద్దతు ఇచ్చాయి.

**సెన్సార్‌షిప్ కారణంగా దేశం మొదటిగా కోల్పోయినదేమిటి? దీనితో కోల్పోయింది భావ ప్రకటనా స్వేచ్ఛ మాత్రమేనా? పత్రికా స్వేచ్ఛ మాత్రమేనా? ఇంకేమైనా కూడా ఉందా? సెన్సార్‌షిప్ కారణంగా మీరు ఎదుర్కొన్న సమస్య ఏది?**

వాస్తవం ఏమిటో, కల్పన ఏమిటో తెలుసుకోవడం పెద్ద సమస్యగా మారింది. చెలరేగిపోతున్న వదంతుల మధ్య సత్యమేదో గ్రహించే అవకాశం మృగ్యమై పోయింది. అత్యవసర పరిస్థితి విధింపుతో ఏర్పడిన సంక్షోభం కారణంగా ఏర్పడిన వాతావరణమిది. మరీ ముఖ్యంగా ప్రజావాణి మూగబోయింది. ఇది ఎంత ప్రమాదకర పరిణామాలకు దారి తీసిందో తరువాత తెలిసివచ్చింది.

**పత్రికా రంగాన్ని ఫోర్త్ ఎస్టేట్ అంటాం. ఆ రంగంలో సహజంగా ఉంటుందని మనమంతా ఆశించే నిర్మాణాత్మక దృక్పథం 1975 సమయానికి నిజంగా ఉన్నదని భావించవచ్చునా? ఆ నిర్మాణ దృక్పథం, అందులో ఉంటాయనుకునే సమున్నత విలువలు నిజంగానే ఉంటే, అంత దారుణంగా, అంత కర్కశంగా అధికార గణం పత్రికారంగాన్ని అవమానించగలిగేదేనా? అణిచివేయగలిగి ఉండేదా?**

పత్రికారంగంలో ఉంటాయని మనమంతా ఆశించే లక్షణాలన్నీ ఆ సమయంలో 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్', 'ది స్టేట్స్‌మన్' ఆనాడు తమకు ఉన్నాయని నిరూపించుకున్నాయి. కానీ కొన్ని పత్రికలు, వార మాసపత్రికల అలా ఉండేందుకు తమవంతు ప్రయత్నం చేశాయి.

**అత్యవసర పరిస్థితికి వ్యతిరేకంగా సాగిన ఉద్యమాన్ని రెండవ స్వాతంత్ర్య సమరంగా అభివర్ణించారు. ఆ ఉద్యమం పరిధి, ఆశయం, తాత్వికతలను సమగ్రంగా పరిశీలిస్తే ఆ మాట అతిశయోక్తి కాదనే నిస్సంశయంగా చెప్పవచ్చు. ప్రజా స్పందన, వారు ప్రదర్శించిన ధైర్య సాహసాలు వందేమాతరం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాలను గుర్తు చేశాయి. కానీ ఆ ఉద్యమం ప్రజల స్మృతిపథం నుంచి అంత వేగంగా ఎలా చెరిగిపోయింది?**

1975-1977 మధ్య జరిగిన అత్యవసర పరిస్థితి విధింపు వ్యతిరేకోద్యమంలో ప్రజల భాగస్వామ్యం గణనీయమైనది. కానీ అది తాత్కాలిక స్ఫూర్తితో వచ్చిన ఉత్తేజం. ఆ స్ఫూర్తిని ప్రజానీకంలో స్థిరంగా ఉండిపోయేటట్టు చేయడానికి, ఆ మార్గంలో వారిని చైతన్యవంతులను చేయడానికి మార్గం లేకపోయింది. అంతకు మించిన విషయం- ప్రజల జ్ఞాపకశక్తి కూడా పరిమితమన్న వాస్తవాన్ని గుర్తించాలి. మరొక సత్యం కూడా అంగీకరించాలి. జాతి నిర్మాణం వంటి బాధ్యతలను నిర్వర్తించడానికీ, జాతీయ స్పృహను నిరంతరం కాపాడడానికీ ఉపయోగపడే శాశ్వత వేదిక ఏదీ మన దగ్గర లేదు. అసలు స్వాతంత్ర్యానంతర భారతదేశ చరిత్ర మొత్తంలో ఈ వాస్తవాన్ని గమనించవచ్చు కూడా. స్వాతంత్ర్య పోరాటంలోని కొన్ని ఘట్టాలకీ, అత్యవసర పరిస్థితి వ్యతిరేక పోరుకు కొన్ని పోలికలు ఉన్నప్పటికీ, కొన్ని భిన్నమైన అంశాలు కూడా ఉన్నాయి. అత్యవసర పరిస్థితి కాలం నాటికి పరిస్థితులలో చాలా మార్పులు వచ్చాయి. సామాజిక పరిస్థితులు మారాయి. పోలీసు యంత్రాంగం, ఉద్యోగస్వామ్యంలో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయి. అత్యవసర పరిస్థితి సమయంలో ప్రభుత్వం చాలా గుట్టుగా వ్యవహరించింది. వాస్తవాలను తెలియనివ్వలేదు. నాయకులను, ఉద్యమకారులను గుట్టుగా అరెస్టు చేసేవారు. కానీ క్విట్ ఇండియా ఉద్యమంలో నాయకులను, ఉద్యమకారులను బహిరంగంగానే అరెస్టు చేశారు.

**అత్యవసర పరిస్థితి విధించి రెండు దశాబ్దాలు అవుతున్నది. ఈ కాలం మీద ఆ చర్య మిగిల్చిన జాడ ఏమిటి?**

కాంగ్రెస్‌కు ఒక ప్రత్యామ్నాయం అది నిర్మించ గలిగింది. దానితో వచ్చిన ఫలితం ఇదే. ఆ ఫలితం ఎలాంటిదో ఇవాళ స్పష్టంగా కనిపిస్తున్నది.

**అత్యవసర పరిస్థితిని తీవ్రంగా ఎదుర్కొన్నవారు ఆర్‌ఎస్‌ఎస్ వారేనని అంతా అంగీకరిస్తారు. మీరు ఆ పరిస్థితిని ఎలా ఎదుర్కొన్నారు. అప్పుడు మీ అనుభవాలు ఏమిటి?**

నేను విశాఖ జిల్లా ప్రచారక్‌గా అప్పుడు పనిచేశాను. విశాఖ వన్ టౌన్‌లో నన్ను అరెస్టు చేశారు. సికింద్రాబాద్, రాజమండ్రి జైళ్లలో ఉంచారు. అంతకంటే, మీసా కింద, డీఐఆర్ నిబంధనల కింద అరెస్టయిన వారిని దారుణంగా, క్రూరంగా హింసించారు. ప్రజలు అత్యవసర పరిస్థితి నాటి వాతావరణానికి భయపడిన మాట నిజం. అదే సమయంలో వారు తమ దృక్పథాల నుంచి వెనక్కి తగ్గలేదు. ధైర్యసాహసాలను కోల్పోలేదు. జేపీ, మొరార్జీ వంటి స్థాయిని వారు మరచిపోలేదు. కానీ ఈ విషయాలను బయటకు చెప్పడానికి వెనుకాడారు.

విశాఖపట్నం
6-1-1995

**(డా. గోపరాజు నారాయణరావు సిద్ధాంత పరిశోధక వ్యాసం 'ఆంక్షాపర్వం - అత్యవసర పరిస్థితిలో తెలుగు దినపత్రికల పోరాటం, జంఝూటం' నుంచి)**

# ప్రథమ శత్రువు పత్రికారంగం

ఎమర్జెన్సీకి ప్రధాన శత్రువు పత్రికారంగం. అన్ని వ్యవస్థలలో మాదిరిగానే భారతీయ పత్రికారంగానికి కూడా అణచివేత కొత్త కాదు. అయితే అత్యవసర పరిస్థితి నాటి అనుభవాలు విస్మరించలేనివి. చెరిగిపోనివి. ఎమర్జెన్సీ ప్రకటనలపై రాష్ట్రపతి చేవ్రాలు పడిన జూన్ 25, 1975 అర్ధరాత్రే పత్రికారంగానికి ప్రమాద ఘంటికలు వినిపించాయి. దేశరాజధాని ఢిల్లీలో బహదూర్‌షా జాఫర్ మార్గ్‌లోనే చాలా పత్రికలు కేంద్రీకృతమైనాయి. ఈ ప్రాంతానికి 25వ తేదీ అర్ధరాత్రి విద్యుత్ సరఫరాని నిలిపివేశారు. అయితే కన్నాటోప్లేస్‌లోని 'ది స్టేట్స్‌మన్, ది హిందుస్తాన్ టైమ్స్, ది ఎకనామికల్ టైమ్స్, ది ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్ పత్రికలు మాత్రం వెలువడ్డాయి. కన్నాట్ ప్లేస్ ఢిల్లీ కార్పొరేషన్ పరిధిలో కాక మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోనే ఉన్నది. మునిసిపాలిటీకి కరెంట్ కట్ చేయలేదు. ఇలా కరెంట్ కోత నుంచి ఏమరుపాటుగా బయటపడిన మరో ఆంగ్ల దినపత్రిక 'మదర్లాండ్', ఈ పత్రిక ఎడిటర్ కెఆర్ మల్కానీని అరెస్టు చేశారు. కాని పత్రిక యాజమాన్యం 26న ఒక ప్రత్యేక అనుబంధం ప్రచురించింది. దానిని ప్రజలకు అందించింది. అయితే 'మదర్లాండ్'కు అదే ఆఖరి సంచిక అయింది. ఎమర్జెన్సీ విధింపు, అర్ధరాత్రి అరెస్టులతో చాలా వేడివేడిగా వార్తలు నింపి అనుబంధాన్ని బజారుకు తెచ్చారు. వదంతులతో, పుకార్లతో అసలే ఉత్కంఠతో ఉన్న ప్రజలు ఆ అనుబంధం కోసం ఎగబడ్డారు. పది పైసల అనుబంధంపై ఇరవై రూపాయలకు అమ్మి కొందరు సొమ్ము చేసుకున్నారు. తరువాత పోలీసులు మదర్లాండ్ ఆఫీసుకు తాళాలు బిగించారు. ఇలా మధ్యాహ్నం పదకొండు గంటల వేళ 'హిందుస్తాన్ టైమ్స్', 'స్టేట్స్‌మన్' పత్రికలు కూడా ఎమర్జెన్సీ విధింపు వార్తలతో ఒక అనుబంధాన్ని తేవడానికి సన్నాహాలు చేశాయి. హిందుస్తాన్ టైమ్స్ అచ్చయి మార్కెట్‌లోకి ప్రవేశించింది. స్టేట్స్‌మన్ ప్రెస్‌కు ఎక్కుతూ ఉండగా అప్పుడు టెలిప్రింటర్లలో పత్రికలలో సెన్సార్‌షిప్ విధించినట్టు ఫ్లాష్ న్యూస్ వచ్చింది. పైగా అచ్చు చేయబోయే వార్తలను సెన్సార్ అధికారికి చూపించాలని కూడా నిబంధన వచ్చింది. స్టేట్స్‌మన్ లే అవుట్‌ను ఆదరాబాదరాగా శాస్త్రి భవన్‌లో వేంచిసే ఉన్న సెన్సార్ అధికారి దగ్గరకు తీసుకువెళ్లారు. తిరిగి వచ్చిన లే అవుట్‌లో అరెస్టయిన నాయకుల ఫోటోలు, అరెస్టు వార్తలు కొట్టివేసి ఉన్నాయి. ఇంతలో అసలు పత్రికా కార్యాలయానికి విద్యుత్ సరఫరాయే నిలిచిపోయింది. ఆ అనుబంధ సంచిక పేజీలు ఎమర్జెన్సీ గుర్తుగా ఉండిపోయాయి. హిందుస్తాన్ టైమ్స్, జాగ్రత్తపడి మార్కెట్‌లోకి వెళ్లిన తనల అనుబంధాన్ని ఆగమేఘాల మీద ఉపసంహరించుకుంది. అదే రోజు ఉదయం (జూన్ 26) ఇందిర ఆకాశవాణిలో ప్రసంగించారు. ప్రజాస్వామ్య విధానాలతో తాను సాధారణ పౌరులకు మేలు చేయాలని భావిస్తూ ఉండగా ప్రతిపక్షాలు, పత్రికలు తనకు వ్యతిరేకంగా కుట్ర పన్నుతున్నాయని ఆరోపించారు. ఆ రోజునుంచే ఈ పత్రికలపై సెన్సార్‌షిప్ అమలులోకి వచ్చింది. పత్రికలో ప్రభుత్వం మాట వినేటట్టు చూడడానికి బుద్ధిగా నడుచుకునేట్టు చేయడానికి అంతవరకు సమాచార ప్రసార శాఖమంత్రిగా ఉన్న ఐ.కె.గుజ్రాల్‌కు ఉద్వాసన పలికి, ఆయన స్థానంలో వి.సి.శుక్లాను ఇందిర నియమించారు. అసలు భారత ప్రజాస్వామ్యం పత్రికా రంగానికి విపరీతమైన స్వేచ్ఛను కల్పించిందని, పత్రికలు ఆ స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తూ ప్రజలలో నమ్మకాన్ని (ప్రభుత్వం పట్ల) హరింప చేస్తున్నాయని ప్రజలు రెచ్చిపోయేట్టు చేసి చట్టాన్ని తమ చేతులలోనికి తీసుకునేలా పత్రికలు పురికొల్పకుండా సెన్సార్‌షిప్‌ను విధించామని ఇందిర చాలా స్పష్టంగా పేర్కొన్నారు. జులై 9, 1975న ఆమె ఈ విధంగా ప్రకటించారు (చు.డిక్లెన్ అండ్ ఫాల్ ఆఫ్ ఇందిరాగాంధీ, రచయితలు మస్కేకర్ అండ్ మస్కేకర్ 13వ పేజీ) తరువాత ప్రెస్ కౌన్సిల్ రద్దయింది.

ఎమర్జెన్సీ విధింపును, సెన్సారింగ్‌ను పత్రికలు తొలినాడు తీవ్రంగా విమర్శించాయి. తమ ఆగ్రహాన్ని ప్రతిబింబిస్తూ ఎడిటోరియల్ కాలమ్స్‌ను ఖాళీగా విడిచాయి. మొదటి పేజీలో సెన్సార్ అధికారులు విచక్షణారహితంగా తీసివేసిన వార్తాభాగాలను అలాగే, ఖాళీగా ప్రచురించారు. ఇదే నిరసనను తెలుగు పత్రికలు కూడా ప్రకటించాయి. ఈ వైఖరిపై ప్రభుత్వం తీవ్రంగా ఆగ్రం వెలుబుచ్చింది కూడా.

ప్రభుత్వానికి, కాంగ్రెస్ పార్టీకి విధేయత ప్రకటించడానికి ఇష్టపడని ఏ ప్రచురణను ఎమర్జెన్సీ బతకనివ్వదలుచుకోలేదు. అలాంటి వాటిలో మొదటి పత్రిక ఇండియన్ ఎక్స్‌ప్రెస్ అసలు వి.సి.శుక్లా సమాచార మంత్రిగా ప్రమాణం చేసిన క్షణం నుంచి ఈ ఆంగ్ల దినపత్రికపై యుద్ధం ప్రారంభించారు. ఎమర్జెన్సీలో ఆ పత్రిక సంపాదక బాధ్యతలు నిర్వర్తించిన వి.కె.నరసింహన్ వ్రాసిన 'డెమాక్రసీ రిడీమ్డ్' పుస్తకంలో ఈ యుద్ధం గురించి వివరించారు. ఆ పత్రికకు విద్యుత్ నిలిపివేశారు. ప్రభుత్వ ప్రకటనలు నిలిపివేశారు. ఢిల్లీలోని ఎక్స్‌ప్రెస్ భవంతిని కూల్చడానికి ఉత్తర్వులు తెచ్చారు. ఆఖరికి ఎమర్జెన్సీ మొదటి రోజులో ఎడిటర్‌గా ఉన్న మూల్గామ్‌కర్‌ను పదవీచ్యుతుడిని చేశారు. గుండె జబ్బుతో బాధపడుతున్న భగవాన్‌దాస్ గోయెంకాను అరెస్టు చేస్తామని ఆయన తండ్రి, ఎక్స్‌ప్రెస్ అధిపతి రామ్‌నాథ్‌ను గట్టిగా బెదిరించారు. అచ్చుకు వెళ్లే ప్రతి పేజీని సెన్సార్ అధికారులకు చూపాలని డీఐఆర్ 48 (1) నిబంధన విధించి ప్రీ సెన్సార్‌షిప్‌ను ప్రయోగించారు. పత్రిక అచ్చుకాకుండా గంటల కొలదీ జాప్యం చేయించారు. దాదాపు ఇదే నిబంధనలతో వేధింపులతో అణచివేతకు గురైన మరో ప్రముఖ ఆంగ్ల దినపత్రిక 'ది స్టేట్స్‌మెన్' ఆ సమయంలో మేనేజింగ్ ఎడిటర్‌గా ఉన్న సి.ఆర్.


ఆంధ్రపత్రిక

ప్రధాని హెచ్చరిక

(1 వ పేజీ తరువాయి)

జూన్ 26, 1975

సంపాదకీయం లేకుండా ఆంధ్రపత్రిక

ఇరానిని లొంగదీయడానికి ప్రభుత్వం చేయని ప్రయత్నం లేదు.

ముంబయి నుంచి ఎ.డి.గొర్వాలో సంపాద కత్వంలో వెలువడే ఆంగ్ల వారపత్రిక ఒపీనియన్ పై కూడా ప్రభుత్వం కక్షకట్టింది. పార్లమెంట్‌లో సభ్యులు చేసిన ప్రసంగాలను ప్రచురించాలని గొర్వాలా నిర్ణయించడమే ఆయన చేసిన పాపం. ఒపీనియన్ ముద్రించి ఇవ్వడానికి ప్రెస్ లేకుండా చేశారు పోలీసులు. అయినా సయిక్లో స్టయిల్డ్ పత్రికను ఆయన తెచ్చారు. తరువాత అసలు ఈ పత్రిక ప్రచురణనే ప్రభుత్వం నిషేధించింది. ఢిల్లీ నుంచి రమేష్ థాపర్ వెలువరిస్తున్న 'సెమినార్' పత్రిక మరింత విషాదం.

1976 జులై 16న సెమినార్‌పై ప్రభుత్వం ప్రీసెన్సార్ షిప్‌ను విధించింది. అంటే అచ్చుకాబోతున్న సంచికలో విషయాలని ముందుగా సెన్సార్ అధికారులకు చూపించి వారి అనుమతితో ప్రచురించాలి. ఈ నిబంధనని ఆమోదించడం ఇష్టంలేని థాపర్ ప్రచురణని స్వయంగా ఆపేశారు. నిఖిల్ చక్రవర్తి ఆధ్వర్యంలోని మెయిన్ స్ట్రీమ్ ఆంగ్ల వారపత్రికది వేరే కథ. ఎమర్జెన్సీలో సీపీఐ ఇందిరను, ఆమె విధానాలను బాహాటంగానే సమర్థించింది. అయితే ఈ పార్టీ విధానాలను మద్దతుపలికే పత్రికగా మెయిన్ స్ట్రీమ్‌కు పేరున్నది. కాని పత్రిక ఎమర్జెన్సీ విషయంలో మాత్రం పార్టీ బాణికి తాళం వేయలేదు. సరికదా వ్యతిరేకంగా గళం విప్పింది. సంజయ్‌ని దృష్టిలో పెట్టుకుని పరోక్షంగా వ్రాసిన 'హైబ్రీడ్ పొలిటికల్ స్ట్రింగ్ చికెన్' 'గుడ్‌బై ఫిరోజ్', 'డు వుయ్ నీడ్ నెహ్రూ టుడే' వంటి వ్యాసాలు సహజంగానే సర్కార్‌కి తీవ్ర ఆగ్రహాన్ని కలిగించాయి. ఈ పత్రికను అచ్చువేసే ప్రెస్‌ను జప్తు చేయడం ద్వారా మెయిన్ స్ట్రీమ్ ఊపిరి తీసేశారు. అయితే ఈ పత్రిక ప్రచురణ నిలిచిపోయిన సంగతని విశాలాంధ్ర తొలిపేజీ వార్తగా ప్రచురించింది.

డిసెంబర్ 25 1976న మెయిన్‌స్ట్రీమ్ ఆగిపోయింది. తెలుగు సాహిత్య పత్రిక సృజన మూతపడిన సంగతిని కూడా విశాలాంధ్ర ప్రచురించింది. వ్యంగ్య చిత్రాల శంకర్స్ వీక్లీది ఇంకో విషాదాంతం. భారతదేశం గర్వించదగిన శంకర్ పిళ్లై ఈ పత్రిక అధిపతి, ఎడిటర్ కూడా. నవ్వుని, నవ్వి పోవడాన్ని నిషేధించిన వ్యవస్థలో , వాటిని బహిష్కరించిన పాలన బతకలేనంటూ ఈ వీక్లీ 1975 అక్టోబర్‌లో మూతపడిపోయింది.

'ప్రీ సెన్సార్ నిబంధనని అంగీకరించలేని ఈ వినోద, విజ్ఞాన పత్రిక ఆత్మహత్య చేసుకున్నది. 1948 పండిట్ నెహ్రూ చేతుల మీదుగా ప్రారంభమైన ఈ వ్యంగ్య చిత్రాల వీక్లీ ఆయన కుమార్తె ఇందిర హయాంలో అంతమైంది. తన చివరి సంపాద కీయంలో శంకర్ చేసిన వ్యాఖ్య అద్భుతమైనది, చిరస్మరణీయమైనది. 'నాగరికతను మరిచిపోయిన సమాజం మాత్రమే నవ్వుని నిషేధిస్తుంది అంటూ శంకర్ కలం మూసివేశాడు. వినోబా నడిపే మైత్రి, జె.వి.ఎగ్రీమేన్స్, పెర్నాండెజ్ ప్రతిపక్ష ఎన్నో పత్రికలు శాశ్వతంగానో, తాత్కాలికంగానో ప్రచురణలను నిలిపివేశాయి. తెలుగులో సృజనతోపాటు జాగృతి, పిలుపు, ప్రజా సమస్యలు అనే పత్రికలు ఆగిపోయాయి. (తరువాత మళ్లీ ప్రచురణ ప్రారంభించాయి) పాంచజన్య (యు.పి), మదర్ ఇండియా (ముంబయ్) భూమిపుత్ర (గుజరాత్) తకవాణి (కర్ణాటక), ఆర్గనైజర్ (ఢిల్లీ) హిమ్మత్ (ముంబయ్) కేసరి (కేరళ) వంటి ఎన్నో పత్రికలు నిషేధానికి గురయ్యాయి. కె.ఆర్. మల్కాని, కులదీప్ నయ్యర్, రాజేందర్‌పురి వంటి ఎందరో జర్నలిస్టులు అరెస్టయ్యారు. పశ్చిమబెంగాల్ నుంచి వెలువడే ఆనందబజార్ పత్రికకు చెందిన నిఖిల్ దే ను అక్టోబర్ 24,1976న అరెస్టుచేసి సంకెళ్లు వేసి తీసుకెళ్లారు.

ఎమర్జెన్సీ విదేశీ పత్రికా విలేకరులను కూడా విడిచిపెట్టలేదు. 1975 జూన్ నాటికి దేశంలో 70మంది విదేశీ పత్రికల విలేకరులు పనిచేస్తున్నారు. ఒక్క అమెరికా మీడియా వారే ఢిల్లీలో 15మంది ఉండేవారు. 25మంది పశ్చిమయూరప్‌వారు, 20మంది తూర్పు యూరప్ దేశాల విలేకరులు వ్యతిరేకిస్తే వీరిని అరెస్టు చేయలేరు. కాని దేశం నుంచి బహిష్కరించవచ్చు. వీరిలో వాషింగ్టన్ పోస్ట్ పత్రికకు చెందిన లెవిన్ ఎం.సైమన్స్ వ్రాసిన వ్యాసం ఒక సంచలనం. ఢిల్లీలో ఒక రాత్రి జరిగిన ఇందులో సంజయ్‌గాంధీ ఇందిరపై చేయి చేసుకున్నాడని సైమన్స్ ఆ వ్యాసంలో పేర్కొన్నాడు. (చూ.ది జడ్జిమెంట్, కులదీప్‌నయ్యర్, పేజీ 53) పీటర్ హాజెల్ హ్రస్ట్ (లండన్ టైమ్స్) తరెన్ జెండిన్స్ (న్యూస్ వీక్) పీటర్ గిల్ (లండన్ డెయిలీ టెలిగ్రాఫ్)లకు 24 గంటలలో దేశం విడిచి పొమ్మనిక దశలో తాఖీదులు అందాయి. అయితే విదేశీ పత్రికలు ఏదో మార్గం ద్వారా భారతదేశ వార్తలను ప్రచురించాయి.

అయితే భారతీయ పత్రికలు ఎమర్జెన్సీలో ఇందిర ఇరవై సూత్రాల పట్ల కొన్ని భ్రమలు పెంచుకున్నాయి. క్రమశిక్షణను నిజమని నమ్మి తరువాత చెంపలు వేసుకున్నాయి. తెలుగుపత్రికలు అంతే. ఎమర్జెన్సీని సమర్థించిన పత్రికలు ఉన్నాయి. మధ్యే మార్గాన్ని అనుసరించినవీ ఉన్నాయి.

సలహా ఎవరిదైనా ఎమర్జెన్సీ ఇందిర వ్యూహమే. ఇది చారిత్రక వాస్తవం. చిత్ర విచిత్రంగా భయానకంగా ప్రచారమైపోతున్న వదంతులను నిరోధించలేకపోవడానికి అసలు జరుగుతున్నదేమిటో తనకు సైతం (ప్రధానికి) తెలియకపోవడానికి మూలం సెన్సార్‌షిప్. ఇది కూడా ఆమె చలవే. ఇది ఆమె స్వయంగా అంగీకరించిన సత్యాలే. సెన్సార్ షిప్‌ను తొలగించమని జులై 5, 1975న తనను కలిసిన ఇండియన్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్‌కు ఆమె చెప్పిన సమాధానమే ఇందుకు నిదర్శనం. (ఆరో తేదీ పత్రికలు ఈ విషయాన్ని వెల్లడించాయి) దేశాన్ని రక్షించడానికి సెన్సార్‌షిప్ విధించానని ఆమె జర్నలిస్టులకు చెప్పారు కాని జరిగినదేమిటి మారుతికారు ఉదంతం, స్నేహలత విషాదాంతం, పోలీసుల అరాచకాలు, కిస్సా కుర్సీకా, బలవంతపు ఆపరేషన్లు, అరెస్టులు, పోలీసు కాల్పులు, కూల్చివేతలు అన్నీ సెన్సార్ ఇనుపతెర వెనుక ఉండిపోయాయి. దీనికంతకూ బాధ్యత ఇందిరదే. మరో కోణం నుంచి ఆమె దేశానికి చేసిన సేవలు, ఆమె కుటుంబం చేసిన సేవలు గొప్పవే కావచ్చు. కాని చారిత్రక వాస్తవం ఇందిరకంటే గొప్పది.

**– జాగృతి డెస్క్**


THE STATESMAN

SPECIAL EDITION

Emergency Due To Internal Threat

CONSPIRACY TO END DEMOCRACY ALLEGED

Special Powers For Preventive Steps

'J.P.' Among Many Held Under MISA

Pre-Dawn Swoop On Opposition Leaders

People's Rights Violated, Says Raj Narain

2 CONGRESS M.P.S PROTEST

CONSORSHIP OF NEWS

PROCLAMATION

Steps To Help The Poor Soon Says Mrs. Gandhi

India-China Clash At Asian Group Meeting

**జూన్ 25, 1975 రాత్రి అచ్చుకు పంపడానికి సిద్ధం చేసిన స్టేట్స్‌మన్ ఆంగ్ల దినపత్రిక తొలి పేజీ సెన్సార్ అధికారుల కారణంగా ఆగిపోయింది. ఇప్పటికీ పత్రిక కార్యాలయంలో గుర్తుగా ఉంది.**



డా. శివాజీ,
మాజీ ఎంపీ

**స్వతంత్ర భారతదేశ చరిత్రలో అత్యవసర పరిస్థితి విధింపు (జూన్ 25, 1975) అతి పెద్ద చారిత్రక తప్పిదం. ఆ తప్పు ఇందిరాగాంధీ చేశారు. అత్యవసర పరిస్థితి విధింపునకు చెప్పిన కారణాలు మొదలు, తరువాత తీసుకున్న ప్రతి చర్య ప్రజాస్వామ్య విరుద్ధమే. భారత స్వాతంత్ర్య సమరం నుంచి వచ్చిన గొప్ప స్ఫూర్తి అత్యవసర పరిస్థితి విధింపుతో ధ్వంసమైంది. అప్పటి అరెస్టులు, జైలు జీవితం ఎందరినో బాధించాయి. అమాయకులను వేధించాయి. ప్రజాస్వామ్యం నశించిపోయిన దశ ఎలా ఉంటుందో ఆ 21 మాసాలు దేశానికి అనుభవానికి తెచ్చాయి. తెలుగు ప్రాంతంలో మొదట అరెస్టయిన వారిగా రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యలమంచిలి శివాజీ తన అనుభవాలను జాగృతి ముఖాముఖిలో వెల్లడించారు.**

# అంతటి కదలిక
# వ్యతిరేక శిబిరం

**జై ఆంధ్ర ఉద్యమ కాలం నుంచి రాజకీయాలను పరిశీలిస్తున్నారు మీరు. ఆ డబ్బయ్ దశకంలోనే దేశంలో అత్యవసర పరిస్థితి విధింపు నిర్ణయం జరిగింది. అందుకు దారి తీసిన పరిస్థితులు, నేపథ్యం గురించి చాలా కథనాలు ఉన్నాయి. కోణాలు కూడా ఉన్నాయి. నాటి ప్రధాని, అత్యవసర పరిస్థితి విధింపు వంటి తీవ్ర నిర్ణయం తీసుకున్న ఇందిరాగాంధీ, ఆమె కాంగ్రెస్ పార్టీ వాదన ప్రకారం విపక్ష ప్రముఖులు హింసకు ప్రేరేపించారు అని. విపక్షాలేమో అసలు అత్యవసర పరిస్థితిని ఏ పరిస్థితులలో విధిస్తారో అవేమీ ఆనాడు దేశంలో లేవని అంటారు. ఇంతకీ ఆ నేపథ్యం ఏమిటి?**

1973,1974 చాలా కీలకమైన సంవత్సరాలు. గుజరాత్‌లో, బిహార్‌లో విద్యార్థులు తమ సమస్యల మీద రోడ్డెక్కారు. మెస్ ఛార్జీల పెంపు అంశంతో గుజరాత్‌లో మొదలైన అలజడి ఆఖరికి రాష్ట్ర ప్రభుత్వాల అవినీతి వ్యవహారాల పట్ల నిరసనగా మారిపోయింది. బిహార్‌లో మార్చి,1974లో ఛాత్ర సంఘర్షణ సమితి ఏర్పడింది. దీనికి అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్. తరువాత బిహార్ ముఖ్యమంత్రి అయ్యారు. కార్యదర్శి సుశీల్ కుమార్ షిండే. బిహార్ ఉప ముఖ్యమంత్రి అయ్యారు. అలాంటి సమయంలో జయప్రకాశ్ నారాయణ్ (జేపీ) వైద్యం కోసం పట్నా వచ్చారు. అప్పటికే రాష్ట్ర వ్యాప్తమైన ఉద్యమానికి నాయకత్వం వహించవలసిందిగా విద్యార్థులు ఆయనను కోరారు. మొదట నిరాకరించినా, తరువాత ముందుకు వచ్చారు జేపీ. అదే సంపూర్ణ విప్లవంగా రూపుదిద్దుకుంది. అప్పుడు యంగ్‌టర్క్‌గా పేర్గాంచిన చంద్రశేఖర్, కృష్ణకాంత్, మోహన్ ధారియా, రామ్‌ధన్ జేపీని ఆహ్వానించి ఉద్యమం గురించి చర్చించారు. చంద్రశేఖర్ కాంగ్రెస్ సభ్యుడన్న సంగతి ఇక్కడ విస్మరించలేం. అవినీతిలో కూరుకుపోయిన గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థులు చేస్తున్న ఉద్యమానికి మొరార్జీ దేశాయ్ మద్దతుగా నిలవడం మరొక అంశం. అవినీతి అంతం కోసం, రాష్ట్ర ప్రభుత్వాల అవినీతికి వ్యతిరేకంగా దేశంలో యువతను చైతన్యవంతం చేయడానికి జేపీ దేశయాత్ర చేపట్టారు. ఆయనకు కాశీలో దెబ్బ తగిలింది. ఒరిస్సాలో యూత్‌కాంగ్రెస్ అల్లరి చేసింది. తరువాతనే విశాఖపట్నం వచ్చారు. భువనేశ్వర్‌లో ఆర్‌ఎస్‌ఎస్ నాయకుడు నానాజీ దేశ్‌ముఖ్ అడ్డం పడ్డారు. జేపీకి తగలవలసిన దెబ్బ ఆయనకు తగిలింది.

**జేపీ ఉద్యమం పట్ల ఆంధ్రప్రదేశ్ ఎలా స్పందించింది?**

సంపూర్ణ విప్లవం అని కదా ఆయన పిలుపు. మార్చి, 1975లో జేపీ విశాఖపట్నం వచ్చారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అప్పుడే ఒక తమాషా జరిగింది. జేపీలో సంస్కరణ ధోరణి ఉండేది. అందుకే కట్నం లేకుండా పెళ్లి చేసుకుంటాం అనే వాళ్లు చేతులెత్తండి అన్నారాయన. మూడే చేతులు లేచాయి. హతాశుడయ్యాడు పాపం. వీళ్లతోనా ఉద్యమం అని ఆయన నోటి నుంచి వచ్చేసింది. తరువాత విజయవాడ ముచ్చట. ఇంతకీ జేపీని విజయవాడకు ఆహ్వానించినవారు హేతువాద ఉద్యమ నేత గోపరాజు రామచంద్రరావు (గోరా). ఈయన అంతకు ముందే జేపీ ఉద్యమం సరికాదని ఒక ప్రకటన ఇచ్చేశారు. దీనితో గోరా సభకు జేపీ వెళ్లడం గొట్టిపాటి మురళీమోహన్, ఎంవీ రామమూర్తిలకి ఇష్టం లేదు. వీరు తమ అభిప్రాయాన్ని జేపీకి చెప్పేశారు. ఆయన మధ్యేమార్గంగా మేం మాంటిస్సోరి కళాశాలలో ఏర్పాటు చేసిన సభకు మొదట హాజరయ్యారు. నేను, వెంకయ్యానాయుడు కూడా మాట్లాడాం. జేపీ ఉపన్యాసానికి రామమూర్తి అనువాదం. హోరున వర్షం మొదలయింది. జనం చెల్లాచెదురయ్యారు. జేపీ తడిసి పోకుండా కొమరగిరి కృష్ణమోహన్‌రావు ఒక టవల్ కప్పారు. ఇక్కడ ఒక విషయం చెప్పుకోవాలి. లోపాయికారి విషయం. అప్పుడు కేంద్ర హోంమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి. జేపీకి బందోబస్తులో లోటు చేయవద్దని ముందే హెచ్చరికలు పంపారు, పోలీసు శాఖకి. విజయవాడ నుంచి చెన్నై (నాటి మద్రాస్) వెళ్లారు జేపీ.

**అప్పటి వార్తలను బట్టి యువజన కాంగ్రెస్ జేపీ ప్రచారయాత్రలను అడ్డుకునే ప్రయత్నం చేసింది. భౌతికదాడులూ జరిగాయి. కానీ విపక్ష ప్రముఖులే దేశంలో కల్లోలం సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారని**


మొరార్జీతో..

**కాంగ్రెస్ పార్టీ ఎదురుదాడి చేయడానికి కారణం ఏమిటి?**

జూన్ 12, 1975 దేశ రాజకీయ, సామాజిక పరిస్థితులను హఠాత్తుగా మలుపు తిప్పింది. కాంగ్రెస్ పార్టీకీ, ప్రధాని ఇందిరాగాంధీకీ విద్యుదాఘాతం వంటి పరిణామాలు. 1971 నాటి సాధారణ ఎన్నికలలో రాయ్‌బరేలీ నుంచి ఇందిర ఎన్నిక చెల్లదని అలహాబాద్ హైకోర్టు తీర్పు ఇచ్చింది. రెండోది ప్రజాతీర్పు. అదీ ఆ రోజే వచ్చింది. గుజరాత్ ఎన్నికలలో చిమన్‌భాయ్ పటేల్ నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ ఓడిపోయింది. జనతా ఫ్రంట్ కూటమి అధికారంలోకి వచ్చింది. అప్పటికే కాంగ్రెస్ అవినీతి వ్యవహారాలు దేశంలో గగ్గోలుగా ఉన్నాయి. అలహాబాద్ హైకోర్టు తీర్పు మీద ఇందిర సుప్రీంకోర్టుకు

పెట్టాము. మల్లాది సుబ్బమ్మగారు అధ్యక్షులు. న్యూ ఇండియా హోటల్ అంటే ఇదివరకు ఆంధ్రప్రభ ఆఫీసు ఉండింది. కొమరగిరి కృష్ణమోహనరావు, ఎంపీ రామమూర్తి ప్రసంగించారు. ఢిల్లీలో 7,8 పార్టీలు– చరణ్‌సింగ్‌గారి పార్టీ, బిజూ పట్నాయక్ పార్టీ, దేవీలాల్ హరియాణా విశాల్ మంచ్, జనసంఘ్ ఇవన్నీ కలిసి ఒక వేదికగా ఏర్పడ్డాయి. జూన్ 25న రాంలీలా మైదానంలో వీళ్లంతా ఒక పబ్లిక్ ర్యాలీ నిర్వహించారు. అదిచూసిన తరువాత ఎమర్జెన్సీని డిక్లేర్ చేసిందామె.

**జూన్ 25, 1975. ఈ తేదీ చరిత్రను మలుపు తిప్పుతుందని అప్పుడు ఎంతమంది భావించారో తెలియదు కానీ, ఇందుకు**


ఫెర్నాండెజ్‌తో..

# లోను కాంగ్రెస్ నిర్మాణం కాలేదు!

**ప్రత్యేక ముఖాముఖి**


అద్వానీతో..

వెళ్లారు. అక్కడ షరతులతో స్టే మాత్రమే వచ్చింది. అదే జూన్ 25, 1975. ఇక ఇందిర ప్రధానిగా కొనసాగరాదని ప్రకటిస్తూ విపక్ష ప్రముఖులు ఆ రోజు సాయంత్రమే రామ్‌లీలా మైదానం (ఢిల్లీ)లో బ్రహ్మాండమైన బహిరంగ సభ నిర్వహించారు.

**ఆ సభలో జేపీ, మొరార్జీ చేసిన కొన్ని వ్యాఖ్యలు బాగా వివాదాస్పదం అయ్యాయి కదా! ఆ వివాదం ఏమిటండి? దానిని బట్టే అత్యవసర పరిస్థితి విధించే అవకాశం ఇందిర దొరకబుచ్చుకున్నారా?**

చట్టం ప్రకారం అధికారంలో ఉండే అర్హత లేనివారు, రాజ్యాంగ బద్ధంగా పదవిని వీడవలసిన వారు ఆదేశాలు ఇస్తే పోలీసులు, సైనికులు పాటించరాదంటూ జేపీ, మొరార్జీ ఇద్దరూ అన్నారని వార్తలు వచ్చాయి. అటువంటివాళ్లు అంత మాట చెప్పకూడదు కదా అన్నదే నాడు వచ్చిన తీవ్ర విమర్శ. ఆ రాత్రే అత్యవసర పరిస్థితి విధించారు.

**ఇప్పుడు ఆలోచిస్తే అనిపిస్తుంది, దేశ ప్రధాని పదవిలో ఉన్న వ్యక్తి ఎన్నిక చెల్లదని తీర్పు రావడం నిజంగా సంచలనం. దేశంలో మిగతా ప్రాంతాల వారు ఎలా స్పందించారు?**

అలహాబాద్ హైకోర్టు తీర్పు వచ్చిన వెంటనే జూన్ 13న విజయవాడలో నేను ఒక సభ నిర్వహించాను. పాత ఆంధ్రప్రభ కార్యాలయం పక్కనే వేదిక. మరునాడు పెట్టాము. జూన్ 13వ తారీకు న్యూ ఇండియా హోటల్ దగ్గర పబ్లిక్ మీటింగ్

**సంబంధించిన తొలి సమాచారం మీకు ఎలా, ఎప్పుడు తెలిసింది?**

అంతకు ముందు నాలుగు రోజుల నుంచి నేను విజయవాడలో ఉన్నాను. ఈయన ఏమైపోయాడో కనపడడం లేదని చెప్పి మా నాన్న వచ్చి నన్ను పట్టుకుని రాత్రికి గుంటూరుకి తీసుకువచ్చారు.

అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతం. చిన్నగా వర్షం పడుతోంది. ఎవరో పట్టాభిపురంలోని మా ఇంటి తలుపు కొట్టారు. తీసి చూస్తే ఇద్దరు ఎస్ఐలు, రెండు జీపులలో పోలీసులు. నాకు అరెస్టులేమీ కొత్తకాదు. ప్రత్యేకాంధ్రోద్యమంలో అరెస్టయ్యాను. ఇదేదో అరెస్టు వ్యవహారమే అనిపించింది. నేను ఉదయం తిరిగి రాకపోతే జూపూడి యజ్ఞనారాయణతో చెప్పి సర్చ్ వారెంట్ ఇప్పించమని ఇంట్లో చెప్పాను. కలెక్టర్‌గారు, ఎస్పీగారు అర్జెంట్‌గా తీసుకురమ్మన్నారని పోలీసులు అన్నారు. మమ్మల్నెందుకు తీసుకు రమ్మంటారయ్యా అర్ధరాత్రి అని అడిగాను. తెలియదన్నారు. అరండల్ పేట పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. కొంతసేపటికి కర్లపూడి రాఘవరావుగారిని తీసుకొచ్చారు. అప్పటికి కూడా నాకు అత్యవసర పరిస్థితి విధించిన సంగతి తెలియదు. పోలీసులకీ తెలియదు. కానీ నన్ను అరెస్టు చేసినట్టు హైదరాబాద్, ఢిల్లీలకి సమాచారం ఇస్తున్నారని అర్థమైంది. తొలి అరెస్టు నాదే. ఆఖరికి రాజమండ్రి జైలుకు


జేపీతో..


తెన్నేటి, నీలంలతో..


బల్‌రాజ్ మధోక్‌తో..

తీసుకువెళుతున్నామని చెప్పారు. మేం ఆ జైలుకు వెళ్లేసరికే చాలామంది ఉన్నారు. జైలు 'హౌస్‌ఫుల్' అని పైకి సమాచారం వెళ్లింది. రకరకాల వారంతా– అట్లూరి శ్రీమన్నారాయణ, ఐతా రాములు –సీపీఎం; డా. పివీఎన్ రాజు, టి. రామాచారి, లక్కరాజు రామనాథం, బొమ్మల శ్రీహరి, బొడ్డు రవీంద్రనాథ్, గొట్టిపాటి మురళీమోహన్, కొమరగిరి కృష్ణమోహన రావు, జూపూడి యజ్ఞనారాయణ– జనసంఘ్, వినోద్–ఆర్ఎస్ఎస్, తూమాటి బాలకోటేశ్వరరావు, కాతా జనార్దనరావు సోషలిస్టులు. ఎంవిఎస్ సుబ్బరాజు– పాత కాంగ్రెస్; మాధవ నారాయణ, లక్కలపూడి రామారావు, ప్రకాశ్‌రెడ్డి, రామ్మోహన్, సూర్యరావు–ఎం.ఎల్. కొంతమంది ఆనంద్ మార్గ్‌వారు ఉండేవారు. కొంత మంది స్మగ్లర్స్ ఉండేవారు. ఇది రాజమండ్రి జైలు.

**ఇంతకీ మీ మీద అభియోగం ఏమిటి?**

అదొక పెద్ద ప్రహేళిక. ఎమర్జెన్సీ కాబట్టి ఎందుకు అరెస్టు చేశారో చెప్పక్కరలేదన్నారు. తరువాత చెప్పారు. జూపూడి యజ్ఞనారాయణగారి ఇంట్లో సమావేశమై చెరుకుపల్లి పోలీస్ స్టేషన్ మీద దాడి చేసి, ఆయుధాలు ఎత్తుకుపోయే కుట్రొకటి చేశామట. మొత్తంగా, జేపీ ఉద్యమం హింసను ప్రేరేపించేదేనని వాళ్ల వాదన. అసలు జేపీ తన ఉద్యమానికంటూ ఒక కార్యాచరణనే ప్రకటించలేదు కదా అన్నాం మేం.

**మీతో పాటు ఇంకా జైల్లలో ఉన్నవారు ఎవరు?**

విజయవాడ రైల్వే స్టేషన్‌లోనే జూపూడి యజ్ఞ నారాయణ, బి. సుబ్బారెడ్డి, తూమాటి బాలకోటేశ్వర రావులను మీసా కింద అరెస్టు చేశారని తెలిసింది. వీరిని కూడా రాజమండ్రి తరలిస్తున్నారని సమాచారం కూడా తెలిసింది. కానీ వారిది రోడ్డు మార్గం. మాది రైలుమార్గం. నా జైలు జీవితం ఆరు అరెస్టులు, మూడు విడుదలలు అన్నట్టే జరిగింది. రాజమండ్రి, చంచల్‌గూడ, ముషీరాబాద్ జైళ్లలో మొత్తం పది నెలలు. జడ్జి అలా బెయిల్ ఇవ్వడం, బయటకు రాగానే పోలీసులు ఇలా అరెస్టు చేయడం. ముషీరాబాద్ జైలులో బి. సత్యనారాయణరెడ్డి, వి. రామారావు, వైసి రంగారెడ్డి, డి. సూర్యప్రకాశ్‌రెడ్డి, గౌతు లచ్చన్న, సుంకర సత్యనారాయణ, జీసీ కొండయ్య, తరిమెల నాగిరెడ్డి, ఆయన సోదరుడు రామదాసురెడ్డి ఉండేవారు. అన్నట్టు, ఫ్యాక్షనిస్టుగా వైఎస్ రాజారెడ్డి కూడా అప్పుడు ఉన్నారు. చంచల్ గూడ జైలులో నాయని నరసింహారెడ్డి, ఇంద్రసేనా రెడ్డి, ఏలే నరేంద్ర, చెరబండరాజు, వరవరరావు, శేషాచారి, ఎం. ఓంకార్ ఉండేవారు. న్యాయవాది అయినా కూడా బొజ్జా తారకం కూడా అరెస్టయి ఇక్కడికే వచ్చారు. వరంగల్ జైలు నుంచి కోర్టుకు హాజరయ్యే సమయంలో వెంకటనరసయ్య, జక్కా వెంకయ్య వస్తూ ఉండేవారు. బంగారు లక్ష్మణ్ కూడా వచ్చేవారు.



**ఆనాటి జైలు జీవితంలో మీకున్న కొన్ని ప్రత్యేక జ్ఞాపకాలు ఏమిటి?**

ఒకసారి ఇందిర ఒకమాట అన్నారు. 'మా నాన్నగారు జైలులో ఉండగానే చాలా రాశారు. ప్రతి నాయకుడు కొంతకాలం జైలులో ఉండడం అవసరమని నాకనిపిస్తుంది అని.' జైలు అన్నది వేరే అనుభవమే. నా మీద భౌతికంగా ఏమీ దాడి జరగలేదు. విజయవాడలో మొదలైంది జైలు యాత్ర. చుట్టూ పోలీసులు. విజయవాడలోనే ఒక పోలీస్‌ని పిలిచి రూపాయి ఇచ్చి, నాలుగు పత్రికలు తెమ్మని చెప్పాను. తెచ్చాడు. చూద్దును కదా, అన్నీ ఆంధ్ర పత్రికలే. ఇక జైలులో నేను కమ్యూనిటీ రేడియో పెడుతూ ఉండేవాడిని. అది డా. పీవీఎన్ రాజుగారికి నచ్చేది కాదు. మిగిలిన వాళ్ల గురించి పట్టదా అని ఆగ్రహించేవారు. చార్మినార్ పోలీస్ స్టేషన్ (ఈ స్టేషన్‌లో ఉన్నప్పుడే ఆంధ్రపత్రిక సంపాదకుడు శివలెంక రాధాకృష్ణ వచ్చి పరామర్శించి వెళ్లారు) నుంచి నన్ను సి క్లాస్ ఖైదీగా పంపేశారు. అంటే దొంగలు, చిల్లర నేరగాళ్లు ఉండేది. ఇక పాయ ఖానాల దగ్గర అనునిత్యం యుద్ధమే. లోపలికి వెళ్లిన వారు కాస్త ఆలస్యం చేస్తే, మేం బయట కడుపు ఉబ్బి చస్తుంటే, లోపల ఆ గాన కచేరీలు ఏమిటి అనేవారు కొందరు కోపంగా. మానసిక స్థితి కూడా మారిపోతూ ఉంటుంది. మొదట ఇందిర మీద ఆగ్రహం కలిగింది. తరువాత అది జైలు అధికారుల మీదకు మళ్లింది. చివరికి కుటుంబం ఎప్పుడు వస్తుందా అని వేచి చూసే దశకు చేరుకుంటాం.

**రోజువారీ జీవితం, భోజనవసతి వగైరా ఏమిటి?**

మాకు రోజుకు నాలుగున్నర రూపాయలు ఇచ్చేవారు. ఆ పైసలతోనే కొనుక్కోవాలి. జైలు అంటే పెద్ద ఊరు. 15వందలమంది ఉంటారు. పెళ్లాన్ని చంపేసినోడు ఉంటాడు, దొంగలు.. అందరు ఉంటారు కదా. వంట చేయటానికి ఒకరిని ఇచ్చే వారు. బట్టలుతికేవాళ్లను ఒకరిని పెడతారు. అంతా ఈ నాలుగున్నర రూపాయలలోనే. మేమొక 50మంది ఉన్నాం. అందరి డబ్బులు కలిపితే రెండు వందల పాతిక రూపాయలు. ఈ డబ్బులతో రోజు సరుకులు తెప్పించుకోవాలి. వండుకోవాలి. కమ్యూనిటీ రేడియో ఉండేది. దాంట్లో రోజూ ధరవరలు తగ్గాయని చెప్పేవారు. కానీ దుకాణంలో తగ్గేవి కావు. సరుకులు తెచ్చిన వాడిని ఏంట్రా ఇంత రేట్లు రాస్తున్నావు, రేట్లు తగ్గాయని రేడియో చెబుతుంది అనేవాళ్లం. అతడేమో నేను అడిగానండి, అయితే ఆ రేడియోనే అడుగమన్నాడని చెప్పాడు దుకాణదారు అన్నాడు. మాకు నెలకు ఒకటో రెండో కుటుంబ సభ్యులతో ఇంటర్వ్యూలు ఉండేవి. 1975 ప్రాంతంలో జనం దగ్గర డబ్బులు విస్తారంగా లేవు. కుటుంబ సభ్యులు మమ్ములను చూడడానికి రావాలంటే డబ్బులుండేవి కావు. అందుకని హైకోర్టుకు తీసుకెళ్లినప్పుడు బెజవాడ రైల్వేస్టేషన్‌కు వచ్చి చూసేవారు. తోబుట్టువులు, అమ్మావాళ్లు మా చేతులకు ఉన్న బేడీలు చూసి బావురుమని ఏడిస్తే మాకూ ఏడుపొచ్చేది.

**1977 తరువాత భారతదేశం మీద ఎమర్జెన్సీ ప్రభావం ఎంత?**

మొదటిగా చెప్పుకోవలసింది ఆంధ్రప్రదేశ్ మీద ఎలాంటి ప్రభావం లేదు. ఎమర్జెన్సీ పోరాటం, తరువాత జనతా పార్టీ నిర్మాణం వంటి పరిణామాలలో ఉన్న బృందాలు ఉన్నాయి కదా– జనసంఘ్, లోక్‌దళ్, ఓల్డ్ కాంగ్రెస్ వంటివి. వాళ్ల స్థిరాభిప్రాయం ఒక్కటే. ఇక ఇందిరాగాంధీ పని అయిపోయింది. భవిష్యత్తు అంతా కాంగ్రెస్ వ్యతిరేక శిబిరానిది. ఆ అధికారం కోసం జరిగే పోరాటంలో ఎవరి వాటా ఎంత? ఎవరి ప్రాధాన్యం ఎంత? అని లెక్కలు వేసుకోవడంలో మునిగిపోయారు. దీనికి ఒక విధమైన నేపథ్యం ఉంది మరి! 1971 ఎన్నికలలో ఇందిరాగాంధీ ఘన విజయం సాధించింది. కానీ ఆమె ఘనత ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. అంటే అంతేవేగంగా ప్రతిష్ట కోల్పోయారామె. ఆఖరికి నగార్వాలా అనేవాడు ఆమె పేర డబ్బులు తీసుకున్నాడంటే కూడా జనం నమ్మే టంతగా ఆమె ప్రతిష్ట పడిపోయింది. ఆ డబ్బులు ఆమె కొట్టేసిందంటే నాకైతే నమ్మశక్యంగా లేదు.

**అత్యవసర పరిస్థితి పరిణామాలలో మీకు బాగా నచ్చిన అంశం ఏది?**

జైలు జీవితం.

**అప్పుడు చూసినవారిలో బాగా నచ్చినవారు?**

కొల్లా వెంకయ్య. సీపీఎం నాయకుడు. ఒకసారి ఈయన ఎన్.జి. రంగాని ఓడించారు.

**మొత్తం అత్యవసర పరిస్థితి పరిణామాలలో మీకు రుచించని అంశం?**

కాంగ్రెస్ వ్యతిరేక శిబిరాన్ని ఏకం చేయలేక పోవడం.

**మీరు ప్రధానంగా సోషలిస్ట్. వీరి పాత్ర గురించి ఏమంటారు?**

తుర్లపాటి సత్యనారాయణ తెలుసు కదా! సోషలిస్ట్. ఆయన అన్నమాట చెబుతాను, చాలు. సోషలిస్టులుగా బయలుదేరాం. అన్ని పార్టీలలోను చేరాం. అన్ని పార్టీలనీ చీల్చాం. ★

ఎమర్జెన్సీలో జాగృతి

# సాహసంతో కొన్ని అడుగులు...

జాతీయ వారపత్రిక 'జాగృతి' ప్రస్థానం అత్యవసర పరిస్థితిలో ఎలా ఉంది? ఎమర్జెన్సీకి ప్రధాన శత్రువు పత్రికారంగమే అయిన నేపథ్యంలో ఈ ప్రశ్న తప్పదు. చిన్నదైనా, పెద్దదైనా పత్రిక అంటే చాలు, ఎమర్జెన్సీ తడాఖా ఏమిటో చవిచూశాయి. జాగృతి ఆర్‌ఎస్‌ఎస్ వాణి. ఎమర్జెన్సీ విధించిన ఐదు రోజులకు సంచిక (జూన్ 30,1975) యథావిధిగా వెలువడింది. మొదటి పేజీయే కాదు, సంపాదకీయ స్థలం కూడా ఖాళీగా వదిలారు. ధైర్యంగా ఎమర్జెన్సీకి నిరసన ప్రకటించారు.

సెన్సార్ కన్ను పడినట్టు ఆ ఖాళీలు వెల్లడిస్తున్నాయి. అయినా, 'ప్రధాని పదవి ఊడిపోతే దేశసేవ చేసేదెలా?' పేరుతో ప్రచురించిన వ్యంగ్య రచన (పోగి) ఎలాగో సెన్సారు కత్తెర నుంచి తప్పించుకుంది. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ ఓటమి మీద వ్యంగ్యబాణమిది. ధనికులు, పేదలు అని కమ్యూనిస్టులు సమాజాన్ని చీల్చి పారేసినట్టు, ఇందిరాగాంధీ దేశ సేవాసంప్రదాయాలు తెలిసిన కుటుంబాలు, తెలియని కుటుంబాలు అని చీల్చారని పోగి అన్నారు. స్వాతంత్ర్యోద్యమంలో, తరువాత చాలామంది పెళ్లి కూడా చేసుకోకుండా దేశం కోసం పాటుపడ్డారు. వారు దేశసేవకుల హోదాకు అర్హులు కారా? అంటే, కారనే చెప్పాలంటారు పోగి. ఎందుకంటే దేశసేవా సంప్రదాయాలు తెలిసిన 'కుటుంబం'లో పుట్టకపోవడమే వారు చేసిన పాపం. అలాంటి దేశసేవ సంప్రదాయం తెలిసిన కుటుంబంలో పుట్టి, కోర్టు తీర్పు వల్ల పదవి ఊడిపోతే సేవ చేయడం ఎలా అంటూ ముగించారీ వ్యాసం.

నాలుగవ పేజీలో వ్యాసం కత్తెర జాడ లేకుండా పాఠకులకు చేరడం వింతలలో కెల్లా వింత. అది సుప్రీంకోర్టు షరతులతో కూడిన స్టేను ప్రశ్నించింది. 'ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉండవచ్చునని జడ్జి చెప్పవలసిన అవసరం ఏమి వచ్చింది?' అని ప్రశ్నించిందీ వ్యాసం. వ్యాసకర్త ప్రముఖ న్యాయవాది, ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖుడు గొట్టిపాటి మురళీమోహన్. 'తాను ఏ సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారో, ఆ సభలో ఓటు వేసే హక్కు లేనప్పుడు ఎవరైనా సభ్యుడిగా ఎలా కొనసాగగలరు?' అని ప్రశ్నిస్తు ప్రఖ్యాత న్యాయ నిపుణుడు, కేంద్ర మాజీ విదేశాంగ మంత్రి ఎంసీ చాగ్లా మాటలను కూడా ఇదే పేజీలో ప్రచురించారు. అందుకే ఇది యథాతథంగా ఎలా బయటపడిందో తెలియదు. ఆరో పేజీలో హరియాణాలో బలవంతపు 'ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ల' వార్త, ఉత్తరప్రదేశ్‌లో సత్యాగ్రహాల వార్తకు చోటు కల్పించారు. తరువాత ఆగస్ట్ 8, 1975 సంచిక వెలువడింది. ఇందులో పత్రికా సమస్యల గురించి సంపాదకుల సలహాలకు మంత్రి శుక్లా ఆహ్వానం' పేరుతో ఒక వార్త ఉంది. సంపాదకీయం 'కంటక నిర్మూలనం'. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కంటక నిర్మూలన చేపట్టినట్టు (అక్రమ వ్యాపారులు, కల్తీ వ్యాపారులు వగైరాల పనిపట్టడం) వచ్చిన వార్త మీద వ్యాఖ్య ఇది. అసలు కంటకులు అంటే ఎవరో వర్ణించారు తప్ప విశ్లేషణ లేదు.

తరువాత ఆగస్ట్ 15,1975 సంచిక ముఖపత్ర కథనాలు కూడా సెన్సారు కన్ను కప్పి వచ్చినవే. 'సీపీఐపై అదుపు అవసరం' అన్న శీర్షికతో వ్యాసం ప్రచురించారు. 'ప్రస్తుత పరిస్థితిపై సమీక్ష అవసరం' అన్న వార్త మరొకటి. ఇది ప్రధాని ఇందిరాగాంధీకి ప్రముఖ రాజకీయ నాయకుడు ఎన్‌జీ గోరే రాసిన లేఖకు సంబంధించినది. సంపాదకీయం–అంతర్జాతీయ బంగారం మార్కెట్ మీద. అక్టోబర్ 6, 1975 సంచికలో వెలువడిన 'ఎమర్జెన్సీలో 100 రోజులు/సమీక్షకిది సమయం' (మ.రా.వ్యా) వ్యాసం, యథాతథ స్థితిని కొనసాగించడం సరికాదని, ఎమర్జెన్సీలో సాధించినట్టు చెబుతున్న అంశాల మీద, ఇక ముందు అధికార విపక్షాలు కలసి ప్రయాణించడం గురించి చర్చ నిర్వహించాలని ఈ వ్యాసంలో కోరారు. మిగిలిన పత్రికల వలెనే బ్లాక్‌మార్కెటీర్లను, దొంగ వ్యాపారులను ఎమర్జెన్సీ నిరోధించిందన్న అభిప్రాయం వైపు ఒకింత మొగ్గు కూడా ఇందులో కనిపిస్తుంది. మొత్తానికి పత్రికను జూన్ 19, 1976 వరకు నడిపించారని, ఆగస్ట్ 12,1977 నాటి సంచిక ద్వారా తెలుస్తుంది. మళ్లీ కలుద్దామంటూ ఆనాటి పత్రికలో పేర్కొన్నట్టు సంపాదకీయం ప్రస్తావించింది. అదే ఎమర్జెన్సీ ఎత్తేశాక, జాగృతి పునర్దర్శనం సందర్భంగా రాసిన సంపాదకీయం 'తొలి పలకరింపు'. ఈ సంచికను ఆగస్ట్ 12 సాయంత్రం విజయవాడలో దుర్గాభవన్ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. విశాఖకు చెందిన పీవీ చలపతిరావు సభాధ్యక్షులు. సదాలక్ష్మి, పిన్నమనేని లింగయ్యచౌదరి (జాగృతి ప్రకాశన్ ట్రస్ట్ అధ్యక్షులు), ప్రముఖ రచయిత భండారు సదాశివరావు, ప్రఖ్యాత రచయిత్రి మాదిరెడ్డి సులోచన వంటివారు పాల్గొన్నారు. తరువాత నుంచి ఎమర్జెన్సీ కథనాలు విశేషంగా వెలువడ్డాయి.

ఎమర్జెన్సీలో పత్రికను మూసివేసినప్పుడు నాటి సంపాదకుడు తూములూరి లక్ష్మీనారాయణ ఆంధ్రపత్రికలో చేరారు. ఉప సంపాదకుడు కందర్ప రామచంద్రరావు ఆంధ్రప్రభలో చేరారు. ఎమర్జెన్సీ తరువాత ఈ వ్యాసకర్త సంపాదకుడిగా జాగృతి తిరిగి వెలువడడం ప్రారంభమైంది.


జాగృతి


జాగృతి

స్వాతంత్ర్య భానూదయం తెచ్చిన వెలుగు



**పి. వేణుగోపాలరెడ్డి**
మాజీ సంపాదకుడు, జాగృతి



# క్షమాపణలు చెప్పడం

ఇప్పటికీ, ఎప్పటికీ ఎమర్జెన్సీ ఒక రాజకీయ అస్త్రమే. దాని ప్రభావం, దాని ఫలితం ఇప్పట్లో తొలగిపోయేదేమీ కాదు. దేశ ప్రజాస్వామిక చరిత్రలో ఇది ఒక ఘోర కళంకంగానే మిగిలిపోతుందనడంలో సందేహం లేదు. కాంగ్రెస్ పార్టీ ఈ విషయంలో దేశ ప్రజలకు నిర్ద్వంద్వంగా క్షమాపణలు చెబితే తప్ప ప్రజలు ఆ పార్టీని, ఇందిరా గాంధీని క్షమించే అవకాశం కూడా ఉండదు. ఏడాది క్రితం పార్లమెంటులో ఎమర్జెన్సీ మీద వాడి వేడి చర్చ జరగడం ఈ సమస్య భూస్థాపితం కాలేదనడానికి ఒక నిదర్శనం. లోక్‌సభలో స్పీకర్ ఎన్నిక తర్వాత మళ్లీ ఎమర్జెన్సీ అంశం రేకెత్తడాన్ని బట్టి ఎమర్జెన్సీ ఒక మరచిపోలేని అంశమని అర్థమవుతోంది. గత ఏడాది జూన్ 26న లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నికైన తర్వాత ఓం బిర్లా 1975 నాటి అత్యవసర పరిస్థితిని ఖండిస్తూ ఒక తీర్మానాన్ని ప్రతిపాదించారు. పైగా, కనీవినీ ఎరుగని విధంగా ఆయన దీనిపై రెండు నిమిషాల పాటు లోక్‌సభ సభ్యులతో మౌనం పాటింపజేశారు. భారతీయ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎమర్జెన్సీ ఒక చీకటి దశ అని కూడా ఆయన అభివర్ణించారు. ఇందిరా గాంధీ దేశంలో ఎమర్జెన్సీ విధించి (జూన్ 26,1975) 50 ఏళ్లు నిండిన సందర్భంగా ఆయన పార్లమెంట్ సభ్యులతో దీనిమీద మౌనం పాటింప జేశారు. ఎమర్జెన్సీ అనుభవాలను మరోసారి గుర్తు చేసుకోవడానికి ఇది అవకాశ మిచ్చింది. సహజంగానే ఇది కాంగ్రెస్ పార్టీకి కంటగింపయింది.

ఈ చరిత్రాత్మక దుర్ఘటనకు సంబంధించి రెండు నిమిషాల పాటు మౌనం పాటించిన తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా కూడా ప్రాధాన్యం సంతరించు కున్నాయి. వ్యక్తిగతంగా కూడా ఆయన దీనిపై తీవ్ర స్థాయిలో స్పందించినట్టు కనిపించింది. తానొక నిరంకుశుడుగా, ఆధిపత్య ధోరణి కలిగిన వ్యక్తిగా, కాంగ్రెస్ గత పదేళ్లుగా చేస్తున్న విమర్శలు, ఆరోపణ లను దృష్టిలో పెట్టుకుని ఆయన ఈ స్మారక దినాన విరుచుకుపడ్డారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారం సందర్భంగా కాంగ్రెస్ తన పట్ల సాగించిన దుష్ప్రచా రాన్ని మోదీ తిప్పికొట్టే ప్రయత్నం చేశారు. "ఎమర్జెన్సీ రోజుల్లో కారాగారాల్లో మగ్గినవారికి, ప్రాణాలు కోల్పోయిన వారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించడం నిజంగా ఒక గొప్ప విషయం. రాజ్యాంగాన్ని లెక్కచేయకపోయినా, రాజ్యాంగం పట్ల గౌరవాభిమానాలు లేకపోయినా దేశానికి ఎంత అరిష్టం జరుగుతుందనేది ప్రస్తుత యువతరం అర్థం చేసుకోవాలి. ఎమర్జెన్సీ సమయంలో రాజ్యాంగాన్ని భ్రష్టుపట్టించడమే కాకుండా, ప్రజల గొంతుకను నొక్కేయడం, నిరంకుశంగా వ్యవహ రించడం, ప్రజాస్వామిక సంస్థలను నిర్వీర్యం చేయడం తదితర పరిణామాలను భావితరాల వారు తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. నిరంకుశత్వం అంటే ఏమిటో ఎమర్జెన్సీ ప్రపంచానికి చాటి చెప్పింది" అని మోదీ వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రచార సమయంలో కాంగ్రెస్ పార్టీ ఆయనను నిరంకుశుడుగా అభివర్ణిస్తూ ప్రచారం చేసిన విషయం తెలిసిందే.

**విష ప్రచారానికి పరాకాష్ఠ**

ఎన్నికల ప్రచార సమయంలో కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని తమ ప్రధాన ప్రచారాస్త్రంగా చేసుకుంది. దళిత, వెనుకబడిన తరగతుల ఓట్లను వీలైనంతగా రాబట్టుకోవడానికి అనేక సందర్భాల్లో రాజ్యాంగాన్నే ఉటంకించింది. మోదీ నాయకత్వంలోని బీజేపీ మూడవసారి అత్యధిక మెజారిటీతో అధికారం లోకి వస్తే రాజ్యాంగాన్ని పూర్తిగా మార్చేస్తుందని, దళితులు, వెనుకబడిన వర్గాల రిజర్వేషన్లను రాజ్యాంగ సవరణ ద్వారా రద్దు చేస్తుందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీ సహా పలువురు కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేశారు. ఎన్నికల ప్రచారంలోనే కాకుండా, లోక్‌సభలో మోదీ ప్రసంగిస్తున్న సమయంలో కూడా రాహుల్ గాంధీ రాజ్యాంగ ప్రతిని పదే పదే ప్రదర్శించి తప్పుడు వ్యాఖ్యానాలు చేయడం జరిగింది.

అయితే, ఎమర్జెన్సీ సమయంలోనే కాకుండా ఇతర సమయాల్లో కూడా కాంగ్రెస్ రాజ్యాంగాన్ని దెబ్బతీసిన తీరును రాహుల్ గాంధీకి గుర్తు చేయడానికి గత జూన్ 26 నాటి లోక్ సభ చర్చ బీజేపీకి బాగా ఉపయోగపడింది. ఇందులో భాగంగా లోక్‌సభ సభ్యులతో మౌనం పాటింప జేయడం ఒక మంచి అవకాశంగా కనిపించింది. దేశంలో ప్రజా స్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య సంస్థలను ఖూనీ చేసింది ఎవరనే విషయాన్ని ఈ తరం యువతీయువకులు అర్థం చేసుకోవాలన్నదే మోదీ ధ్యేయంగా కనిపించింది. కాంగ్రెస్ ఈ విషయంలో తన పాపాలను, దుష్కృత్యాలను కడిగేసుకోవడానికి, మోదీ మీద దుష్ప్రచారం సాగించడానికి రాజ్యాంగాన్ని ఉపయోగించుకున్నట్టుగా దేశ ప్రజలు అర్థం చేసుకోవడానికి ఈ సందర్భం బాగా తోడ్పడింది. అంతేకాదు, దేశ ప్రజల మీద మోదీ అప్రకటిత



**జి.రాజశుక**
సీనియర్ జర్నలిస్ట్

# కాంగ్రెస్ విధి

ఎమర్జెన్సీని విధించారంటూ ప్రచారం చేసిన రాహుల్ తమ వెనుకటి చరిత్రను ఒకసారి గుర్తు చేసుకోవడానికి ఈ సందర్భం అవకాశమిచ్చింది. లోక్‌సభలో రెండు పర్యాయాలు మోదీ తన ప్రసంగాల్లో రాజ్యాంగానికి కాంగ్రెస్ పార్టీ చేసిన ద్రోహాన్ని, రాజ్యాంగం పట్ల చేసిన అపచారాలను గుర్తు చేశారు.

**ఒప్పుకోలుకు దూరం**

దీనికి కాంగ్రెస్ స్పందన ఏమిటన్నది వెంటనే వెల్లడి కాలేదు. నిజానికి ఎమర్జెన్సీ అంశాన్ని ప్రస్తావించినప్పుడల్లా కాంగ్రెస్‌పార్టీ మండిపడుతూనే ఉంటుంది. 2014 తర్వాత మోదీ వ్యవహరించిన తీరు కన్నా 1975 నాటి ఎమర్జెన్సీ అనేక విధాలుగా నయమని కాంగ్రెస్ చెప్పడానికి ఎక్కడా అవకాశం కనిపించలేదు. కాంగ్రెస్ అదే చేసే పక్షంలో దాని విశ్వసనీయత తగ్గిపోయే అవకాశం ఉంది. దాని మిత్రపక్షాలు సైతం ఆ పార్టీ మీద కినుక వహించడం జరుగుతుంది. మిత్ర పక్షాల్లోని కొందరు సీనియర్ నాయకులు సైతం ఎమర్జెన్సీ బాధితులే. 1975 నాటి ఎమర్జెన్సీని ఖండిస్తూ మున్ముందు జరిగే కార్యక్రమాల్లో కాంగ్రెస్ పాల్గొనగలుగుతుందా? ఎమర్జెన్సీని విధించడం పొరపాటేనని, ఇక ముందు అలా జరగబోదని, రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి కాంగ్రెస్ యథా శక్తి ప్రయత్నిస్తుందని ఈ పార్టీ బహిరంగంగా చెప్పగలుగుతుందా?

నిజానికి, 1978 జనవరిలో ఇందిరాగాంధీ మహారాష్ట్రలోని యావత్‌మల్‌లో ఒక బహిరంగ సభలో ప్రసంగిస్తూ, ఎమర్జెన్సీ సమయంలో జరిగిన అవకతవకలకు, హింసా విధ్వంసకాండలకు, ఇతర తప్పిదాలకు తాను పూర్తి బాధ్యత వహిస్తున్నట్టు ప్రకటించారు. అయితే, ఆమె తన మాటలను తానే నీరు కారుస్తూ, దేశాన్ని కాపాడడానికే తాను ఎమర్జెన్సీని విధించాల్సి వచ్చినట్టు ప్రకటించడం ఆమె ఉద్దేశాన్ని మరోసారి బయట పెట్టింది. అదే విధంగా 2021 మార్చిలో రాహుల్ గాంధీ కూడా ఎమర్జెన్సీని విధించడం తప్పేనని అంగీకరించారు. అయితే, దేశ ప్రజాస్వామ్యాన్ని కాలరాయడం కాంగ్రెస్ ఉద్దేశం కాదని ఒక మెలిక పెట్టడంతో ఆయన ఒప్పుకోలుకు అర్థం లేకుండా పోయింది. ఆయన మాటల్లో ఏ మాత్రం నిజం లేదు. ఎమర్జెన్సీ సమయంలో కనీవినీ ఎరుగని స్థాయిలో అవినీతి చోటు చేసుకుంది. ప్రజాస్వామ్య సంస్థల ఖూనీ జరిగింది. అధికార వ్యవస్థ, న్యాయవ్యవస్థ ప్రభుత్వానికి పూర్తిగా పాదాక్రాంతం కావడం, చెంచాగిరీకి అడ్డూఅపూ లేకుండా పోవడం అన్నవి అప్పుడే ప్రారంభం అయ్యాయి. వంశపారంపర్య పాలనకు అంకురార్పణ కూడా అప్పుడే జరిగింది. మెలికలు పెట్టే బదులు నేరుగా, నిర్ద్వంద్వంగా తప్పు ఒప్పుకోవడం మీదే కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తు ఆధారపడి ఉంది. అంతవరకూ అది గురివింద గింజ సామెతను గుర్తు చేయకపోవడం మంచిది.

ఇక 1975 నాటి ఎమర్జెన్సీని ఇప్పటి మోదీ ఆధిపత్య ధోరణితో పోల్చడం ఏ విధంగానూ సమంజసం కాదు. అప్పటి పరిస్థితులు వేరు. ఇప్పటి పరిస్థితులు వేరు. మోదీ కొద్దిగా కఠినంగా వ్యవహరించడం అన్నది ఇప్పటి పరిస్థితుల దృష్ట్యా అనివార్యం. కానీ, ఎమర్జెన్సీ మాత్రం ప్రజాస్వామ్యం పట్ల, రాజ్యాంగం పట్ల ఘోరమైన ఘాతుకమనే చెప్పాలి. కాంగ్రెస్ పార్టీ తన 56 ఏళ్ల పాలనలో రాజ్యాంగాన్ని 90 కంటే ఎక్కువ పర్యాయాలు మార్చింది. బీజేపీ తన పదేళ్ల కాలంలో పదిసార్లు కూడా రాజ్యాంగాన్ని మార్చలేదు. పైగా, కాంగ్రెస్ తన రాజకీయ అవసరాల కోసం, ఓటు బ్యాంకులను అభివృద్ధి చేసుకోవడం కోసం రాజ్యాంగాన్ని మార్చిందనడంలో సందేహం లేదు. మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం చేసిన రాజ్యాంగ సవరణల్లో ఎక్కడా రాజకీయ ప్రయోజనాలు కనిపించవు. వాస్తవానికి లోక్‌సభ ఎన్నికల ఫలితాలను దేశ ప్రజలు, దేశంలోని పార్టీలు జీర్ణం చేసుకుంటున్న సమయానికి, జూన్ 5వ తేదీని కూడా గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఎమర్జెన్సీ తర్వాత ఆ రోజున జయప్రకాశ్ నారాయణ్ సంపూర్ణ విప్లవానికి పిలుపునిచ్చారు. జూన్ 4 ఫలితాలతో పండగ చేసుకుంటున్న ప్రతి పక్షాలు జూన్ 5న ఈ శుభ సందర్భాన్ని కూడా గుర్తు చేసుకుని ఉంటే బాగుండేది. ★




# ఎమర్జెన్సీ వ్యతిరేకోద్యమ సారథి సంఘ్

అత్యవసర పరిస్థితిని విధించిన పది రోజులకి, జూలై 4,1975న నాటి ఇందిరాగాంధీ ప్రభుత్వం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ మీద నిషేధం విధించింది. అదే సమయంలో నిషేధానికి గురైన 26 సంస్థలలో ఆర్ఎస్ఎస్ అతి పెద్దది. దేశంలో రాబోయే పరిస్థితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అత్యవసర పరిస్థితిని ప్రకటించిన రెండోరోజు, జూన్ 27న నాటి సర్‌సంఘచాలక్ బాలాసాహెబ్ దేవరస్ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. జూన్ 30, 1975న బాలాసాహెబ్ దేవరస్‌ను నాగపూర్ రైల్వేస్టేషన్ దగ్గర కస్టడీలోకి తీసుకున్నారు. దేశంలో చాలామంది స్వయంసేవకుల ఇళ్లు రహస్యోద్యమానికి ప్రత్యేక స్థలాలుగా మారాయి. చాలామంది స్వయంసేవకులు అజ్ఞాతంలోకి వెళ్లారు. ఆర్ఎస్ఎస్ నాయకులు, కార్యకర్తలకు మాత్రమేకాదు, ఇతర సంస్థలకు చెందిన వారికి కూడా స్వయంసేవకుల ఇళ్లే సురక్షిత స్థలాలుగా ఉండేవి.

ఎమర్జెన్సీలో భయంకరమైన నిశ్శబ్దం తాండవించింది. సమాచార లోపంతో నరాల తెగేటంత ఉత్కంఠ నెలకొని ఉండేది. ఏ నాయకుడిని అరెస్టు చేసి ఎక్కడ ఉంచారో కూడా ఆచూకీ తెలిసేది కాదు. ప్రధాన స్రవంతి పత్రికల మీద సెన్సార్‌షిప్ అమలులో ఉంది. పోలీసులు ఇచ్చిన ప్రకటనలు మాత్రమే ప్రచురించేవి. వాస్తవాలు చెప్పడానికి చాలామంది స్వయంసేవకుల ఇళ్లు అచ్చు యంత్రశాలలుగా మారాయి.



**అత్యవసర పరిస్థితి సమయంలో దేశంలో పత్రికల నోరు నొక్కారు కాబట్టి, విదేశీ పత్రికలు, రేడియో ఇచ్చే సమాచారమే ఆధారమయింది. అయితే భారతదేశంలో ఉన్న విదేశీ మీడియా ప్రతినిధులు ఆర్‌ఎస్‌ఎస్ నిర్వహించిన పాత్ర గురించి, ప్రజాస్వామ్య పునరుద్ధరణ గురించి వార్తలు ప్రచురించారు.**

కరపత్రాలు, బులెటిన్లు విడుదలయ్యాయి. కొన్ని జిల్లాల నుంచి, ఢిల్లీ నుంచి కూడా ఆ సమాచారం అత్యంత రహస్యంగా కార్యకర్తలకు చేరేది. అలాంటి రహస్య పత్రికలలో ఒకటి ఢిల్లీ నుంచి ప్రచురించిన 'సత్య సమాచార్'. ఈ రహస్య పత్రికలకు, కరపత్రాలకు న్యూస్‌వీక్, న్యూయార్క్ టైమ్స్ నుంచి ఎమర్జెన్సీకి సంబంధించిన అందేది.

1975, అక్టోబర్‌లో ఢిల్లీలో కామన్వెల్త్ గోష్టి జరిగింది. సంప్రదాయం ప్రకారం దీనికి ప్రతిపక్షాలను కూడా ఆహ్వానించాలి. ప్రతిపక్షాల కార్యకర్తలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. వీరిలో అధికులు స్వయంసేవకులే. 42వ రాజ్యాంగ సవరణ గురించి ఇంటింటికీ తిరిగి, దానిని వ్యతిరేకించవలసిన ఆవశ్యకత గురించి స్వయంసేవకులే చెప్పారు. దేశవ్యాప్తంగా 1,30,000 మంది సత్యాగ్రహం చేస్తే అందులో 1,00,000 స్వయంసేవకులే. మీసా కింద అరెస్టయిన 30,000 మందిలో 25,000 మంది స్వయంసేవకులు. వీరంతా జైలుకు వెళ్లారు. స్వయంసేవకులైన కారణంగా చాలామంది ఉద్యోగాలు కోల్పోయారు. తమ వ్యాపార సంస్థలు మూసివేయవలసి వచ్చింది. విద్యార్థి స్వయంసేవకుల చదువులు ఆగిపోయాయి. దాదాపు 100 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆనాటి అత్యాచారాల మీద దర్యాప్తు కోసం నియమించిన షా కమిషన్ వివరాల ప్రకారం 1,11,000 మంది అరెస్టయ్యారు.

సంకెళ్లలో ఉన్నా జీవన శైలికి సంబంధించిన క్రమశిక్షణను వీడకుండా కొనసాగించినవారు స్వయంసేవకులే. జైళ్లలో కూడా వారు క్రీడలు, సాహిత్యం, యోగ, సంగీతం, భజనలు, హోమియో ప్రాక్టీస్ వంటివి ఏవీ విడిచిపెట్టలేదు.

ఎమర్జెన్సీలో స్వయంసేవకుల పాత్ర గురించి వెలువడిన కొన్ని అభిప్రాయాలను గమనించడం అవసరం.

క్విట్ ఇండియా ఉద్యమంలో పనిచేసిన సోషలిస్ట్ అచ్యుత్ పట్వర్ధన్ జూన్ 9, 1979న ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌కు రాసిన వ్యాసంలో ఇలా పేర్కొన్నారు. 'ప్రతిఘటన విషయంలో మిగిలిన సంస్థల వారి కంటే స్వయంసేవకుల నుంచే నేర్చుకోవలసినది ఎక్కువ. అత్యవసర పరిస్థితికి వ్యతిరేకంగా ఎవరు పోరాడుతున్నా వారు మద్దతు ఇచ్చారు.' ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు ఏకే గోపాలన్ చేసిన ఉద్విగ్న భరిత వ్యాఖ్య కూడా అదే రోజు పత్రికలో వెలువడింది. 'అంతటి సాహసం చూపడానికి, త్యాగం చేయడానికి వారి సిద్ధాంతం వారికి అత్యున్నత స్ఫూర్తిని ఇచ్చింది' అన్నారాయన.

అత్యవసర పరిస్థితి సమయంలో దేశంలో పత్రికల నోరు నొక్కారు కాబట్టి, విదేశీ పత్రికలు, రేడియో ఇచ్చే సమాచారమే ఆధారమయింది. అయితే భారతదేశంలో ఉన్న విదేశీ మీడియా ప్రతినిధులు ఆర్‌ఎస్‌ఎస్ నిర్వహించిన పాత్ర గురించి, ప్రజాస్వామ్య పునరుద్ధరణ గురించి వార్తలు ప్రచురించారు. జనవరి 24, 1976 నాటి సంచికలో 'ది ఎకనమిస్ట్' పత్రిక ఒక వ్యాసం ప్రచురించింది. దాని శీర్షిక 'ఔను అజ్ఞాత ఉద్యమం ఉంది'. ఆ ఉద్యమంలో జనసంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్ రాజకీయ విభాగం), సోషలిస్ట్ పార్టీ, కాంగ్రెస్ చీలిక వర్గం, లోక్‌దళ్ ఉన్నాయి. అయితే వేగంగా పనిచేసిన బృందాలు జనసంఘ్ వారివే. అంటే ఆర్‌ఎస్‌ఎస్ రాజకీయ విభాగానివే. ఆ సంస్థకు కోటి మంది సభ్యులు ఉంటే, వారిలో 6000 పూర్తి సమయ కార్యకర్తలు సహా, 80,000 మంది జైలుకు వెళ్లారు. రహస్యోద్యమం నడుపుతున్న నలుగురు ప్రముఖులలో ఇద్దరు దత్తోపంత్ ఠేంగ్డీ (ఆర్‌ఎస్‌ఎస్ సీనియర్ ప్రచారక్), సుబ్రమణియంసామి (రాజ్యసభ సభ్యుడు) జనసంఘ్ వారేనని కూడా ఆ పత్రిక పేర్కొన్నది. ఏప్రిల్ 4, 1976న న్యూయార్క్ టైమ్స్ పత్రిక ఆర్‌ఎస్‌ఎస్ మీద ఇందిర ప్రభుత్వం చేస్తున్న దుష్ప్రచారం గురించి ఒక వ్యాసమే ప్రచురించింది. కర్రలు, కర్రకత్తులు దొరికితేనే ఫోటోలు వేయించి ప్రచారం చేయాలా అని ఆ వ్యాసకర్త జె. ఆంథోనీ లూకాస్ నాటి హోం శాఖ సహాయ మంత్రి ఓం మెహతాను ప్రశ్నించారు. లోహంతో చేసిన కొన్ని కత్తులు కూడా ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయాలలో దొరికాయని ఆయన అస్పష్టమైన సమాధానం ఇచ్చాడని ఆ వ్యాసంలో తెలియచేశాడు లూకాస్. కర్రలు, కర్రకత్తులు సుశిక్షితమైన, ఆధునిక ఆయుధ సంపత్తి కలిగిన పది లక్షల సైన్యానికి బెడద ఎలా అవుతాయని కూడా ఆయన ప్రశ్నించారు. సైన్యంతో పాటు 85,000 మంది బీఎస్ఎఫ్, 57,000 సెంట్రల్ రిజర్వు ఫోర్సు, 7,55,000 రాష్ట్రాల పోలీసులకు బెడద అని ఎలా చెప్పగలరని లూకాస్ నిలదీస్తే, అందుకు మెహతా, నిస్సందేహంగా వాళ్ల దగ్గర కొన్ని రైఫిళ్లు కూడా ఉన్నాయి అని సమాధాన మిచ్చారు. మీరేమైనా స్వాధీనం చేసుకున్నారా అన్న మరొక ప్రశ్నకు, 'లేదు' అంటూనే, వాటిని బహుశా వాళ్లు ఇళ్లలో దాచి పెట్టి ఉంటారు. వాళ్లని తక్కువ అంచనా వేయకూడదు అని జవాబు ఇచ్చాడు మెహతా. ఆగస్ట్ 2,1976న 'ది గార్డియన్' పత్రిక ప్రచురించిన వ్యాసంలో చాలామంది ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు అరెస్టును తప్పించుకోవడానికి నేపాల్ వెళ్లిపోయారని, వారిలో ఎవరినీ భారత పోలీసులకు అప్పగించడానికి నేపాల్ అధికారులు అంగీకరించ లేదని ఆ దేశ దౌత్య కార్యాలయం తెలియచేసిందని పేర్కొన్నది. అంత నిర్బంధంలోను సుదూర కేరళకు, ఇతర దక్షిణాది రాష్ట్రాలకు ఆర్‌ఎస్‌ఎస్ విస్తరించిందని నాటి హోంశాఖ మంత్రి ప్రకటనను ది గార్డియన్ ఉటంకించింది. కమ్యూనిస్టేతర పక్షాలను అణచివేయడానికి ఎమర్జెన్సీని సీపీఐ ఉపయోగించు కోవాలనుకున్న విషయాన్ని కూడా ఆ పత్రిక వెల్లడించింది. ఎమర్జెన్సీని సమర్థించిన పార్టీలు రెండే– సీపీఐ, ముస్లిం లీగ్.

జూన్ 25,2024న 'న్యూస్ 18' చానల్ ఇచ్చిన ఒక కథనం ఎమర్జెన్సీలో నరేంద్ర మోదీకి సంబంధించినది. ఆ సమయంలో ఆయన అరెస్టు నుంచి తప్పించుకున్నారు. ఆర్‌ఎస్‌ఎస్ యువ ప్రచారక్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న మోదీ నాడు గుజరాత్‌లో రాజ్యాంగాన్ని బహిరంగంగా చదివే ఉద్యమం నిర్వహించారు. అలాగే ఎమర్జెన్సీ వ్యతిరేక ప్రచురణలు పంచిపెట్టారు. ఎమర్జెన్సీ వ్యతిరేకోద్య మంతో ఆయన సన్నిహితంగా మెలిగారు కాబట్టి పెద్దల ఆదేశం మేరకు 'సంఘర్ష్ మా గుజరాత్' అన్న పుస్తకం రాశారు. నిద్రాహారాలు లేకుండా నిమ్మ రసం తాగుతూ 23 రోజులలో ఆ రచన పూర్తి చేశారు మోదీ. మరొక పుస్తకం ఆపత్కాల్ కె సేనాని: నరేంద్ర మోదీ.

**– జాగృతి డెస్క్**

# అజ్ఞాత సాహిత్యమే కరదీపిక

"వంగమంటే పాకడం" అనే సామెత ఉంది. 'ఎమర్జెన్సీ' (అంతరంగిక అత్యవసర పరిస్థితి) సమయంలో పత్రికల పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది. 1975 జూన్ 25వ తేదీ అర్ధరాత్రి 'ఎమర్జెన్సీ' ప్రకటన వెలువడిన వెంటనే "ప్రీ సెన్సార్‌షిప్ – ముందస్తు ఆంక్షలు' ప్రారంభమయ్యాయి. ఆ అర్ధరాత్రి సమయంలో పత్రికల ముద్రణాలయాలపై దాడులు జరిపి అప్పటికే అచ్చయిన పత్రికలను స్వాధీనం చేసుకున్నారు. అనేక పత్రికా కార్యాలయాలకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ప్రభుత్వ చర్యలకు నిరసనగా అత్యధిక శాతం పత్రికలు సంపాద కీయం కాలమ్ నిలిపివేశాయి. పాఠకులకు ఆ కాలమ్ స్థలంలో తెల్లకాగితం దర్శనమిచ్చింది. ప్రభుత్వం ముందు పత్రికలన్నీ మోకరిల్లాయి.

ఢిల్లీ నుండి వెలువడే పత్రికలు దేశంలో ఎమర్జెన్సీ విధించినట్లు ప్రచురించిన ప్పటికీ జాతీయ నాయకులను నిర్బంధించినట్లు ఎక్కడా పేర్కొన లేదు. అయితే ఉమ్మడి రాష్ట్రంలోని 'ఈనాడు' దినపత్రిక మాత్రం ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేసినట్లు లోపలి పేజీలో చిన్నగా ప్రచురించింది. ఆ పత్రిక వారం రోజుల పాటు సంపాదకీయం రాయకుండా ఖాళీగా వదిలేసింది. జూలై 4వ తేదీన 'పౌండ్ విలువ పతనం' అంటూ విదేశీ అంశంపై సంపాదకీయం రాసింది. 'ఆంధ్రప్రభ' జూన్ 27న, 'ఆంధ్రపత్రిక' 28,29 తేదీలలో సంపాదకీయాలు ప్రచురించలేదు. క్రమక్రమంగా పత్రికలపై ఆంక్షలు పెరగడం, ప్రభుత్వ అనుకూల వైఖరి అనుసరించని వాటికి ప్రకటనలు నిలిపివేయడం వంటి చర్యలు చేపట్టారు. అయితే రామనాథ్ గోయంకా నిర్వహించే 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' ఆంగ్ల దినపత్రిక మాత్రం తన అస్తిత్వం కోసం కడదాకా పోరాటం కొనసాగించింది. ఇందిర ప్రభుత్వం 20 సూత్రాల కార్యక్రమం ప్రకటించాక దానిని పొగుడుతూ పత్రికలు విశ్లేషణాత్మక కథనాలు ప్రచురించాయి. కానీ, దేశంలో జరుగుతున్న సత్యాగ్రహాలు, పోలీసుల నిర్బంధం, అరెస్టులు తదితర వార్తలు ఏవీ ప్రచురణకు నోచుకోలేదు.

**అజ్ఞాత సాహిత్యం- రహస్య పత్రికలు**

ఈ నేపథ్యంలో అజ్ఞాత ఉద్యమంలో భాగంగా నాటి ప్రభుత్వ దమనకాండను ఖండిస్తూ కరపత్రాలు, చిన్నచిన్న పుస్తకాలు, రహస్య, వార, పక్ష పత్రికలు వెలువడ్డాయి. గోడ పత్రాలు (వాల్‌పోస్టర్లు), కరపత్రాలు ముద్రించేవారు. ఈ రహస్య సమాచారం కార్యకర్తల ద్వారా రహస్యంగా ప్రజలలో వితరణ జరిగింది. ఎమర్జెన్సీ విధించిన తొలి పది రోజులలోనే కరపత్రాలు ముద్రించే వ్యవస్థ ఉమ్మడి రాష్ట్రంతో



సహా దేశ వ్యాప్తంగా ప్రారంభమైంది. ఎక్కడో ఎవరికీ తెలియని రహస్య స్థావరాలలో (సాధారణంగా విద్యార్థుల గదులలో) సైకిల్ స్టైల్ మిషన్ ద్వారా కరపత్రాలు తయారయ్యేవి. "కరపత్రంలోని సమాచారాన్ని ఎవరు అందించారు? ఎవరు సైకిల్‌స్టైలు చేశారు? ఎవరు కాపీలు తీశారు?" అంతా చిదంబర రహస్యమే. పోలీసులు ఎవరిని ప్రశ్నించినా తమకు తెలియదని సమాధానమే వచ్చింది.

నెమ్మది నెమ్మదిగా ప్రింటింగ్ ప్రెస్‌లను సంప్రదించి కరపత్రాలు ముద్రించటం ప్రారంభమైంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 'వందేమాతరం', 'ఎక్స్‌రే' స్వరాజ్య, గర్జనఅజ్ఞాత పక్ష పత్రికలు ప్రారంభమయ్యాయి. రహస్యంగా ఉత్తర ప్రత్యుత్తరాల వ్యవస్థ ఏర్పాటు కావడంతో దేశ వ్యాప్తంగా జరుగుతున్న లోక్‌సంగర్ష సమితి కార్యకలాపాలు, సత్యాగ్రహాలు, పోలీసుల దమనకాండ వంటి వార్తల సమాచారం సంబంధిత కార్యకర్తలకు అందేవి. వారు వీటిని తెలుగులోకి అనువదించి 'వందేమాతరం' 'ఎక్స్‌రే' పత్రికలలో ప్రచురించేవారు. ఈ రెండు పత్రికలు ఎమర్జెన్సీ తొలగించేవరకు కొనసాగాయి. సామాన్య కార్యకర్తలు వాటిని వితరణ చేసేవారు. ఎక్కడా సమాచారం 'లీక్' కాకుండా అత్యంత జాగరూకతతో ఈ వ్యవస్థ నడిచింది. ఈ అజ్ఞాత సాహిత్య ముద్రణ, వితరణ ఏ విధంగా జరుగు తున్నదో తెలియక సీఐడీ పోలీసులు తలలు పట్టుకునే వారు. కిశోర్, బాల స్వయంసేవకులు వార్తాహరులుగా పనిచేసేవారు. మన పొరుగున వున్న తమిళనాడులో అప్పుడు ఎం.కరుణానిధి నేతృత్వం లోని డీఎంకే అధికారంలో ఉంది. అందుచేత మద్రాసులోని తెలుగు ప్రెస్‌లలో సాహిత్యం, చిన్న చిన్న పుస్తకాల ముద్రణ జరిగేది. ఆ సాహిత్యం తెలుగు రాష్ట్రంలోకి రహస్యంగా ప్రవేశించేది.

**అజ్ఞాత ఉద్యమంలో కీలక అంశాలు**

- రహస్య సంఘటనోద్యమం నిర్మాణం, నిర్వహణ
- దేశమంతటా సంపర్కం నెలకొల్పటం, మెరుపు వేగంతో వార్తలు, సూచనలు పంపటానికి మారు పేర్లు, రహస్య చిరునామాలు, ఫోన్ నెంబర్లు సేకరణ, వార్తాహరుల ఎంపిక.
- ప్రచార విభాగంలో భాగంగా కరపత్రాలు, సాహిత్యం సృష్టించడం, అజ్ఞాత పత్రికల ప్రచురణ, సైక్లోస్టైల్, టైపింగ్, ప్రింటింగ్ ద్వారా సాహిత్య నిర్మాణం.
- అజ్ఞాత సమావేశాలు ఏర్పాటు, నిధుల సమీకరణ వగైరా.

**కీలకమైన కార్యక్రమాలలో కరపత్రాల వితరణ**

1975 ఆగష్టు 15వ తేదీన 'స్వాతంత్ర్యానికి సంకెళ్లు' శీర్షికతో రెండు పేజీల కరపత్రం అచ్చు అయి రాయలసీమలోని అన్ని ముఖ్య కేంద్రాలకు చేరింది. ఆయా స్థలాలలో జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం కార్యకర్తలు ఈ కరపత్రాలు పంపిణీ చేశారు. పోలీసులు విస్మయం చెందారు. కార్యాలయాలకు సిబ్బంది వచ్చేసరికి వారి టేబుళ్లపై రహస్య కరపత్రాలు ఉండేవి. ఒక్కొక్కసారి దినపత్రికల్లో కనిపించేవి. కొద్దిమంది భయపడి వాటిని చింపివేసినా అత్యధికులు వాటిని చదివి రహస్యంగా ఇతర మిత్రులకు వివరించేరు. కళాశాలల్లో, గ్రంథ లయాలలో, సంతలలో ప్రజలు సందడిగా తిరిగే అన్ని ప్రాంతాలలో కరపత్రాల వితరణ జరిగేది. కొన్ని సందర్భాలలో విదేశీ ప్రతినిధులు హాజరైన అంతర్జాతీయ సదస్సులలో కూడా ఎమర్జెన్సీని వ్యతిరేకిస్తూ సాహిత్యం పంపిణీ చేసేవారు. 1976 జనవరిలో విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యా లయంలో సైన్స్ కాంగ్రెస్ ప్రతినిధుల సభ జరిగింది. వారు వసతి చేసిన గదుల్లో రహస్య సమాచారంతో కూడిన కవర్లు దర్శనమిచ్చాయి. అంతా రహస్యంగానే వాటిని చదివి దేశంలోని పరిస్థితిని అర్థం చేసుకున్నారు.

అజ్ఞాత సాహిత్యం ద్వారా దేశ ప్రజలలో చైతన్యం వచ్చింది. సమయం వచ్చినప్పుడు ప్రజలు ధర్మాన్ని గెలిపించటానికి 'ఓటు' అనే అత్యంత శక్తిమంతమైన ఆయుధం ప్రయోగించారు. ఫలితంగా 1977 మార్చిలో జరిగిన ఎన్నికల్లో జనతాపార్టీ విజయం సాధించింది. కాంగ్రెస్ ఘోరంగా ఓడిపోయింది. ఇది ప్రజలు సాధించిన ఘన విజయం.



**వేదుల నరసింహం**
సీనియర్ జర్నలిస్ట్




# శాఖను మరిపించిన విశాఖ

**అర్ధరాత్రి స్వతంత్రం అంధకార బంధురం అంటూ బ్రిటిష్ ప్రభుత్వం నుంచి వచ్చిన స్వాతంత్ర్యాన్ని ఎద్దేవా చేసిన శ్రీశ్రీ, ఆ అర్ధరాత్రి స్వాతంత్ర్యాన్ని కూడా 1975లో అర్ధరాత్రే హరిస్తే జేజేలు పలికాడు. ఇదొక వైచిత్రి, భారతదేశ చరిత్రలో అత్యంత వివాదస్పదమైన కాలమది, ప్రజల కనీస హక్కులను కాలరాస్తూ నాటి ప్రధాని ఇందిరా గాంధీ ఎమర్జెన్సీని విధించారు. 1977 మార్చి ఎన్నికలలో ఆమె ఘోరపరాజయాన్ని చవిచూశారు. ప్రజా స్వామ్య పునరుద్ధరణ జరిగింది. ఈ రెండు పరిణామాల మధ్య భారత్ ఒక కొత్త చరిత్రను నమోదు చేసుకుంది.**

ఆ కాలంలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తారేమోననే అనుమానంతో అనేక సంస్థలను నిషేధించారు. దానిలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఒకటి. రాత్రికి రాత్రి ఆ సంస్థకు సంబంధించిన కార్యాలయాలకు సీలు వేశారు. దొరికిన సభ్యులందరినీ అరెస్టు చేసి జైళ్లకు పంపారు.

నేను ఆనాడు ఆంధ్ర విశ్వకళాపరిషత్‌లో ఒక సాధారణ విద్యార్థిని. యూనివర్సిటీ హాస్టల్‌లో ఉన్నాను. అప్పుడు నేను ఆర్ఎస్ఎస్‌లో పనిచేసేవాడిని. కారణం వీర్రాజు (నందమూరు). వారి అబ్బాయే డాక్టర్ కేశవరావు. విశాఖలో వివేకానంద మెడికల్ ట్రస్టులో 35 సంవత్సరాలు సేవ చేశారు. విశాఖకు కొత్తవాడిని కావడంతో నన్ను 'మెసెంజర్'గా నియమించారు. అత్యయిక పరిస్థితికి వ్యతిరేకంగా ప్రచురించిన కరపత్రాలను సభ్యుల ఇళ్లకు చేర్చడం నా పని.

ప్రచారక్ భాగయ్య అధ్యక్షతన రహస్య సమావేశాలు జరిగేవి. చాలా స్ఫూర్తిదాయకంగా ఉండేవి. కొంతకాలం అయ్యాక మీరు సత్యాగ్రహం చేయాలి అని బాంబుపేల్చారు. జైలులో ఉన్న మన సభ్యులను కాపాడుకోవాలి. వారి కుటుంబాలకు భరోసా ఇవ్వాలి అన్నారు. డిసెంబరు 1, 1975న, సత్యాగ్రహాలు ప్రారంభమవుతాయయని చూచాయగా చెప్పారు. వాస్తవం కూడా చెప్పారు. సత్యాగ్రహం చేస్తే పోలీస్ వారు కొడతారు, అరెస్ట్ చేస్తారు, జైలులో పెడతారు, చదువులు పాడవుతాయి అని. బృందాల వారీగా సత్యాగ్రహం చేయాలి అని చెప్పారు. మొదటి బృందం నాటి ఎం.ఎల్.సి. పీవీ చలపతిరావు భార్య శ్రీమతి రాధ నాయకత్వంలో సత్యాగ్రహం చేసింది. ఆవిడ చిన్న పిల్లాడిని చంకన వేసుకొని సత్యాగ్రహం చేశారు. ఆ చంటివాడే 'మాధవ్' (విశాఖ గ్రాడ్యుయేట్స్ కాన్స్టిట్యూయన్సీ మాజీ ఎం.ఎల్.సి.). మా వంతు వచ్చింది. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చదువుతున్న 8 మంది విద్యార్థులు ఒక బృందంగా సత్యాగ్రహం చేయాలి. ఉదయమే బాగా టిఫిన్ చేసి సత్యాగ్రహం చేసాం. అరెస్ట్ చేసి విశాఖ 2వ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. కొట్టలేదు. మంచి భోజనం పెట్టారు. వారి లాంఛనాలు పూర్తి చేసుకొని మమ్మల్ని డిఫెన్స్ ఇండియా రూల్స్ (డి.ఐ.ఆర్.) నిబంధన కింద విశాఖపట్నం సెంట్రల్ జైలుకు పంపారు.

డిసెంబరు 12, 1975న కేసు వాయిదాకు వచ్చింది. ఫస్ట్ ఇన్ఫర్మేషన్ రిపోర్టు (ఎఫ్.ఐ.ఆర్.) అర్జెంట్‌గా ఫైల్ చేయండి. వాళ్ల చదువులు పాడవుతాయి అని పోలీస్ వారికి న్యాయమూర్తి గట్టిగా హెచ్చరించి. 23కు వాయిదా వేశారు. ఆ వాయిదాకు ఎఫ్.ఐ.ఆర్ తయారు చేయలేదు. వెంటనే జడ్జిగారు పూచీకత్తుపై మమ్మల్ని విడుదల చేశారు. ఇక మా జైలు అనుభం.

1)నేర నిరూపణ అయిన ఖైదీలు 2) రిమాండ్ ఖైదీలు (నేరం చేశారన్న అభియోగంతో అరెస్టు చేసిన ఖైదీలు). నేర నిరూపణ అయిన ఖైదీలకు జైలు దుస్తులు ఇస్తారు. ఖైదీలందరికి ఒక గొంగళి, ఒక కంచం, ఒక మగ్గు (జర్మన్ సిల్వర్), రెండు మట్టి కుండలు ఇస్తారు (రాత్రులు మల మూత్ర విసర్జనకు). జైలును వార్డులుగా విభజిస్తారు. ప్రతీ వార్డులో 35 నుండి 40 సెల్స్ (గదులు) ఉంటాయి. ప్రతీ సెల్ లోను ముగ్గురు ఖైదీలు అంతకన్నా ఎక్కువ ఉంటారు. పగలు ఆ వార్డులో తిరగవచ్చును. రాత్రి 8 గం॥లకు సెల్స్ లోపల పెట్టి లాక్ చేస్తారు. ఉదయం 6 గం॥లకు తెరుస్తారు. 6.40 ని॥ టీ. రాత్రి వాడిన మలమూత్ర కుండలను లేవగానే శుభ్రం చేసుకోవాలి. అండమాన్ (పోర్ట్‌బ్లెయిర్ సెల్యూలర్ జైలు (కాలా పానీ)లో తప్ప తక్కిన జైళ్లలోని సెల్స్, ఫరవాలేదు, విశాలంగా ఉంటాయి.

ఉదయం 8 గం॥లకు టిఫిన్, కప్పుతో కొలిచి. మధ్యాహ్నం సరిగ్గా ఒంటి గంటకు భోజనం, షరా మామూలే, కప్పుతో కొలిచి. ఒక కూర, పులుసు. వారానికి ఒకసారి మాంసాహారం. రాత్రి భోజనం 6.30 ని॥ల నుండి 7.30 ని॥ల లోపల పూర్తిచేసి తీరాలి, 8వ గంటకు సెల్‌ను లాక్ చేస్తారు కాబట్టి. ఉదయం సెల్ తీయగానే తలలు లెక్క పెడతారు. సాయంత్రం లాక్ చేయక ముందు తలలు లెక్క పెడతారు. కచ్చితంగా సరిపోవాలి. దాన్ని జైల్లోనే హెడ్ ఆఫీసర్‌కు నివేదిస్తారు.

1977లో 'అఖిల భారత సైన్స్ కాంగ్రెసు'కు విశాఖపట్నం ఆతిథ్యం ఇచ్చింది. ప్రధాని ఇందిరా గాంధీ ప్రారంభించబోతున్నారు. అది సుమారు డిసెంబర్ నెలాఖరు. కాబట్టి మా ఎనిమిది మందిలో ఏడుగురిని కోర్టు గోడలు బయటకు రాగానే పోలీసులు నిర్భంధించి మెయింటినెన్స్ ఆఫ్ ఇంటర్నల్ సెక్యూరిటీ యాక్టు క్రింద అరెస్ట్ చేశారు. మమ్మల్ని 'మీసా డిటెన్యూస్' అని పిలిచేవారు. ఇలా నిర్భంధించిన మమ్మల్ని కోర్టుకు తీసుకు వెళ్లాల్సిన అవసరం లేదు కాబట్టి, ఆ విధంగా 21 మాసాలు మేము ఏడుగురం జైలులోనే మగ్గాం. ఇది రాజకీయ ఖైదు కాబట్టి మంచి ఆహారం, మంచి వసతి, సకల సదుపాయాలు కలుగజేశారు.

జైలులో ఉన్న ప్రముఖుల్లో డా॥ చిలుకూరి సుబ్రహ్మణ్యశాస్త్రి, ప్రొ॥ దుగ్గిరాల విశ్వేశ్వరం, డా॥డి. శివప్రసాద్ , ప్రొ॥ సుందర రామయ్య, డా॥ కూరెళ్ల సంతోష్. వీరంతా ఆంధ్ర విశ్వకళాపరిషత్‌లో ఆచార్యులే. పిల్లా రామారావు, కె.బాబూరావ్ ప్రసాద్ (ఈ ఇద్దరు బీవీకే కళాశాల ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్). ఇంకా బీవీకే నుంచే తూరంగి సోమలింగం (హిస్టరీ లెక్చరర్), గొర్తి ప్రభాకర శర్మ (తెలుగు లెక్చరర్), దువ్వూరి సత్య నారాయణమూర్తి(బీవీకే స్టాఫ్) కూడా ఇక్కడే ఉన్నారు.

రాజకీయ నాయకుల్లో తెన్నేటి విశ్వనాథం, రాష్ట్ర మాజీమంత్రి సర్దార్ గౌతు లచ్చన్న, ముప్పవరపు వెంకయ్యానాయుడు, కంభంపాటి హరిబాబు, ఎన్.ఎస్.ఎన్.రెడ్డి, రౌతు ఆదినారాయణ, దాసరి నరసింగరావు, బాండాడ రాధాకృష్ణ, వెంకటరమణ, కె.ఎస్.ఎ.ఎన్.రాజు కూడా జైలుకు ఎమర్జెన్సీ కారణంగా వచ్చారు. ఆంధ్రాయూనివర్సిటీ విద్యార్థుల్లో సత్యారావు (మాస్టారు), కొల్లా దశపతిరావు, క్రాలేటి శంకర్రావు, గుంటూరు వెంకటేశ్వరరావు నేతి క్షీర సాగర్, శ్రీరాములు, శివానందకుమార్, జగ్గరాజు, భవానీశంకర్ (చిన్న వయస్కుడు), జగదీష్, గోవిందరావు, డా॥ వద్ది విజయసారథి, డా॥ వేదుల సత్యనారాయణమూర్తి, డా॥ అయ్యగారి వెంకటేశ్వర రావు, బలరామిరెడ్డి (యూనివర్సిటీ ప్రెసిడెంట్)



ANDHRA PRABHA, VIJAYAWADA
THE LARGEST CIRCULATED TELUGU DAILY
REGD. No. H/VJ 36
ఆంధ్రప్రభ
ఎడిటర్: పండితారాధ్యుల నాగేశ్వరరావు
5-7-1976
ఆర్. ఎస్. ఎస్, ఆనంద్‌మార్గలతోసహా 26 సంస్థల నిషేధం
దేశరక్షణ, ఆంతరంగిక భద్రతా నిబంధనలక్రింద కొన్ని నక్సలైట్ వర్గాలు, జమాత్ ఇస్లామీ పైకూడా చర్య
అత్యయిక పరిస్థితి విధించినా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకేమీ భంగంలేదు: ప్రధాని విస్పష్టప్రకటన

సింహాద్రిరావు, ఏలూరి సత్యనారాయణ మూర్తి, ఇలా చాలా మందిని విశాఖపట్నంలో నిర్భంధించారు.

ఎంతైనా జైలు చదువుకోవడానికి మంచి ప్రదేశం. ఇక్కడి నుండే పరీక్షలు రాసి ఎర్రంశెట్టి సత్యారావు, శ్రీ కొల్లా దశపతిరావులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. రోజూ వ్యాయామం, మధ్య మధ్య పోటీలు, విజేతలకు బహుమతి ప్రదానానికి జైలు సూపరింటెండెంట్ కపాడియాను ఆహ్వానించడం ఇవన్నీ జరిగేవి. బయటి విషయాలు, మా విడుదల

# జైలు జీవితం

కోసం జరిగే పోరాటాలు, ఉద్యమాలు ఎప్పటికప్పుడు లోపలికి చేరవేసే ఏర్పాటు కూడా ఉండేది. ప్రభాకర శర్మ ఆ ఏర్పాటు చూసేవారు. ఖైదీలను చూడటానికి వచ్చేవారి జాబితాను ఖైదీలు ఇవ్వాలి. ఆ జాబితా లోని వారిని మాత్రమే ఖైదీని చూడటానికి అంగీకరిస్తారు. సీలు వేసిన తినుబండారాలను లోపలికి అనుమతిస్తారు. సీలు వేయని తినుబండారాలను వారు తిని చూసి, అప్పుడు అనుమతించేవారు.

మొదటి రోజు 'చామ దుంపల వేపుడు-చారు' వడ్డించారు. చాలా రుచిగా ఉన్నాయి. సుమారుగా ప్రభుత్వ ఖర్చులతో నిర్వహించే ఆర్‌ఎస్‌ఎస్ క్యాంప్‌లా ఉండేది. ఎవరికైనా అనారోగ్యంగా ఉంటే నలుగురు గన్‌మెన్‌లు వాహనం తీసుకుని డైరెక్టుగా విశాఖలోని కె.జి.హెచ్. ఆసుపత్రికి తీసుకువెళ్లి వెయిటింగ్ లేకుండా వైద్యం చేయించి తీసుకువచ్చేవారు. జైలులో పిల్లా రామారావు, సుబ్రహ్మణ్య శాస్త్రి, ఆర్‌ఎస్‌ఎస్ కార్యవాహ ఎస్.టి.జి.కృష్ణమాచారి (ఆర్‌ఎస్‌ఎస్ విద్యాశాఖల కార్యదర్శి), మంచి భోజనం పెట్టటంలో ఆయనే సాటి. క్యాంపులలో ఆయనే భోజన వసతి చూసేవారు). తెన్నేటి విశ్వనాథం స్వాతంత్ర్య సమర యోధుడు, విశాఖ ఉక్కు నిర్మాత, మాజీ మంత్రి. ఎన్.ఎస్.ఎన్.రెడ్డి, విశాఖ మేయర్‌గా చేశారు. కంభంపాటి హరిబాబు ప్రస్తుతం ఒరిస్సా గవర్నర్‌గా పనిచేస్తున్నారు. ముప్పవరపు వెంకయ్యనాయుడు భారత మాజీ ఉపరాష్ట్రపతి. వీరంతా మాకు ఆహ్వానం చెప్పడానికి జైలు గేటు దగ్గరకు వచ్చారు. హరిబాబు హార్మోనియం బాగా వాయించేవారు. వారు తలో వాయిద్యం చేతబట్టుకొని మాకు ఆహ్వానం పలికారు. అందరిలో పిన్న వయస్కుడిని నేను. అందుకే అందరూ నన్ను గారాబంగా చూసేవారు. అయితే కొద్దిరోజులకే కర్రా భవానీ శంకర్ (18 ఏళ్లు) అరెస్టయి జైలుకు రావడంతో నా హోదా పోయింది. ఆయనను మేమంతా గారాబం చేసేవాళ్లం.

కృష్ణాష్టమి సందర్భంగా వివిధ పోటీలు నిర్వహించారు. దానిలో ఒకటి ఈటింగ్ కాంపిటేషన్. రెండు నిమిషాల్లో ఎవరు ఎక్కువ ఇడ్లీలు తింటారు. దానిలో ప్రొ॥ దుగ్గిరాల విశ్వేశ్వరం ప్రథమ, కాశింశెట్టి సత్యనారాయణ ద్వితీయ బహుమతులు పొందారు. సూర్య నమస్కారాల పోటీలో కొల్లా దశపతిరావు, కాశింశెట్టి సత్యనారాయణ మిగిలారు. వీరికి బహుమతులు వచ్చాయి. పండగకి స్పెషల్ స్వీట్ "అరిసెలు" వండించారు. వీరంతా ఆర్‌ఎస్‌ఎస్ వారు కావడం వల్ల రోజూ ఓ షెడ్యూలు ఉండేది. ఉదయం టిఫిన్లు అయ్యాక వ్యాయామం, సంఘ శాఖ, స్నానాలు, పారాయణం (భగవద్గీత) మధ్యాహ్న భోజనానికి ముందు ఓ గంట విరామం. భోజనానంతరం ఓ గంట తరువాత ఉపన్యాసాలు. వారానికి ఒకసారి ఉపన్యాస పోటీలు. దీనిలో ఎప్పుడు డా॥ వడ్డి విజయసారథికే బహుమతి. సాయంత్రం నాలుగు నుండి ఆరు వరకు ఆటలు, తరువాత స్నానం, భోజనం, 8 గం॥లకు లాకప్, ఇక్కడ విడివిడిగా వీరిని సెల్స్‌లో పెట్టరు. సెల్లారు లాంటి హాల్సు, ఒక్కోదానిలో 10 నుండి 12 మంది వరకు ఉంచేవారు. దీనికి ఎటాచ్డ్ టాయ్‌లెట్స్ ఉండేవి.

బట్టల సబ్బు, సీకాయి సబ్బు, బ్రష్, టూత్‌పేస్ట్, టంగ్‌క్లీనరు, రోజు లైబ్రరీ నుండి పుస్తకాలు తెచ్చి ఇస్తారు. (ఎలవెన్స్‌లు ఇచ్చేవారు. దాన్ని నుండి కొన్న భగవద్గీత నేటికి ఉన్నది. 12.09.1976 నాడు కొన్నది). పెన్ను పేపర్లు కూడా సరఫరా చేస్తారు. లోపల దుకాణం ఉంది. బయట నుండి ఆర్టిస్టులు వచ్చి ఎంటర్‌టైన్‌మెంటు ప్రోగ్రాం ఇస్తారు (నెలకు ఓసారి). మాకు కాలం తెలిసేది కాదు, ఏనాడు ఎవరిలోను అది జైలు, మేము ఖైదీలమన్న భావనే లేదు, జీవితం నాశనమైపోతుందన్న భయం లేదు.

జైలులో ఒకే వార్డులో (రైటిస్టులు, లెఫ్టిస్టులు) రాజకీయ ఖైదీలు అందరూ ఉండేవారు. జైలు సూపరింటెండెంట్ కపాడియా మంచి కృష్ణభక్తుడు, గుజరాతీ. ప్రతివారం తప్పనిసరిగా రౌండ్స్‌కు వచ్చేవారు. సమస్యలు తెలుసుకొని పరిష్కరించేవారు. మా పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టి గౌరవంగా పలకరించే వారు. సుబ్రహ్మణ్యశాస్త్రి మా నాయకుడు, ఆయనే మాట్లాడేవారు. మిగిలిన వారంతా ఆర్‌ఎస్‌ఎస్ క్రమశిక్షణతో నిలబడేవారం. సుబ్రహ్మణ్యశాస్త్రి కపాడియాను జేబుతో వేసుకున్నాడు అంటూ లెఫ్టిస్టులు కొందరు మాటలు తూలుతూ ఉండేవారు అయినా సహించేవారు. లెఫ్టిస్టులు రాచకొండ విశ్వనాథశాస్త్రి, చలసాని ప్రసాద్ మరో 10 మంది వరకు ఉండేవారు. జైలులో కృష్ణాష్టమి వేడుకలు చేసి కపాడియాను ఆహ్వానించాం. ఆయనే ప్రసాదం తీసుకువచ్చి అందరికి పంచారు. లెఫ్టిస్టులు పచ్చి బూతులు తిట్టారు. అన్నీ 'ల' కారాలతోనే. తరువాత కపాడియా ఇంట్లో వాళ్లను కూడా, ఇక్కడ రాయడానికి వీల్లేని తిట్లు తిట్టారు.

కపాడియా ఎక్కువ కాలం తెలుగు ప్రాంతంలో పనిచేయడం వల్ల తెలుగు బాగానే వచ్చు. వీళ్లకు ఆయన ఇచ్చిన సమాధానం సినిమా హీరో డైలాగులా పేలింది. 'మీరు జైలులో ఉన్నారు. మావాళ్లు జైలు ఆవల ఉన్నారు. అది మీకెలా సాధ్యం? ఏది సాధ్యమంటే, నేను జైలు బయట ఉన్నాను, పచ్చి బూతులు తిడుతున్న మీ కుటుంబసభ్యులు జైలు బయటనే ఉన్నారు. కాబట్టి నీవు చెప్పిన మాట నాకు సాధ్యమవుతుంది' అన్నారు. ఆయనకు వచ్చీరాని తెలుగులో సమయ స్ఫూర్తిగా చురకవేయ గలిగారు. వాళ్ల కార్యక్రమానికి వచ్చాను. మీరు చేస్తే మీ కార్యక్రమానికి వస్తాను అని సర్ది చెప్పారు. అంతేకాని తిట్టకండి అని హెచ్చరించారు. తరువాత రైటిస్ట్‌లను అక్కడే ఉంచి లెఫ్టిస్ట్‌లను వేరే వార్డుకు మార్చారు. మమ్మల్ని 1977 మార్చి తరువాత విడుదల చేశారు. స్వేచ్ఛాజీవుల మయ్యాం, అదే ప్రజాస్వామ్యం. ఆనాడు తెలియలేదు, నేను ఇంత గొప్పవాళ్ల మధ్య జైల్లో గడిపానని.. ఏభై ఏళ్లు కాలగర్భంలో కలిసిపోయాయంటే ఆశ్చర్యంగా ఉంది. కానీ దేశంలోని అన్ని జైళ్లు ఇలా లేవు. అదొక విషాద చరిత్ర.



**డా. కాశింశెట్టి సత్యనారాయణ**

విశ్రాంత ఆచార్యుడు



# 'సమర్పణ'భావం

ప్రతి ఆషాఢ పౌర్ణమిరోజున గురుపూజ చేసుకునే ఆచారం అనాదిగా మన సమాజంలో నెలకొని ఉంది.

***గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః***
***గురుసాక్షాత్ పరబ్రహ్మ తస్మైశ్రీ గురవే నమః***

త్రిమూర్త్యాత్మక స్వరూపం గురువు. అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానమును అందించేవారు గురువులు. అజ్ఞానం అంటే చదువులేకపోవడం, నిరక్షరాస్యత కాదు. ధర్మనిరతి, కర్తవ్యదీక్ష లేకపోవడం. ధర్మబద్ధమైన జీవనానికి ప్రేరణ ఇవ్వలేని, లేదా అవరోధాలు కల్పించే వాసనలు, భావనలు, కోరికలు వంటివి అజ్ఞానము. హిందూధర్మం అంటేనే మహోన్నత విలువలతో కూడిన జీవన విధానం. మన గురువులు అటువంటి విలువలను అనుష్ఠించారు, తమ శిష్యులతో అనుష్ఠింప చేశారు. మన మహర్షులందరు ఆ విలువలను పాటించినవారే. సాధించిన వారే. సత్యకామ, జాబాలి, శంఖ లిఖితులు, ధౌమ్యుడు మొదలగు తపోధనుల జీవితాలలో ఈ అనుష్ఠానము కనపడుతుంది. అందువల్లనే ఈ దేశ జీవనంలో ఈ విలువలన్ని కొనసాగుతూ వచ్చినాయి.



సత్యం, అహింస, అపరిగ్రహం, ఆస్తేయం, ఇంద్రియ నిగ్రహం, శమదమాదులు వాటిలో కొన్ని. జీవనసమరంలో సతమతమవుతున్న నేటి తరాలకు పరంపరాగతమైన విలువల అనుష్ఠానంలో అనేక అవరోధాలు, ఆటంకాలు ఏర్పడవచ్చు. మన మార్గం నుంచి పక్కకు మళ్లించే ఆకర్షణలు, ప్రలోభాలు తారసపడవచ్చు. వీటి నుంచి మనలను మనం సంరక్షించుకుంటు, సాగటానికి గురువుల మార్గ దర్శనము అత్యంత ఆవశ్యకము.

**గురువు వేదవ్యాసులు**

లక్షల సంవత్సరాలుగా సాగుతూ వస్తున్న సమాజం కాలానుగుణంగా అనేక మంది గురువులను స్వీకరించింది.వారిలో వేదవ్యాసులను అగ్రగామిగా పరిగణించింది. కనుకనే వ్యాసపూర్ణిమ గురుపూర్ణిమ అయింది. ఎందుకు మన సమాజం వేదవ్యాసుల వారిని గురువుగా స్వీకరించింది?అని ప్రశ్న ఎదురైన వారిని ఉద్దేశించి, హరిద్వార్‌లోని ఒక ప్రముఖ స్వామీజీ ఒకానొక సందర్భంలో వేదవ్యాసులవారి గురించి ఇలా వివరించారు. వేదవ్యాసుల వారి వద్ద ఐదువేల మంది పూర్తి కార్యకర్తలు ఉండేవారట. అందులో సగం మంది ఆయన రచనలను గ్రంథస్థం

వ్యాసపూజా మహోత్సవం ఈ యేడు కొత్త శోభనందుకొన్నది. హిందూ విశ్వము నేకత్రిక మొనర్చ కృషి చేస్తున్న విశ్వహిందూ పరిషత్ సమస్త హిందూ జాతి సమైక్యమై సామాజికంగా ఆచరించదగిన మహోత్సవాలలో వ్యాసపూజ (ఆషాఢ పూర్ణిమ) నొకదానినిగా ప్రకటించింది.

వ్యాసపూజ ఈ జాతికి కొత్తదికాదు. ఇంటింటా, వ్యాసపూజగనో, గురుపూజగనో, గురుపూర్ణిమగనో (ఆషాఢ పూర్ణిమ) జరుగుతునే ఉంది. ఆరోజు ఆ ఇంటి గురువర్యులను పూజించడం, సత్కరించుట, లేదా ఎవరేని ఒక సాధుపుంగవునికి, సన్యాసికి ఆతిథ్యమివ్వడం ఉండేది. మఠాలు, పీఠాలలో విధిగా, విశేషంగా గురు పరంపరకు పూజ జరిగేది. నాడు సన్యాసులు పీఠాధిపతుల ఆధ్వర్యంలో చాతుర్మాస్య దీక్షలు ప్రారంభమయ్యేవి. అయితే అవి ఎక్కువ భాగం మఠాలకు, సన్యాసులకు పరిమితమై ఉండేవి. గృహస్థులు గురుపూర్ణిమను ఆచరించడం తగ్గసాగింది. చివరకు జాతిలో వ్యాసుడెవరో తెలియనివారు, ఆషాఢ పూర్ణిమ ప్రాముఖ్యం నెరుగనివారు ఉద్భవించనారంభించారు.

*గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః .....*
*.....తస్మై శ్రీ గురవే నమః..*

ఈ శ్లోక సారాంశమును అంగీకరించని హిందువర్గం ఉండదనడం అతిశయోక్తి కాదు. గురు సంస్మరణకు సంబంధించిన ఈ మహత్తర పర్వం యావత్ సమాజం నిర్వహించడం జాతీయ ఐక్యత సాధనలో ఒక ముఖ్యమైన అంశము.

ఈ జాతి విజ్ఞానానికి మూర్తిస్వరూపము వ్యాసుడు. అతడెవరు? ఏనాటి వాడు? అనే ప్రశ్నలకు ప్రాముఖ్యమేలేదు. ఒక్క వ్యాసుడు కాదు పలువురు వ్యాసులున్నారని కొందరనవచ్చు. వ్యాసశబ్దము ఒక వ్యక్తికి గాక ఒక పరంపరకు సంబంధించినదని మరికొందరు అనవచ్చు. అతడి వివిధ అవతారాలే వేర్వేరు వ్యాసులు అని మరికొందరు వ్యాఖ్యానించవచ్చు. వేద విభాగం వలన కలిగిన పేరే వ్యాసశబ్దము. 'వివ్యాస వేదాన్ యస్మాత్, వివ్యాస ఏకం వేదం చతుర్ధా' అని ఇంకొందరు వివరించవచ్చు.

## గురుపూజ

కాని వీటన్నిటి సారాంశముగా మిగిలేది మాత్రం అందరికి శిరోధార్యమైన విషయం. మన మెరుగని లోకాల నుంచి మహత్తర విజ్ఞాన సర్వస్వాన్ని ఒక్కనాడుగా గాక అనేకసార్లుగా మనకు అందించిన దివ్యశక్తి అది. అందువల్ల అతడు భగవానుడు, ధర్మ

# సర్వధర్మాత్మకం

చేస్తుంటే... మిగతా వారు గ్రామగ్రామాన వాటిని ప్రచారం చేసేవారట.

మహాభారత కాలం మనం ఊహించినంత సాఫీగా సాగి ఉండకపోవచ్చు. భోగలాలసత. రాజ్యగర్వం, ప్రజలను హతాశులను చేసింది. తానే చక్రవర్తిని కావాలని బలి ఇవ్వడానికి ఒకడు 16 వేల మంది రాజకన్యలను అపహరించి తెచ్చాడు. ఇంకొకడు అనుభవించటానికి, దాస్యం చేయించు కోవడానికి ఇంకొక 15వేలమంది కన్యలను తెచ్చాడు. జరాసంధుడిని భీముడు చంపితే నరకాసురుడిని కృష్ణుడు సంహరించాడు. కౌరవాదులు భోగలాలసత, ఈర్ష్యాసూయలకు ప్రతీకలు. సైంధవుడు, కీచకుడు...ఇలా అనేక మంది ఆర్ష, సనాతన ధర్మాలను అనేకవిధాల అస్తవ్యస్తం చేశారు. ప్రజలు భోగలాలసత పట్ల ఆసక్తులై దారి తప్పుబోతున్న సంధికాలం. అలాంటి విపత్కర పరిస్థితుల్లో ఆసేతు హిమాచల పర్యంతం విస్తరించిన సువిశాల భూభాగంలో ఈ సనాతన ధర్మ పునః ప్రతిష్ఠకు ఎంత కష్టపడి ఉంటారు? ఎన్ని రాజ్యాలు, ఎన్ని జనపదాలు, అడవులు, వనవాసులు, గిరిజనులు... ఇంత అవిచ్ఛిన్న పరంపరను స్థాపించటానికై ఆ మహానుభావులు పడిన శ్రమ సామాన్యమైనదని భావించ గలమా? అందుకే సమాజం వేదవ్యాసుల వారిని గురువుగా స్వీకరించింది.

**తత్వపూజ**

హిందుసంస్కృతి ఔన్నత్యం తత్వపూజలోనే ఉంది. వ్యాసపూర్ణిమ నాడు వ్యాసుల వారిని ఆరాధించి, విజ్ఞాన భాండాగారానికి ప్రతీక అయిన 'వ్యాస పీఠం'ను పూజిస్తారు. గురుగోవిందసింగ్ కూడా తన తరువాత గురుగ్రంథ సాహెబ్‌ను సిక్కులకు గురువుగా అనుగ్రహించాడు.' ప్రజ్ఞానం బ్రహ్మ' అంటే ఇదేనేమో?

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ నిర్మాత డాక్టర్జీ హిందూ సంస్కృతిలోని ఈ మౌలికతను అర్థం చేసుకొని, సంఘానికి కాషాయధ్వజాన్ని గురువుగా ఇచ్చారు. భారత జాతీయ ఆదర్శాలైన త్యాగం, సేవలకు ఈ ధ్వజం ప్రతీక. శ్రీరామచంద్రుడు ఎగురవేసినది ఈ ధ్వజాన్నే. ఇలాంటివి ఎన్నో ఉదాహరణలు మనకు తెలుసు.

కాషాయధ్వజాన్ని మనం భగవాధ్వజము అంటాము. అంటే భగవంతుని ధ్వజము అని అర్థం. కాషాయధ్వజం భగవాధ్వజంగా ఎందువల్ల? ఉదయించే సూర్యుని కాంతి కాషాయం. సూర్యుడు అంటే ప్రత్యక్ష దేవుడని కదా! అలాగే యజ్ఞజ్వాలల రంగు కాషాయం. ఈ యజ్ఞం గురించి గీతాచార్యుడు ఈ విధంగా పేర్కొంటాడు.

***అన్నాద్భవంతి భూతాని పర్జన్యాదన్న సంభవః***
***యజ్ఞాద్భవతి పర్జన్యో యజ్ఞకర్మ సముద్భవః***

భూతరాశులు అన్నం వలన బతుకుతాయి. అన్నం మేఘాల(వర్షం) వలన పుదుతుంది. మేఘాలు యజ్ఞం నుంచి ఉద్భవిస్తాయి. యజ్ఞం కర్మనుండి వస్తుంది. ఇక్కడ కర్మ అంటే ఏమిటో కూడా గీతాచార్యుడు వివరించాడు.

***కర్మబ్రహ్మోద్భవం విద్ధి-బ్రహ్మాక్షర సముద్భవమ్***
***తస్మాత్ సర్వగతం బ్రహ్మ-నిత్యం యజ్ఞే ప్రతిష్ఠితమ్॥***

కర్మ బ్రహ్మ నుంచి వేదం నుండి ఆవిర్భవించింది. వేదాలు నాశరహితుడైన పరమాత్మ నుంచి వచ్చాయి. యజ్ఞమే పరమేశ్వరుడు కనుక యజ్ఞకాంతులను వెదజల్లే కాషాయధ్వజం భగవాధ్వజమైంది. ఇక యజ్ఞకారకమైన వేదోక్తకర్మ అంటే ఏమిటి? ఈ కర్మను అనుసరిస్తే ఏమి వస్తుంది? అనే దానిని భగవద్గీత ఇలా చెబుతోంది.

***అభ్యాసే ప్యసమర్థోసి మత్కర్మపరమో భవ।***
***మదర్థమపి కర్మాణి కుర్వన్సిద్ధిమవాప్స్యసి ॥***

యోగాన్ని అభ్యాసం చేయలేకపోతే నాకిష్టమైన కర్మలను ఆచరించు. నా కోసం నీవు చేసే కర్మకు నీకు సిద్ధి లభిస్తుంది.

భగవంతునికి ఇష్టమైన కర్మ ఏమిటి? ధర్మ ప్రతిష్ఠాపనమే భగవంతునికి ప్రీతిపాత్రమైన కర్మ. సంస్కృతి సంరక్షణే వేదోక్తకర్మ. దేవదేవుడు శ్రీమన్నారాయణునికి దేశంలో దేవాలయాలు ఉన్నాయో లేవో తెలియదు కాని భక్తుల ఆర్తిని తీర్చటానికి ఆయన ఎత్తిన దివ్యావతరాలకు మాత్రం గ్రామగ్రామాన ఆలయాలు ఉన్నాయి.

మనం కళ్లు మూసుకొని జపం చేసుకుంటే చాలు.. అంతా పైవాడే చూసుకుంటాడు....అనే నిర్లిప్తతను గీతాచార్యుడు అంగీకరించలేదు.

***సక్తాః కర్మణ్యవిద్వాంసో యథా కుర్వంతి భారత***
***కుర్యాద్విద్వాంస్తథాసక్తః చికీర్షుర్లోకసంగ్రహమ్***

ఫలాపేక్ష కలిగినవారు ఎంతగా తపిస్తూ కర్మచేస్తారో, విద్వాంసులు, లోక సంఘటనం కావాలనుకునేవారు ఎలాంటి ప్రతిఫలాన్ని ఆశించ కుండా కష్టపడాలి. ఆర్ఎస్ఎస్ నిర్మాత డాక్టర్ కేశవరావు జీవితమే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. కర్మయోగులైన ఆయన శాస్త్రాలన్నీ అధ్యయనం చేసిన తరువాతనే మనకు భగవాధ్వజాన్ని గురువుగా ప్రబోధకుడు, సంస్థాపకుడు, భారతీయ విజ్ఞాన స్వరూపం సర్వస్వం. ఈ జాతికి అతడు గురువు. పరమగురువు. ఆయనకు పూజ గురుపూజ. ఆయన స్థానం గురుస్థానం. అంతేకాదు వివిధములైన పరంపరలతో శోభిల్లే ఈ జాతి ఏకత్వానికి ఆతడు ప్రతీక. దీనిని గుర్తించి, ఆయన చరణ కమలాలను స్మరిస్తూ, ఈ పర్వదినాన జాతి ఏకమై దానిని ఆరాధించడం మనకు ఐక్యతా సాధనమవడమే గాక మన సంస్కృతీ విజ్ఞాన వికాసానికి సాధనం.

గురి కలిగి శ్రద్ధతో ఆరాధించడంలో, అధ్యయనం చేయడంలో వికాసం, విద్యా విజ్ఞానాభివృద్ధులు ఉన్నాయి. ఇది గుర్తించినది భారతీయ గురుశిష్య పరంపర. గురుకులముల నిర్వహణ, విద్యాబోధన ఆ గుర్తింపుతోనే జరిగేది. గురువు, విద్య పట్ల భక్తి శ్రద్ధలతో వ్యవహరించడం ద్వారా విద్యార్థులు విద్యా, వినయ సంపన్నులయ్యేవారు. క్రమశిక్షణ సమస్య ఉత్పన్నమయ్యేదే కాదు. వారి జీవితమే ఒక క్రమశిక్షణగా ఉండేది. గురువులు కూడా అందుకు తగ్గట్లుగానే ఉండేవారు. కాలం మారినా వ్యవస్థలు మారినా మారనిది మానవ నైజము. మానవ మూల్యములు, అనుభవం, అనుభూతులు, భక్తి, శ్రద్ధ, వినయం, క్రమశిక్షణ, ప్రేమ, అభిమానం, బాధ్యత అనేవి కాలాలతో నిమిత్తం లేనివి. సరియైన సంప్రదాయ పోషణద్వారా సర్వకాల సర్వావస్థలందు నిలుపుకొనదగిన గుణగణాలివి. ఆధునిక విద్యాలయములలో సైతం సరస్వతీపూజ, గురుపూజలు నిర్వహించడం మానసికంగా విద్యార్థులనే గాక గురువులను సైతం ప్రభావితం చేయగల్గినట్టివి. వారి వారి విధులను గుర్తు చేసి వారికి మార్గదర్శనం చేయగలిగినట్టివి. వారు బోధించే విద్యా స్వరూపాన్ని గుర్తు చేసేవి. గురుపూజ, వ్యాసపూజ విద్యారంగానికే కాదు... విశాల జాతీయ రంగంలో ప్రాముఖ్యంగల పర్వం. ముస్లింపాలన, బ్రిటిష్‌పాలన, కాంగ్రెస్ పాలనలలో క్రమంగా ప్రాముఖ్యం తగ్గిన వాటిలో ఇదీ ఒకటి. అందువల్లనే విద్యాలయాలు దీనిని గుర్తించలేకపోతున్నాయి. పత్రికల ఊహకు దూరమైనది ఈ పర్వం. రేడియోలో ప్రస్తావనకైనా అర్హంకాని మహాపర్వమైంది ఇది. ఈ స్థితిగతులను దూరం చేసుకొని దివ్య విజ్ఞాన తేజోస్వరూపుడైన వ్యాసభగవానుని గుర్తించ గలగడం ఈ జాతికి అనేక దాస్యముల నుంచి విముక్తికి హేతువు. ఈ విషయమై ప్రజలలో సంస్థలలో ఆనందదాయక పరిణామాలు ప్రారంభమైనవి. ఇక పురోగమనానికై వ్యాసభగవానుని ఆశీస్సులను అర్థిద్దాం.

**– 17-07-1967, జాగృతి నుంచి**

ఇచ్చారు.

**గురుదక్షిణ**

గురువుకు మనం ఇచ్చేది దక్షిణ. 'దక్షిణ' అనే భావమే శ్రేష్ఠమైనది. ఒక మనిషి ఏదైనా దానమీయ వచ్చు. లేదా త్యాగం చేయవచ్చు. ఈ రెండింటిలోను ఇచ్చేవాడిది పైచేయి. పుచ్చుకునేవానిది కిందిచేయిగా ఉంటుంది. పొరపాటునో, మానవ తప్పిదం వల్లనో ఇచ్చిన వారికి 'అహం' పెరిగే ప్రమాదం ఉంది. శక్తి మేరకు 'దక్షిణ'ను సమకూర్చుకొని, గ్రహీత పాదాల ముందుంచి 'స్వామీ! ఈసారికింతే! దయచేసి స్వీకరించండి. మరల అవకాశముంటే ఇంకా ఎక్కువ ఇచ్చుకుంటాను" అని నమ్రతతో అర్పించుకునేదే దక్షిణ.

**సమర్పణ**

డాక్టర్జీ 'గురుదక్షిణ' ఇవ్వమనలేదు... సమర్పించ మన్నారు. 'సమర్పణ' భావాన్ని మహానుభావులు చాలా మనోహరంగా వ్యక్తంచేశారు.

***'ఏవరు నేర్పేరమ్మ ఈ కొమ్మకు***
***పూలిమ్మనీ రెమ్మరెమ్మకూ***
***ఎంత తొందరలే హరిపూజకు***
***పొద్దు పొడవకమునుపె పూలిమ్మనీ'.*** అని ఒక సినీకవి అన్నారు.

సూర్యోదయంలోగా తనలోని జవసత్వాలన్నింటిని రంగరించి, సుందర, మనోహర సుమధురమైన పుష్పాలుగా మార్చి ఆ హరిసన్నిధిలో సమర్పించు కోవాలని ఒక చిన్న కొమ్మ అనుకుంటుందట.

శరీరాన్ని పైజన్మ వరకు తల్లిసేవకు అర్పించట మంటే ఎంతటి ధైర్యం, ఆత్మవిశ్వాసం ఉండాలి. పాంచభౌతికమైన ఈ శరీరంలోని ప్రతి అంశం



బాజీప్రభు దేశ్‌పాండే

తల్లిసేవకు అర్పణ చేసే భాగ్యం దొరకుట కూడా సామాన్యం కాదు కదా!

**సర్వసమర్పణ వల్ల ఏమి వస్తుంది?**

ఏవో ఇవన్నీ కవుల కపోల కల్పితాలేనా? లేక సర్వసమర్పణవల్ల ఏదైనా ప్రయోజనం ఉందా? అని అనిపించవచ్చు. ఇందుకు కూడా చరిత్రలో అనేక ఉదాహరణలున్నాయి.

***'కోతికి శక్యమే యసుర***
***కోటుల గెల్వను? గెల్చెబో, నిజం***
***బాతని మేన శీతకరుడౌట***
***దవానలుండెట్టివింత?....'*** అనే పద్యం ఈ సందర్భంలో గుర్తుకు వస్తున్నది.

ఒక కోతికి రాక్షసులందరిని సంహరించటం ఎలా సాధ్యమైంది? సరే ఏదో బలవంతుడను కొందాం. మరి అగ్ని దహించివేయకుండా వాలం చల్లబడిం దెట్లా? ఇది రామకార్యానికి అర్పించుకున్న ఫలితమే కాని వేరొకటి గాదు! సమర్పణవల్ల అనంత మైన శక్తి లభిస్తుంది. అద్భుత కార్యాలు జరుగుతాయి. సిక్కువీరులలో భాయి మతిదాస్ కథ విన్నాం. తెగిపోయిన తన తలను ఒక చేత్తో పట్టుకుని రెండవ చేత్తో కత్తి తిప్పుతూ మొండెం యుద్ధం చేసింది.

బాజీప్రభు దేశ్‌పాండే! ఆ వీరుడు కూడా అంతే! తల తెగిపోయినా, శివాజీ క్షేమంగా చేరాడనే ఫిరంగి ధ్వని వచ్చేంతవరకు రెండు చేతులలో రెండు ఖడ్గాలను తీసుకొని మొండెం యుద్ధం చేసింది. ఇది అభూత కల్పన కాదు. కంప్యూటర్ గ్రాఫిక్స్ కావు. నిన్నగాక మొన్న జరిగిన యదార్థ గాథ.

ఆర్ఎస్ఎస్‌లో అందరం సామాన్య సేవకులం, కార్యకర్తలమే. మహానుభావులం ఎవరమూ లేము. మధ్యతరగతి శ్రేణి అంతకన్న క్రింది శ్రేణి వ్యక్తులే సంఘమంతా. కాని ఈ సంఘం 83 సంవత్సరాల ప్రస్థానంలో ఎన్నో అద్భుతాలు చేసింది. 1948లో సత్యాగ్రహం, 1975 ఎమర్జన్సీకి ప్రతిఘటన, దేశ వ్యాప్తంగా రామజన్మభూమిలో మందిర నిర్మాణానికి ఉద్యమం వగైరా... ఇవన్నీ ఎలా సాధ్యం? ఇదే సమర్పణ శక్తి. ఆ సమర్పణనే మన పూర్వికులు మన నుంచి ఆశించారు.

**– చెన్నకేశవ**

**(7.7.2008 జాగృతి నుంచి)**

# ప్రాపంచిక బంధ విముక్తితోనే ఆత్మజ్ఞానం



బ్రహ్మం మనస్సుకు, మాటలకు అతీతమైనదని వేదాలు కూడా చెప్పాయి. మనిషి ప్రాపంచిక విషయాల పట్ల అనుబంధం కలిగి కాంతాకనకాల పట్ల అనురక్తి కలిగి ఉన్నంతవరకు శరీర స్పృహ నుంచి బయటపడలేరని శ్రీ రామకృష్ణ పరమహంస ప్రవచించారు. ప్రాపంచిక విషయాల నుంచి అనుబంధం.. అనురక్తి తగ్గించుకుంటున్న కొద్దీ ఆత్మజ్ఞానానికి దగ్గరవుతాడు. అంతేకాదు... శరీరం పట్ల మమకారం తగ్గుతుంది. అలా లౌకిక వ్యామోహం పూర్తిగా తొలగిపోయి ఆత్మజ్ఞానం కలుగుతుంది. సాధువులు, మహాత్ములు వంటి వారి మనస్సులు ప్రాపంచికత నుంచి విముక్తి పొందడం వల్ల కాంతాకనకాల పట్ల ఆకర్షితులు కారు. అంతేకాక భగవంతుని పాదపద్మాల గురించే ధ్యానిస్తూ ఉంటారు. నామరూపాలలో భేదమే తప్ప వాస్తవం ఒక్కటే. జలాన్ని వివిధ భాషల్లో నీరు, జల్, పానీ తదితర పేర్లతో వ్యవహరి స్తారు. అలాగే భగవంతు డిని దేవుడు, బ్రహ్మన్, కాళి, దుర్గ, రామ, జీసస్, అల్లాహ్ లాంటి పేర్లతో పిలుస్తారు. దేవుడు జీవులందరిలోనూ ఉంటాడు కాని మంచివారితోనే సన్నిహితంగా ఉంటూ, దురాలోచనపరులకు దూరంగా ఉండాలి. దేవుడు పులిలో కూడా ఉంటాడు. అలా అని దానిని కౌగిలించుకోలేరు కదా? నీరు భగవత్ స్వరూపమని ధర్మశాస్త్రాలు చెబుతున్నాయి. అయితే నీటిని ఒక్కొక్క దశలో ఒక్కొక్క అవసరానికి వినియోగిస్తారు. కొంత నీటిని దేవుడి సేవకు, మరికొంత నీటిని ముఖ ప్రక్షాళనానికి, మరికొంత నీరు పాత్రలు, మురికిని శుభ్రపరచడానికి ఉపయోగిస్తారు. ఆఖరున పెర్కొన్న నీటిని తాగడానికో, పవిత్ర ప్రయోజనాల కోసమే ఉపయోగించరు. అలాగే, పవిత్రులు–అపవిత్రులు, నీతిపరులు–అవినీతిపరులు అనే తేడా లేకుండా భగవంతుడు అందరి హృదయాల్లో ఉంటాడు. అయినా, అపవిత్రులతో, అవినీతిపరులతో సంబంధాలు కలిగి ఉండకూడదు. వారితో సన్నిహితంగా మెలగకూడదు. అలాంటి వారిలో కొందరు మాటలు కలిపి మభ్యపెట్టవచ్చు. అయినా వారికి దూరంగా ఉండడం శ్రేయస్కరం.



**'Know the Irrefutable Facts And Protect Hindu Dharma' నుంచి**

**పూజ్య స్వామి దయానంద సరస్వతి**

**(సంకలన కర్త)**

# అత్యాచార పర్వం

ఎమర్జెన్సీ అంటే ఇరవై ఒక్క మాసాల నిర్బంధం మాత్రమే కాదు, నిర్బంధపు పిడికిలిలో కొన్ని తరాలవరకూ వినిపించే మనోరోదన ఉంది. అత్యాచారాలకి ఎమర్జెన్సీ కేరాఫ్ అయిందంటే అతిశయోక్తి కాబోదు. అత్యవసర పరిస్థితి అంటే – అక్షరాలా పోలీసు రాజ్యమే. మీసా, డీఐఆర్‌ల కింద లక్షమందిని అరెస్టు చేశారు. 25,000 మంది కేవలం ప్రభుత్వోద్యోగులకే బలవంతంగా కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు జరిపించారు. ఎంపీ, యు.పి, ఢిల్లీ, పంజాబ్, హరియాణా, ఆంధ్ర, కర్ణాటక, కేరళ రాష్ట్రాలలో పోలీస్ లాకప్‌లు నాజీల క్యాంప్‌లుగా మారిపోయాయి. ఒక్క ఆంధ్రలోనే వేయిమంది పోలీసుల చేతిలో జీవితాంతం గుర్తుండే చేదు అనుభవాలు చవిచూశారు. ఇవన్నీ బయటకు తెలిసినా పత్రికలు ప్రచురించే అవకాశం లేకపోయింది. కొన్ని 'క్రమశిక్షణ' ఇనపతెర వెనకే ఉండిపోయాయి. 1977 జనవరిలో సెన్సార్‌షిప్ ఎత్తివేసిన తరువాత ఒక్కొక్కటీ దారుణాలు వెలుగు చూశాయి. మొదట ఒక తెలుగు దినపత్రిక భారతదేశంలో పరిస్థితి గురించి ఆమ్నెస్టీ తయారుచేసిన నివేదికను ప్రచురించింది. 1977 మార్చి1న జనతా పార్టీ ప్రచురించిన ఒక పత్రాన్ని పత్రికలు ప్రధానంగా ప్రచురించాయి. ఎమర్జెన్సీ నీడలో జరిగిన ఘాతుకాలు అందులో జనతాపార్టీ వివరించింది. తరువాత క్రమంగా టర్క్‌మన్ గేట్ (ఢిల్లీ) ఉదంతం, స్నేహలత, లారెన్స్ (కర్ణాటక) నిర్బంధం, రాజన్ అదృశ్యం (కేరళ) ఒక్కొక్కటీ వెలుగులోకి వచ్చాయి. ఎమర్జెన్సీలో అరెస్టయిన ప్రముఖ జర్నలిస్టు జి.కె.రెడ్డి వ్రాసిన "ఈ అత్యాచారాలను క్షమించగలమా?" అనే వ్యాసం పాఠకులను కదిలించి వేసింది.

ఢిల్లీ అందాల కోసం అక్కడి మురికివాడ టర్క్‌మన్ గేట్ ప్రాంతాన్ని అతి దారుణంగా ప్రభుత్వం తొలగించింది. 1976 ఏప్రిల్‌లో జరిగిన ఈ సంఘటనలో ఆఖరికి పోలీసు కాల్పులలో మరణించిన వారి సంగతిని కూడా ప్రభుత్వం సెన్సార్ చేసింది. బలవంతంగా కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయబోయిన అధికారులపై మూకుమ్మడిగా ప్రజలు తిరగబడడం, పోలీసులు కాల్పులు జరపడం వంటి సంఘటనలు ఉత్తరప్రదేశ్‌లో జరిగాయి. కాని, వార్త ఏదీ ప్రచురణకు నోచుకోలేదు.

సంస్కార చిత్రంతో జాతీయ ఖ్యాతి గాంచిన నటి స్నేహలతారెడ్డిని 1976 మే 1న పోలీసులు తీసుకువెళ్లారు. 1977 జనవరిలో విడిచిపెట్టారు. జైలు నుంచి వచ్చిన కొన్ని రోజులకు ఆమె కన్ను మూసింది. కార్మిక నేత జార్జి ఫెర్నాండెజ్ ఆచూకీ ఆమెకు తెలిసి ఉంటుందని పోలీసుల అనుమానం అంతే. లారెన్స్ ఫెర్నాండెజ్ ఉదంతం ఇంకో విషాదం. జార్జి ఫెర్నాండెజ్ తమ్ముడైనందుకు ఆయన జీవితాంతం జీవచ్ఛవంలా బతకవలసిన స్థాయిలో చిత్రహింసలకు గురయ్యాడు. కేరళలో రాజన్ అనే ఇంజనీరింగ్ విద్యార్థి అదృశ్యమయ్యాడు. అయితే రాజన్ తండ్రి ప్రొఫెసర్ వారియర్ వేసిన కేసుతో డొంకంతా కదిలింది. రాజన్‌ను లాకప్‌లో చంపేసిన పోలీసులు అతడి శవం కనిపించకుండా చేశారు. దీనిపై కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పుతో కరుణాకరన్ ప్రభుత్వం రాజీనామా చేసింది.

సంజయ్‌గాంధీ ఇందిర రెండవ కుమారుడు. రాజ్యాంగేతర శక్తి అన్న పదానికి మూలపురుషుడు ఇతడేనన్న నమ్మకం ఉండేది. ఇతడు దేశం మీదకు తెచ్చినదే కుటుంబ నియంత్రణ ఉద్యమం (నాస్‌బందీ). ఇందిర 20 సూత్రాల ఆర్థిక ప్రణాళిక పేరుతో అత్యాచారాల మీద ముసుగు వేస్తే, సంజయ్ గాంధీ నాలుగు సూత్రాల పథకంతో నేరుగానే ఘోర సంక్షోభానికి కారకుడయ్యాడు. దీనికి ప్రధాని కార్యాలయ ఆమోదం ఉంది గాని, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖకు సంబంధం లేకుండానే జరిగింది. ఢిల్లీలో మొదలయిన ఈ దుశ్చర్యను తరువాత దేశ వ్యాప్తంగా అమలు చేశారు. జ్ఞానపీఠ్ గ్రహీత మహాశ్వేతాదేవి కథ 'మకర సవర' గిరిజన సమాజంలో బలవంతపు కుటుంబ నియంత్రణ ఎంతటి విధ్వంసానికి దారి తీసిందో చెబుతుంది.



సంజయ్ గాంధీ

ఎనభయ్ సంవత్సరాల వృద్ధులు మొదలుకొని పదిహేనేళ్ల బాలురను సైతం పోలీసులు, ఆరోగ్య కార్యకర్తలు విడిచిపెట్టలేదు. ఈ అంశంపై 'విశాలాంధ్ర' ఫిబ్రవరి 10, 1977న రాసిన సంపాదకీయం ఒళ్లు గగుర్పొడిచే రీతిలో సాగింది. గుంటూరులో 42మంది మగపిల్లలకు బలవంతంగా శస్త్ర చికిత్స జరిపారని, అందులో 15 సంవత్సరాల రత్నాకరం అనే బాలుడు ఖమ్మంలోని తన తల్లిదండ్రులకు సంగతి తెలియజేయడంతో అక్కడ కేసు నమోదయింది. ఈ వార్తను కూడా ఆ పత్రిక ప్రచురించింది.

నిజానికి అది బలవంతపు కుటుంబ నియంత్రణ. ఒక కోటి పదకొండు లక్షల మందికి(ఇండియా టుడే, అక్టోబర్ 25, 2024. డిసెంబర్ 9, 2021 హిందుస్తాన్ టైమ్స్ కూడా ఈ విషయం వెల్లడించింది) ఆ పేరుతో శస్త్ర చికిత్సలు చేసినప్పటికీ అసలు ఆ పథకానికి అధికార ముద్ర లేనేలేదు. ఎమర్జెన్సీపై నియమించిన షా కమిషన్ కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించింది. చిత్రం ఏమిటంటే నాజీలు నాలుగున్నర లక్షల మందికి మాత్రమే కు.ని. ఆపరేషన్‌లు నిర్వహించారు. కు.ని. శస్త్ర చికిత్సలు పేరుతో జరిగిన ఈ అకృత్యంలో సంజయ్, ఇందిర, రాష్ట్రాల నాటి ముఖ్యమంత్రులు కూడా భాగస్వాములే. శస్త్ర చికిత్సలకు దూరంగా ఉంటే కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగులకు జీతాలలో కోత విధించాయి. పొలాలకు నీటిని నిలిపివేశాయి. ఉద్యోగులకు శస్త్రచికిత్సల లక్ష్యాలు నిర్దేశించి, దానికి చేరకుంటే ఉద్యోగాలు ఊడిపోతాయని కూడా చెప్పేశారు. ప్రభుత్వ బారిన పడకుండా తప్పించుకున్న వారి ఇళ్ల మీద అర్ధరాత్రి దాడులు చేసి, ఈడ్చుకు వెళ్లారు. ఇలాంటి ఆపరేషన్‌ల కారణంగా కొందరు చనిపోయారు కూడా. డబ్బు సరే, కొన్ని చోట్ల స్థలాలు కూడా ఇస్తామని ప్రమాణం చేసి శస్త్ర చికిత్సలు చేశారు. కొందరు ప్రభుత్వోద్యోగులు పైవారి మెప్పు కోసం కోయించుకున్నారు. జూలై 20, 1976న ఢిల్లీ పోలీసు శాఖ విడుదల చేసిన బులెటిన్ ప్రకారం 1100 మంది వారి సిబ్బంది స్వచ్ఛందంగా శస్త్ర చికిత్సలు చేయించుకున్నారు. ఆగస్ట్ 2న విడుదలైన బులెటిన్‌లో ఆ సంఖ్య 2000కి చేరింది. ఫలితం – జాతీయ జనాభా విధానం 2000లో అధిక సంతానం అవసరమన్న వాదన చేర్చవలసి వచ్చింది. 1960–70 మధ్య కొన్ని పాశ్చాత్య దేశాలు జనాభా పెరిగితే ఆహార సమస్య ఎదురవుతుందనే పిచ్చి వాదనకు లొంగిపోయి బలవంతపు కుటుంబ నియంత్రణను అమలులోకి తెచ్చారు. ఆయా దేశాలలో బలవంతంగా శస్త్ర చికిత్సలు చేశారు. దాంతో జనాభా సమీకరణలలో తీవ్రమైన అంతరాలు వస్తాయన్న ఇంగితం వారికి లేకపోయింది. నిజానికి ఆ వాదన నమ్మే భారత్ కూడా 1970లలోనే మొదలుపెట్టింది. ఇందుకు ప్రపంచ బ్యాంక్, యూఎన్ పాప్యులేషన్ ఫండ్ వంటి మార్గాల ద్వారా కోట్లాది డాలర్ల నిధులు తీసుకుంది.

ఎమర్జెన్సీ కాలం నాటి అరాచకాలు జాబితా చిన్నదేమీ కాదు. అక్రమ అరెస్టులు, జైలు సరేసరి. ఆంధీ అనే సినిమాను నిషేధించారు. కిస్సా కుర్సీకా అనే చిత్రం రీళ్లు ముక్కలు ముక్కలు చేసేశారు. వీటికి పరాకాష్ట మారుతీ కారు తయారు ఉదంతం.

– జాగృతి డెస్క్

'కోపంతో గాలిని వేడెక్కిస్తూ, కన్నీళ్లతో శిలల్ని కరిగిస్తూ! /మనసు మొక్కమీద ఎండిపోయిన
ఆకుల్ని రాల్చేసి, కొత్తపూత పూయిస్తూ /గుండె పగుళ్లపై అక్షరధారల్ని జల్లుజల్లులుగా కురిపిస్తూ'

కారాగార గదుల్లో ఎవరికి వారుగా ఆ ముగ్గురూ! స్నేహలత, గాయత్రీదేవి, విజయరాజె సింధియా. ముగ్గురిదీ అపురూప శక్తిసంపన్నత. అంతటి దక్షతా అత్యవసర పరిస్థితి అనే దాని ఆంతరంగిక భద్రతా... కాదు కాదు... క్షుద్రతా నిబంధనాల చట్రంలో చిక్కువడింది. ఒక వ్యక్తి రూపంలోని మహమ్మారితనానికి గురైపోయింది. అది 1975 ప్రాంతం. ఇది 2025 సంవత్సరం. సరిగ్గా యాభై ఏళ్లు! నాటి పాలక పక్షీయుల ముసుగుతత్వం, వక్రోక్తుల వ్యవహారం, వ్యర్థాలాపం, విషస్వప్నం, తేనెపూసిన కత్తి వ్యక్తిత్వం, నమ్మకద్రోహం, ద్వేషం, రోషం, ఉక్రోషం, ప్రశ్నను సహించలేనితనం అన్నీ ఒక్కటయ్యాయి.ఎమర్జెన్సీగా మన దేశానికి దాపురించాయి. ఆత్యయికం, మీసా ఏ పేరుతోనైనా పిలవచ్చు అలనాటి ఆ పాలన అరాచకాన్ని! ఎవరికి అత్యవసర స్థితి? దుర్మార్గ పాలకత్వానికి! ఎందుకని మీసా (మెయింటెనెన్స్ ఆఫ్ ఇంటర్నల్ సెక్యూరిటీ యాక్ట్)? ఎదిరించి నిలువరించేవారిని చట్టం అమలు పేరిట తొక్కి ఉంచడానికి! అందుకే... జైళ్లు నోళ్లు తెరిచాయి. జనస్వామ్యవాదులను కబళించాలని చూశాయి. ఆ బాధిత వాదుల్లోని స్నేహలత సహజసిద్ధ నిపుణ కళాకారిణి. గాయత్రీదేవి, విజయరాజె సింధియాలు మహారాణులు. అయినా పాలకుల 'అత్యవసరం' ఆ ముగ్గురినీ నిర్బంధించింది. అవన్నీ కారుచీకటి రోజులు. తలచిన ప్రతీసారీ మన హృదయాల్ని బరువెక్కించే సందర్భాలు. పాలనా కుటిలత్వాన్ని ఏవగించుకుంటూ మనందరి పిడికిళ్లూ బలంగా బిగిసేంత ఉద్వేగ తీవ్రతకు కారకాలు. ఆ ముగ్గురు వనితలూ మెరిసిన కొడవళ్లు! ఎంతో భారంగా చెమర్చిన కళ్లు. అవి స్వతంత్రత రగిల్చిన అగ్నిజ్వాలలు!



స్నేహలత | గాయత్రీదేవి | విజయరాజె సింధియా

నిజానికి జాతీయ అత్యవసర పరిస్థితిని ఎప్పుడు ప్రకటించాలి? యుద్ధం, అవతలి నుంచి దురాక్రమణ, దేశంలో సాయుధ తిరుగుబాటు, 1962, 1971 సంవత్సరాలు యుద్ధ సమయాలు. మరి 1975? నిరంకుశత్వాన్ని, నియంత తత్వాన్ని ఎవరు నిగ్గదీసినా అస్సలు భరించని, సహించని జాడ్యం. అనుమానించిన ప్రతీ ఒక్కరినీ పోలీస్ లాకప్‌లోకి తోసేసే దుష్టత్వం. అప్పట్లో అలా వేలమంది నిర్బంధితులు.

ఆ వ్యథితుల్లో స్నేహలత ఉన్నారు. సృజన సాహితీవేత్త పఠాభి సతీమణి. ఆమె నటరంగంలో ప్రజ్ఞాశాలి. అటువంటి కళాత్మకతతోనే దురన్యాయాన్ని ప్రశ్నించేవారు. అదే పాలకులకు కంటగింపు.

ఓ రాత్రి పోలీసులు దొంగదారిన వచ్చిపడ్డారు. అంతకుముందే నానారకాల 'నాటకాలూ' ఆడారు. ఆమె పిల్లల్ని 'అపహరించుకుపోయారు'. తాను ఇంట్లో లేని వేళన, తల్లినీ బాధించారు. భార్యాభర్తలిద్దరినీ ఎన్నో విధాలుగా హింసించారు. మానసికంగా క్షోభపెట్టారు. రోజుల పర్యంతం వేధించారు. భర్తనీ పట్టుకుపోయారు ఎక్కడికో!

**'మావారు ఏరీ? మా అబ్బాయి పరిస్థితేమిటి? మా అమ్మాయిని ఎంతగా రాచి రంపాన పెడుతున్నారో ఏమిటో?'** అంటూ ప్రశ్నల వర్షం కురిపించిందామె. అసలే ఎమర్జెన్సీ పోలీసులు! ఎందుకు స్పందిస్తారు? రాజకీయ అభిప్రాయాలున్న స్నేహితుడి జాడ చెప్పాలంటూ సతాయించారు పోలీసులు. ఆయన ఎక్కడుంటాడో ఆమెకేం తెలుసు?

అది 1976. ఆమెను బంధించారు. అదీ ఒక ఇంట్లో! ఒకరోజున ఉన్నట్లుండి మాయం చేశారు స్నేహలతని! మోసం, దారుణం. మోసం ఏమిటంటే– ఏవో కాగితాల మీద బలవంతంగా సంతకాలు పెట్టించడం. మరెంతో దారుణాతి దారుణం తెలుసా? ఆమెను వివస్త్రను చేయడం! అదేమంటే... సోదా అనడం! బెంగళూరు సెంట్రల్ జైల్లో ఎన్నో– ఇలాంటి 'పరిస్థితులు'. ఆమె ఉంది జైలుగది అనే నరకంలో! 'మీసా' అంటూ నిర్బంధకాండ కొనసాగించారు పాలక పోలీసులు.

ఒకటీ రెండూ మూడూ నాలుగూ ఐదూ ఆరూ ఏడూ ఎనిమిదీ... ఆపై తొమ్మిది! అన్ని నెలలూ బంధించి ఉంచారామెను. 'ఎందుకీ దమననీతి' అంటే – 'ఇదంతే' అన్నదే పాలకపక్ష (పాత) జవాబు. వ్యాధుల బారిన పడ్డారామె. సాధింపులు, వేధింపుల బెడదతో చిక్కి శల్యమయ్యారు. కుటుంబానికి దూరంగా నానా యాతన! 'నన్ను బతకనిస్తారా వీళ్లు' అనిపించింది ఆమెకి. అధికార బధిరాంధ ప్రేరిత పోలీసువర్గం ఎంత ప్రమాదకరమో బాగా అర్థమైంది ఆ తల్లికి! అప్పుడు రాసుకున్నారు డైరీని! ఎవరు ఆమె, ఎటువంటివారు? స్వతంత్ర సమరయోధగా ఉన్నవారు. మేటి నటి. సాటిలేని రచయిత్రి, సామాజిక సంక్షేమ క్రియాశాలి. అంతటి కళావేత్తకు ఒంటరి నిర్బంధం! చీకటి గదిలో తొమ్మిది నెలలుగా మగ్గిపోయా రామె. బాలల పత్రికలకు సంపాదకురాలు ఒకప్పుడు. సున్నిత భావుకురాలు. అలాంటి ఆమె కర్కశపాలన బారినపడి, శ్వాసకోశ వ్యాధి పీడితురాలిగా కటకటపడి, ఎటువంటి చికిత్సా అందని స్థితిలో... జైలు నుంచి పెరోల్ మీద బయట పడిన నాలుగైదు రోజులకే శాశ్వతంగా కన్ను మూశారు. దుష్ట దుర్మార్గ అక్రమ అన్యాయ నిర్బంధానికి బలయ్యారామె!

యమర్జెన్సీ కాలంలో కారాగార గది గోడల మధ్య నుంచి స్నేహలతా రెడ్డి వెల్లడించిన డైరీ నాటి చీకటి చరిత్రకి అక్షర సాక్ష్యం. 1975 జూన్ 25 రాత్రి మొదలు 1977 మార్చి 21వరకు 21 నెలల పర్యంతం 'యమ' అర్జెన్సీ! లక్షా పది వేలమందిపైగా పలు చట్టాల కింద బంధితులయ్యారంటే అదంతా పాలకపక్షి పాప ఫలితమే. అనుమానం వస్తే వచ్చి పట్టుకెళ్లడమే. దర్యాప్తు, విచారణ ఏవీ లేకుండా జైళ్లల్లో కుక్కేయడమే. అసలు అది కదా ఘోరాతిఘోర నేరమంటే!

ఆమె డైరీలో ఏముంది? అది **'ప్రిజన్ డైరీ'**. అదీ 1977లో వెలుగు చూసింది. **'నా శరీరం అనేకానేక అవమానాలు ఎదుర్కొంది. అణచివేశామని 'ఇందిరా' మందిరం అనుకోవచ్చు. నా ఆత్మను ఏ ఒక్కరూ అణచివేయలేరు. నాలోని స్ఫూర్తిని ఎవరూ ఏమీ చేయలేరు.'**

ఇవి చాలు కదా.... స్నేహలత పరమాద్భుత

# ‘యమ’ర్జెన్సీలో ధిక్కార స్వరాలు

వనిత అని చాటి చెప్పడానికి! ఆ అద్భుతత్వం ఆమె మాటలు, రాతలు, చేతల్లో అన్ని విధాలుగా కూడా పుష్కలం. జయహో స్నేహలతా!

గాయత్రీదేవి సైతం ఇందిరమ్మ పీడితురాలే! తిహార్ కారాగారంలో నిర్బంధిత. అక్కడే గాయత్రి ఆరోగ్యం చాలా క్షీణించింది. శరీరం బరువు విపరీతంగా తగ్గి నిస్సత్తువ ఆవరించింది. తొలి నుంచీ స్వతంత్ర భావనలున్న ఆమె అంటే నాటి పాలక వర్గానికి సుతరామూ పడదు. అందువల్లనే జైలుపాలు చేసిందామెను. అసాధారణ మహిళామణి గాయత్రీదేవి. జైపూర్ మహారాజా అర్ధాంగి. ‘రాజమాత’గా విఖ్యాతురాలు. అంతకుమించి సంప్రదాయ సౌందర్యవంతురాలు. సమాజ ప్రయోజనాల గురించే సదా తన ఆలోచన, ఆచరణ కూడా! విశ్వభారతిలో విద్యాభ్యాసం. శాంతినికేతన్‌తో విద్యానుబంధం. ఎంత సంప్రదాయవాదో అంత ఆధునికత ఆమెది. వాహనాలు నడపాలన్నా, క్రీడల్లో మునిగి తేలాలన్నా ఆమే! తన ప్రాంతంలో పబ్లిక్ స్కూల్ సంస్థాపకురాలు. చిత్ర నిర్మాణ విభిన్నతను పరిపోషించినవారు. ఇన్ని శాస్త్రాలు, కళలు, విద్యల్లో ఆరితేరి ఉన్నా; ఎమర్జెన్సీ పీడ దాపురించిందామెకు. ఐదు నెలలపాటు కారాగారంలో ఉండి ఎన్నో రకాల బాధల పాలయ్యారు. ఆమెను ఎటువంటి గదిలో బంధించారంటే – కరడుగట్టిన నేరగాళ్ల దరిదాపుల్లో! విషపురుగులు సంచరించే చిన్నపాటి గది లోపల! ఇంతకీ ఆమె చేసిన అంత పెద్ద నేరమేమిటో?

పదే పదే అదే పనిగా పాలకపక్షానికి బాకా ఊదకపోవడం. చుట్టూ చేరి ‘ఆహా ఓహో’ అంటూ మెప్పులతో పబ్బం గడపకపోవడం. ఆమె స్వతంత్రతా రీతిని సహించలేని పాలకులు అప్పటి అత్యవసర చట్టాలను అడ్డం పెట్టుకుని; చేయకూడని పనులన్నింటినీ నిర్లజ్జగా చేసేశారు! కారాగార దురన్యాయాలపరంగా గాయత్రీదేవి రాసిన పుస్తకం **‘ఎ ప్రిన్సెస్ రిమెంబర్స్; ది మెమొరీస్ ఆఫ్ ది మహారాణి ఆఫ్ జైపూర్’**. రాజకీయ ప్రత్యర్థితత్వంతోనే జరిగింది ఆమె అరెస్టు. నిజానికి గాయత్రీదేవి, ఇందిరాగాంధీ బాల్యమిత్రులు. ఒకే పాఠశాలలో చదువుకున్నారు. అయినప్పటికీ గాయత్రి అంటేనే ‘ఆ’ నేతకు తెగ కంటగింపు. రాజకీయ రంగాన సమున్నతంగా ఎదిగి, ఎన్నికల పర్వాన అఖండ విజయఢంకా మోగించి, ప్రజాదరణను సుస్థిరపరచుకున్న గాయత్రిని చూస్తేనే ధుమధుమలాడేవారు పాలకేందిర. పార్లమెంటు భవనంలో తనను చూడాలంటేనే అదోలా ఉండేది ఆవిడకు! ‘ఆత్యయిక’ను అడ్డుపెట్టుకుని పాతకక్షలు తీర్చుకునే పని మొదలు పెట్టింది పాలకపక్షం. అసలే అధికార ఉన్మాదం. ఆపైన చట్ట నిబంధనలను దుర్వినియోగం చేసే విధానం. ఇక చెప్పేదేముంది? విజృంభించిన దర్పం గాయత్రిని కారాగారానికి తరలించింది. అంతకుముందర వైద్యచికిత్స అవసరమై ముంబయిలో ఉన్న ఆమెను ఏ మాత్రం కనికరం లేకుండా తదుపరి బందీని చేసింది. ఎమర్జెన్సీని విధించిన నెలలోపలే గాయత్రీదేవి కారాగారం లోపలికి! ఎంతెంతో క్షోభ అనుభవించారామె. అధికారవర్గాల టక్కుటమారాలు, మాయోపాయాలు, నీచ వ్యవహారాలకు విసిగి వేసారారు. వేదన ఫలితంగా అనారోగ్యం ఎక్కువైంది. వ్యాధుల తీవ్రత పెరిగింది. చికిత్స మాత్రం ఏ దశలోనూ సవ్యంగా అందలేదు. అంత వ్యధలోనూ ఆమె సేవాభావన చెక్కు చెదరలేదు. తిహార్ జైల్లో ఉండగానే, అక్కడి ఇతర ఖైదీ మహిళల పిల్లలకు పాఠాలు చెప్పారు. పుస్తకాలు కొని చదువుకునేలా చేసేందుకు తనవంతు సాయం అందించారు. బాలల ఆటపాటల కోసమూ ఎంత చేయాలో అంతా చేశారు ఆ రాజమాత!

తన బాధలు ఎలా ఉన్నా, కారాగారంలోని ఇతర ఖైదీల గురించి మానవతా భావన కనబరిచారు. అధికార పక్షీయులతో పోలిస్తే ఎంత తేడా? వాళ్లది అణచివేత. ఈమెది మానవత. చివరికి ఏవేవో షరతులతో విడుదల చేశారామెను. ఆ ఆదేశాలు 1976 జనవరిలో అందాయి. వాటిల్లోనూ ‘ఉత్త’ర్వుల మాయాజాలం! ఆఖరికి ఎలాగైతేనేం విడుదలయ్యారు. తన కథను తాను రాశారు. కాలం గడిచింది. కారాగార గది గోడల వాతావ‘రణం’ తప్పలేదు ఆమెకి. పక్షవాత సమస్య చుట్టుముట్టి, ఊపిరితిత్తుల బాధ తోడుపడి, మరో లోకానికి వెళ్లిపోయారు. తిరిగి ఇక్కడికి రాలేని లోకం అది!

విజయరాజె సింధియా, ఈమె కూడా మహారాణి, గ్వాలియర్‌కి. ప్రజల్లో ఈమెకీ అపార ఆదరణ ఉంది. రాజకీయంగా ఎదుర్కోవడం చేతకాని పాలకపక్షం ఈమెపైన కూడా ఆర్థిక నేరాల అభియోగాలను మోపి, ఆత్యయిక స్థితిని ఇష్టానుసారం వాడేసుకుంది. ఇరుకిరుకు జైలు గదిలో నిర్బంధించింది. గాలి చొరబడని గది అదంతా!

దోమల వీరవిహారం అక్కడి ‘అదనపు సౌకర్యం’! అంతా అత్యవసర స్థితీగతీ. అదే సంవత్సరం (1975) సెప్టెంబర్ 3న రాజమాత విజయరాజె సింధియాను తిహార్ జైలుకి తెచ్చారు పోలీసులు. అప్పటికే ఆమె బ్యాంకు ఖాతాలన్నింటినీ స్తంభింపచేశారు. సరిగ్గా అక్కడే ఆ గదిలోనే అప్పటికి గాయత్రీదేవి ఉన్నారు. ఇద్దరూ ఒకరినొకరు చూసుకుని గౌరవంగా నమస్కరించుకున్నారు. మరికొన్ని రోజులయ్యాయి. విజయరాజె సింధియా రాసిన వాస్తవిక గాథ పుస్తకం **‘ప్రిన్సెస్!’** తమ ఉభయుల గురించీ వివరంగా రాస్తూ వచ్చారామె. సమాచారం ప్రకారం – అదే జైలు గది పరిసరాల్లో ఇతరత్రా ఖైదీలు (కొంతమంది హత్యానేరాల్లో ఉన్నవాళ్లు) తిరుగుతుండేవారు. ఎవరి నుంచి ఎటువంటి ఆపద ముంచొకొస్తుందో తెలియని పరిస్థితి ఉండేది. గది అంతటా అదో రకం వాసన. ఈగలు తెగ ముసురు తుండేవి. నరకం అంటే ఏమిటో, ఎలా ఉంటుందో ఆ గదిని చూస్తే తెలుస్తుంది ఎవరికైనా!

జైల్లో అనారోగ్యంతో తల్లడిల్లిన విజయరాజె సింధియా అటు తర్వాత ఢిల్లీలోని ఆస్పత్రిలో చేరారు. చూసేందుకు కుటుంబ సభ్యులను సైతం అనుమతించలేదు. అలా అధికార పటాటోపం మీద సాగింది ఆమె పోరాటం! మరెన్నో పరిణామాలు చోటు చేసుకున్నాయి. కొంతకాలానికి ఆమె అంతిమశ్వాస విడిచారు. ఆమె ఆరాట పోరాటాలన్నీ స్వేచ్ఛ కోసమే. ఎదిరించి నిలవడమే తప్ప, రాజీపడటం తెలియని ధీరోదాత్తురాలు. ఆ రోజుల్లో ఎంత అణచివేత ఉందో అంతకు దీటుగా ప్రతి ఘటనా ఉంది. నిరంకుశత్వాన్ని ప్రతిఘటించి ఉద్యమించిన మహిళామణి రత్నాలే ఈ ముగ్గురూ! వీరి చరిత ప్రజాస్వామ్య స్ఫూర్తికి అక్షర ప్రతీక. జయజయజయహే!



**జంధ్యాల శరత్‌బాబు**
సీనియర్ జర్నలిస్ట్

# విశ్వరక్షకుడి విశిష్టతలు...

సర్వమానవ సమానత్వం, లౌకికతత్వం పూరీధీశుడు జగన్నాథుడి సిద్ధాంతం. ఆయన సన్నిధిలో దర్శనం, అర్చనాదుల్లో హెచ్చు తగ్గులు, మహాప్రసాద స్వీకరణలో తేడాలు ఉండవు. విశ్వరక్షకుడు జగన్నాథుడిని దారుబ్రహ్మ అంటారు. బోయవాడి బాణ ప్రయోగంతో కృష్ణ భగవానుడు అవతారం చాలించినప్పుడు ఆత్మస్వరూప బ్రహ్మ పదార్థాన్ని అవంతీపురాధీశుడు ఇంద్ర ద్యుమ్నుడు దారు విగ్రహంలో నిక్షిప్తం చేసి ప్రతిష్ఠించాడని పురాణగాథ. ఒడిశాలోని గిరిజన వంశస్థులు దైవపతులుగా స్వామి పూజల్లో పాల్గొంటారు.

దేశంలోని సప్త మోక్షదాయక క్షేత్రాలలో పురుషోత్తమధామం (పూరి) ఒకటి. నీలాచలం, పురుషోత్తమ క్షేత్రంగా వ్యవహరించే దీని ప్రస్తావన మత్స్య, స్కంద, వామన పురాణాల్లో కనిపిస్తుంది. ఆలయంలోని శ్రీపీఠం/రత్నపీఠంపై జగన్నాథుడు –అగ్రజుడు బలభద్రుడు, చెల్లెలు సుభద్ర, సుదర్శనుడితో కొలువుదీరాడు. అర్చనాదుల నుంచి అన్న భోగం వరకు ప్రతి క్రియ, ఉత్సవం ప్రత్యేకమైనవే. 'ఎంత మాత్రమున ఎవ్వరు తలచిన అంత మాత్రమే నీవు...' అని పదకవితా పితామహుడు అన్నమయ్య అన్నట్లు–ఈ క్షేత్రంలో శ్రీవైష్ణవ సంప్రదాయం కొనసాగుతున్నా, ఇక్కడి దైవాన్ని శైవులు శివుడిగా, శాక్తేయులు భైరవునిగా, బౌద్ధులు బుద్ధునిగా, జైనులు అర్హత్తగా, ఆలేఖ్యులు శూన్యస్వరూపునిగా అర్చిస్తారు. ప్రధాన ఆలయం చుట్టూ గల పార్శ్వ దేవతల ఆలయాలు, ఆనంద బజార్ (ప్రసాదాల శాల), వంటశాలను కలుపుతూ రేఖ గీస్తే శంఖాకారంలో ఉండడం వల్ల ఈ క్షేత్రానికి శంఖక్షేత్రమని పేరు.

జగన్నాథ రథయాత్ర ప్రపంచలోనే విశిష్ట, అద్భుత ఘట్టం. దాదాపు ఇతర ఆలయాలలో పర్వదినాల్లో, విశేష తిథుల్లో నిర్వహించే ఊరేగింపులో రథంలో ఉత్సవమూర్తులే ఆశీనులై ఉంటారు. ఆ రథాలు కూడా శాశ్వత ప్రాతిపదికమై నిర్మితమై ఉంటాయి. ఈ క్షేత్రంలో అందుకు భిన్నం. ఏ ఏటికాయేడు నిర్మితమయ్యే మూడు రథాలలో మూలవిరాట్టులే కదలి వెళ్లి భక్తకోటికి దర్శనమిస్తారు. రథాల తయారీ ప్రక్రియ అక్షయ తృతీయ (వైశాఖ శుద్ధ తదియ)నాడు ప్రారంభమై, ఆషాఢ శుద్ధ పాడ్యమి నాటికి పూర్తవుతుంది. పాత రథాల కలపను వేలం ద్వారా భక్తులకు విక్రయిస్తారు. అది ఇళ్లలో ఉంటే శుభం కలుగుతుందని వారి విశ్వాసం.

ఇతర క్షేత్రాలలో నిత్య,వార, పక్ష, మాస ప్రాతిపదికగా, ఆలయ సంప్రదాయానుసారం మూలమూర్తికి అభిషేకాలు నిర్వహిస్తుంటారు. జగన్నాథ 'పరివారం' మాత్రం ఏడాదికి ఒక్కసారే (జ్యేష్ఠ పౌర్ణమి) స్నానమాడుతుంది. ఆ అభిషేకాన్ని 'దేవస్నాన పూర్ణిమ' గా వ్యవహరిస్తారు. సుదర్శనుడు సహా 'మూర్తిత్రయం' (జగన్నాథ,బలభద్ర, సుభద్ర)ను పవిత్ర జలాలలో అభిషేకించి ఆ విగ్రహాలను చీకటి మందిరానికి తరలిస్తారు. చన్నీళ్ల స్నానం కారణంగా స్వామి వారు జలుబు, జ్వరం బాధపడతారన్న భావనతో పదిహేను రోజులు పాటు ఆ గదిలో ఉంచి సపర్యలు చేస్తారు. ఆ సమయంలో శ్రీపీఠంలో దేవతా మూర్తుల దర్శనం ఉండదు. ప్రత్యామ్నాయంగా పెద్ద పటాన్ని (పట్టా చిత్ర) ఏర్పాటు చేస్తారు. చీకటిగదిలోని విగ్రహాలకు నిత్య నైవేద్యంగా సమర్పించే పదార్థాలకు బదులుగా, ఆయుర్వేద మూలికలతో చేసిన వాటిని ఆరగింపుచేస్తారు. రథయాత్రకు ముందురోజు (ఆషాఢ శుద్ధ పాడ్యమి) విగ్రహాలను ఆలయంలో పునః ప్రతిష్ఠిస్తారు. అదే 'నవయవ్వన దర్శనం'. ఆ మరునాడు (విదియ) విగ్రహాలను రథాలపై నందిఘోష (జగన్నాథుడు), తాళధ్వజం (బలభద్రుడు),

# బోనాలకు



తెలంగాణ జానపద సంస్కృతీ ప్రస్థానంలో మూడు పర్వ దినాలలో బోనాలు ఒకటి. మిగిలినవి.. బతుకమ్మ పండుగ, సమ్మక్క, సారలమ్మ మేడారం జాతర. మొదటి రెండింటిని ఏటా జరుపుకుంటే మూడవది రెండేళ్లకు ఒకసారి ప్రధాన జాతరగా, ఒక ఏడాది సాధారణంగా నిర్వహిస్తారు. ఆషాఢం రావడంతోనే తెలంగాణలో... ముఖ్యంగా భాగ్యనగరంలో బోనాలు ఘనంగా జరుగుతాయి.

## జూన్ 29 గోల్కొండ బోనాలు ప్రారంభం

తెలుగునాట అందునా భాగ్యనగర పరిసర ప్రాంతాల వారికి అత్యంత ప్రధానమైనవి బోనాలు. గోల్కొండను అబుల్ హసన్ పాలించిన కాలంలో (1675) దక్కన్‌లో బోనాల పండుగ ప్రారంభమైంది. కాకతీయ ప్రభువులు తమ ఇలవేల్పుగా అర్చించిన కాకతీమాతకు ఏటా బోనాలు సమర్పించేవారని, 'అమ్మ' ఎదుట అన్నపు రాశులు పోసి, నైవేద్యం సమర్పించి దానిని వితరణ చేసేవారని జయాపసేనాని తన 'నృత్యగీతావళి'లో పేర్కొన్నాడు. అనంతర కాలంలో ఈ పండుగ క్రమంగా అన్ని ప్రాంతాలకు విస్తరించింది. ఏటా ఆషాఢ మాస తొలి ఆదివారం బోనాల జాతర గోల్కొండ కోటలోని జగదాంబిక ఆలయం(ఎల్లమ్మ)లో మొదలై, ఆ తరువాత ఒక్కొక్క ఆదివారం ఒక్కొక్క ప్రాంతంలో జరుగుతుంది. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి, లాల్‌దర్వాజలోని మహంకాళి ఆలయంలో, గన్‌ఫౌండ్రీలో నిర్వహిస్తారు. ఆషాఢంలో చివరిలో గోల్కొండ కోటలో జరిగే బోనం పూజతో జాతర పరిసమాప్తమవుతుంది. ఈ ప్రధాన ఆలయాలతో పాటు వాడవాడలా ఉన్న అమ్మవార్ల ఆలయాలలో ఎల్లమ్మ, పోచమ్మ, మైసమ్మ, మారమ్మ, పెద్దమ్మతల్లి, అంకాలమ్మ, రేణుకమ్మ, ముత్యాలమ్మలను కాళీమాత రూపాలుగా పూజిస్తూ బోనాలు సమర్పిస్తారు. ఘటోత్సవంగా వ్యవహరించే ఎదుర్కోలుతో బోనాలు ప్రారంభమవుతాయి. అమ్మవారికి 'సారె' సమర్పించేందుకు పసుపు నీటిలో వేపకొమ్మలను ఉంచి, ఆ పాత్రపై గండా దీపం ఉంచి ఆలయాలకు వెళతారు.

చారిత్రక ఆధారాలను బట్టి కాకతీయులు గోల్కొండ కోటను కట్టక ముందు యాదవ సామాజిక వర్గీయులు అక్కడ మేకలు, గొర్రెలు మేపేవారు. అప్పటికే అక్కడ గల ఆలయం (ఎల్లమ్మ)లో తరచూ బోనాలు సమర్పించేవారు. అనంతర కాలంలో



దేవదళన (సుభద్ర) అలంకరిస్తారు. దీనిని 'పహండి' అంటారు. పూరీ రాజు బంగారు చీపురుతో రథాలను శుభ్రపరచిన (చేరాపహారా) తర్వాత ప్రారంభయ్యే రథయాత్ర మూడు కిలోమీటర్ల దూరంలోని గుడించా (గుడించాయాత్ర) మందిరానికి చేరుతుంది. సంతానం లేని ఇంద్రద్యుమ్నుని పట్టమహిషి గుడించా దేవి జగన్నాథుడినే కుమారుడిగా అభిమానించింది, దైవంగా భావించింది. ప్రధాన ఆలయం సమీపంలో ఆయన కోసం మందిరం (గుడించా మందిరం) కట్టించింది. ఆమె భక్తికి మెచ్చిన స్వామి, గుండిచా దేవిని తల్లిగా మన్నించి, ఏడాదిలో కొద్దిరోజులు ఆమె దగ్గర ఉంటానని మాటిచ్చాడు. ఆ ప్రకారం ఆ మందిరానికి చేరడం ఈ యాత్ర ఉద్దేశంగా చెబుతారు. వారం రోజులు అక్కడ బస చేసి దశమి నాడు తిరుగు (బాహుదా యాత్ర) ప్రయాణమవు తాడు. తాళ్లతో కట్టిన ఈ రథాలను లాగేందుకు భక్తజనం ఆనందోత్సాహాలతో పోటీ పడతారు. అది పూర్వజన్మ సుకృతమని, రథం తాడును తాకినా పాపాలు హరిస్తాయని విశ్వసిస్తారు.

పూరీనాథుడు నైవేద్య ప్రియుడు. ఆయనకు పదుల కొద్దీ రకాల పదార్థాలను నివేదిస్తారు. అన్న ప్రసాదాన్ని కట్టెల పొయ్యిమీద మట్టి కుండలలోనే వండుతారు. కుండ మీద కుండపెట్టి వండడం, అన్నిటిలోని పదార్థం ఒకేలా ఉడకడం విశేషం. సాక్షాత్ శ్రీ మహాలక్ష్మి స్వయంగా వంటలను పర్యవేక్షిస్తారని, అందుకే అవి అంతభోగ్యంగా ఉంటాయని విశ్వాసం. వంటకు ఒకసారి వాడిన పాత్రను మరోసారి ఉపయోగించరు. స్వామికి నివేదించిన ప్రసాదాన్ని 'ఒబడా' అంటారు. దానిని వితరణ చేసే ప్రదేశం 'ఆనందబజార్'. శ్రీమహావిష్ణువు వేకువజామున రామేశ్వరంలోవ స్నానసంధ్యాదులు ముగించుకొని, బదరీనాథ్‌లో అల్పాహారం, పూరీలో మధ్యాహ్న భోజనం, ద్వారకలో రాత్రి విశ్రాంతి తీసుకుంటాడని ప్రతీతి. అందుకే పూరీలో ప్రసాదాన్ని స్వీకరించడం విశేషంగా పరిగణిస్తారు.

ఆలయ ప్రాకారాన్ని 'మేఘనాథ ప్రాకారం', గర్భాలయాన్ని 'విమాన మండపం', భక్తులు నిరీక్షించి, దర్శించుకొనే స్థలాన్ని 'జగమోహన్ మండపం', ధూపదీప హారతులిచ్చే చోటును 'భోగమండపం' అంటారు. ఆలయ శిఖరంపై ఎగురుతూ పతిత పావన పతాకాన్ని ప్రతి ఉదయం మార్చి, కొత్త ధ్వజాన్ని ఎగురవేస్తారు. శంకరభగవత్పాదులు, శ్రీమద్రామానుజులు, శ్రీపాదవల్లభులు, చైతన్య ప్రభువు, గురునానక్, జయదేవ కవీంద్రుడు, తులసీ దాస్, కబీరు లాంటి మహనీయులు ఈ క్షేత్రాన్ని సందర్శించారు. జయదేవుడు అష్టపదులను ఇక్కడే రాశాడు. స్వామి సదా తమ కళ్లెదుటే ఉండాలని కోరుతూ ఆదిశంకరులు 'జగన్నాథ స్వామి నయన పథగామీ భవతుమే' మకుటంతో జగన్నాథాష్టకంలో స్తుతించారు.

***'నీలాచల నివాసాయ నిత్యాయ పరమాత్మనే***
***సుభద్రా ప్రాణనాథాయ జగన్నాథాయ మంగళమ్!!***




**డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి**
**సీనియర్ జర్నలిస్ట్**


# వేళాయె...

నిర్మితమైన కోటను 'గొల్లకొండ'గా పిలిచారని, కాలక్రమంలో గోల్కొండగా వాడుకలోకి వచ్చిందని చెబుతారు. ఆ కోట ఆవరణలోని నల్లపోచమ్మ, ముత్యాలమ్మ ఆలయాలు నాడు నిర్మితమైనవే.

**బోనమంటే....**

అమ్మవారికి సమర్పించే నైవేద్యాన్నే బోనం అంటారు. ఇది భోజనం మాట నుంచి వచ్చిందని చెబుతారు. వర్షాకాలం ప్రారంభంలో అనారోగ్యాలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా కాపాడాలని అమ్మవారిని వేడుకుంటూ నైవేద్యం సమర్పిస్తారు. 1869 ప్రాంతంలో నేటి జంటనగరాల్లోని పలు ప్రాంతాలలో మలేరియా వ్యాధి ప్రబలి పెద్ద ఎత్తున ప్రాణ నష్టం జరిగింది. ప్రకృతిని ప్రసన్నం చేసుకొనే క్రమంలో నాటి నుంచి ఈ జాతరను మరింత భక్తిశ్రద్ధలతో ఆచరిస్తూ వస్తున్నారు.

బోనపు పాత్ర (కుండ) మానవ శరీరానికి ప్రతీకగా, అందులోని అన్నం జీవశక్తికి సంకేతంగా, దానిపై వెలిగే జ్యోతి మన ఆత్మశక్తికి ప్రతిఫలంగా పెద్దలు చెబుతారు. మట్టికుండలాంటి దేహాన్ని దైవశక్తికి బోనంగా సమర్పించడం ద్వారా అమ్మవారి అనుగ్రహం పొందవచ్చని విశ్వాసం. ప్రకృతి శక్తి వల్ల దక్కిన సస్యాలను, ధాన్యం, శాకాలను ఆ శక్తికే సమర్పించి కృతజ్ఞతలు తెలియచేయడమే బోనాల పండుగ పరమార్థమనీ చెబుతారు.

కొత్త కుండలో బియ్యం,బెల్లం, పాలు, పసుపు కలిపి వండేదే బోనం. బోనం కుండను సున్నం, కుంకుమ, వేపకొమ్మలతో అలంకరించి, దానిపై దీపం (గండాదీపం) వెలిగించి, ఆ కుండ(ల)ను మహిళలు శిరస్సున ధరించి మేళ తాళాలతో అమ్మవారిని దర్శించుకుంటారు. ఇలా బోనం తలకెత్తుకున్నవారిని అమ్మశక్తికి ప్రతీకగా భావించి, భక్తులు దారిపొడవున వారి పాదాలపై నీళ్లు పోస్తుంటారు. బోనం ఎత్తిన నాడు కాని మరునాడు కాని భక్తులు ఇళ్ల వద్ద అమ్మవారికి ఇష్టమైన పదార్థాలు తయారుచేసి బండిపై ఉంచి ఊరేగింపుగా తీసుకు వెళతారు. దీనినే 'ఫలహారం బండి'గా పిలుస్తారు. దానిని ఆలయం చుట్టూ తిప్పి అమ్మవారికి నైవేద్యం సమర్పించి కొంత ప్రసాదాన్ని ఇళ్లకు తెచ్చుకొని ఇరుగుపొరుగులకు పంచుకుంటారు.

బోనాల ముగింపు సందర్భంగా పోతురాజుల విన్యాసాలు ఆకర్షణగా నిలుస్తాయి. నుదుట కుంకుమ, కళ్లకు కాటుక, నోట్లో నిమ్మకాయలు, చేతులలో త్రిశూలం, కొరడా, కాళ్లకు గజ్జెలతో తప్పెట్లకు అనుగుణంగా విన్యాసాలు చేస్తారు. గుమ్మడి, సొరకాయలను వారు పళ్లెంలో ఎత్తి పట్టుకొని తిప్పుతూ బలి ఇస్తారు (పూర్వం జంతుబలులు ఉండేవి. వాటి నిషేధంతో 'కూష్మాండబలి'... అంటే గుమ్మడి, సొర కాయలను సమర్పిస్తున్నారు). పోతురాజు అమ్మవారికి సోదరుడని, అమ్మవారు ఊరిలో పూజలు అందుకుంటుండగా సోదరుడు ఊరి రక్షణ బాధ్యత వహిస్తాడని భక్తుల విశ్వాసం. జాతర సమయంలో పోతురాజు వేషధారిని అమ్మవారు ఆవహిస్తారని చెబుతారు. సోదరికి తీసుకువెళ్లే ఫలహారం బండ్ల ముందువీరంగం వేస్తూ కదులు తారు. బోనం మరునాడు పూనకం వచ్చిన మహిళలు ఆలయం ఎదుట భవిష్యవాణి చెబుతారు. దీనిని 'రంగం' అంటారు. మాతంగి దీక్షలో ఉన్న అవివాహిత అమ్మవారి ఎదుట పచ్చికుండపై నిలు చొని భవిష్యత్ పరిణామాలు, విశేషాలను జోస్యంలా చెబుతారు. సాక్షాత్తు అమ్మవారే వారితో చెప్పించి నట్లుగా భావిస్తారు. రంగం ముగిసిన తరువాత పోతురాజులు తాండవంతో ఆలయం చుట్టూ నాట్య విన్యాసాలతో ప్రదర్శనలిస్తారు. ★

రాష్ట్ర ప్రభుత్వం జూన్ 14న హైదరాబాద్ హైటెక్ సిటీలో అట్టహాసంగా నిర్వహించిన కార్యక్రమంలో 'తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డులు' పేరుతో పురస్కారాలు అందచేసింది. గత పదేళ్లలో విడుదలైన సినిమాలకు సంబంధించి అవార్డులను ప్రదానం చేసింది. అయితే దాదాపు నెల రోజుల క్రితం ఏర్పడిన అవార్డుల ఎంపిక కమిటీ ఈ స్వల్ప వ్యవధిలోనే..

పదేళ్లలో విడుదలైన సినిమాలన్నీ ఈ కమిటీ కేవలం నెల రోజుల వ్యవధిలో అవార్డుల చూసిందా? పరిశీలించిందా? అవార్డుల కోసం ఎన్ని ఎంట్రీలు వచ్చాయ్? వాటిలో ఎన్నింటిని పరిగణనలోకి తీసుకున్నారు? కొన్ని విభాగాల అవార్డులకు అసలు ఎంట్రీలు కూడా రాలేదన్నది వాస్తవమేనా? ఒకవేళ అదే నిజమైతే ఏ ప్రాతిపదికన ఎంపిక చేశారు? అవార్డులు పొందిన సినిమాల్లో కమిటీలోని పెద్దలు,

**తెలంగాణలో గత కొంత కాలంగా వివిధ అంశాల్లో చోటు చేసుకుంటున్న పరిణామాలు ఆశ్చర్య పరుస్తున్నాయి. అంతకుమించి ఆలోచనలు రేకెత్తిస్తున్నాయి. ప్రజాప్రతినిధి వర్గం ఏం చేస్తుందో!, అధికార యంత్రాంగం ఏం అనుసరి స్తుందో!, ప్రభుత్వం నియమించిన సంస్థలు, ఫెడరేషన్లు ఏ మార్గదర్శకాలను పాటిస్తున్నాయో.. అంతా గందరగోళంగా తయారవుతోంది. పర్యవేక్షణ, అజమాయిషీ లేని, వెనక ఉండి వ్యవస్థలు, పెద్దలు లేక పాలనా యంత్రాంగం అస్తవ్యస్తమైందనే అపవాదును ఎదుర్కొంటోంది.**



# ప్రహసనంగా సినిమా పురస్కారాల

ప్రతినిధులకు సంబంధించిన ఎన్ని సినిమాలు ఉన్నాయి? నైతికంగా ఇది సమంజసమేనా? దీనిని ప్రభుత్వం అంగీకరించవచ్చా? ప్రభుత్వ పెద్దలు కనీసం పర్యవేక్షణ చేశారా? ఏం జరుగుతుందన్న దానిపై ప్రభుత్వం నివేదికైనా తెప్పించుకుందా? ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానాలు ఇచ్చేవాళ్లు మాత్రం కరవయ్యారు. 'ఎవరికి వారే.. యమునా తీరే' అన్నట్లుగా ఈ అవార్డుల ప్రహసనం సాగిందన్న చర్చ ఇటు రాజకీయ వర్గాల్లో.. అటు సినీ వర్గాల్లో జోరుగా సాగుతోంది.

అవార్డు విజేతలను పక్కన పెట్టి అవార్డుల నామకరణం విషయానికి వస్తే... గద్దర్ లాంటి విప్లవకారుడి పేరుతో ఈ అవార్డును ఇవ్వడం ద్వారా సమాజానికి ఏం సందేశం ఇస్తున్నట్టుగా భావించాలి? గద్దర్‌కూ, సినిమాలకూ గల సంబంధం కూడా చాలా చాలా తక్కువ. ఆయన ఎప్పుడో 'మా భూమి' సినిమా కోసం 'బండెనక బండి కట్టి..' అనే పాట(అదీ బండి యాదగిరి రాసింది) పాడారు. ఆ తరువాత గూడ అంజయ్య 'రంగులకల' సినిమాకు రాసిన 'జమ్ జమ్మల మర్రి...' అనే పాట పాడారు. ఆ తర్వాత 'జై బోలో తెలంగాణ..'లో 'పొడుస్తున్న కాలమా...' అనే పాట ద్వారా సినిమా తెరపై కనిపించారు. ఒక రంగంలో ఒక వ్యక్తి పేరుమీద అవార్డు ప్రకటించారంటే, సదరు వ్యక్తి ఆ రంగానికి విశేష సేవలందించారని అర్థం. కానీ గద్దర్ సినిమా రంగానికి ఏ సేవలందించారో ఎన్ని పుస్తకాలు తిరగేసినా, ఎన్ని సినిమాలు చూసినా అర్థం కావడం లేదు. గతంలో తాను పాడిన పాటకు ప్రకటించిన అవార్డును తిరస్కరించిన గద్దర్‌కు సినిమా రంగంపై ఏం గౌరవం ఉన్నట్లు? అలాంటి వ్యక్తి పేరిట స్వయంగా ప్రభుత్వమే సినిమా అవార్డు ప్రకటించడం సమంజసమా? అసమంజసమా? అన్న చర్చ సమర్థనీయమే అంటున్నారు విశ్లేషకులు. దీనిపై ప్రభుత్వం సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉంది.

బెస్ట్ క్రిటిక్ అవార్డు కోసం అసలు ఎంట్రీయే రానందున ఆ విభాగానికి అవార్డు లేదని ప్రకటించిన కమిటీ, హఠాత్తుగా ఒక రోజు ముందు 'తోచిన వ్యక్తి'ని ఆ అవార్డుకు ప్రకటించడం సబబేనా? అన్న ప్రశ్నలు వస్తున్నాయి. అంటే ఎలాంటి అవగాహనతో పురస్కారాలను పంచుకున్నారో అర్థమవుతోందనే చర్చ కూడా నడుస్తోంది. మరోవైపు.. రెండో అధికార భాషగా ఉన్న ఉర్దూ సినిమాలకు కూడా అవార్డులు ప్రకటిస్తామన్న ప్రభుత్వం మాట నిలుపుకోలేదనే విమర్శ ఉంది. మరో అంశాన్ని చూస్తే.. 2024 సంవత్సరంలో తీసిన సినిమాలకు మాత్రమే ఎంట్రీలను ఆహ్వానించిన రాష్ట్ర చలనచిత్ర అభివృద్ధి సంస్థ (ఎఫ్‌డీసీ) 2014-2023 మధ్య కాలంలోని సినిమాలకు ఎంట్రీలను ఎందుకు సేకరించలేదు? ఎంట్రీలు లేకుండానే అన్ని సినిమాలను పరిశీలించామని చెప్పుకున్నా.. ఈ పదేళ్లలో విడుదలైన, సెన్సార్ అయిన దాదాపు 2వేల సినిమాలను ఒకే ఒక్క నెలలోనే ఎలా చూడగలిగారు? వాటిని ఎలా విశ్లేషించగలిగారు? విజేతలను ఏ ప్రాతిపదికన ఎంపిక చేశారు? దీనిని బట్టి, నచ్చిన వాళ్లకి, ఇష్టమైన వారికి అవార్డులను ఇచ్చుకున్నారనే ఆరోపణలకు ప్రభుత్వం ఏం సమాధానం చెబుతుంది? ఇది అన్యాయమని మొత్తుకుంటున్న వారికి ఎలా సర్దిచెబుతుంది?

ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భావం తర్వాత పదేళ్లలో సినిమాల్లో పనిచేసిన అన్ని విభాగాల కళాకారులకు, సాంకేతిక నిపుణులకు అవార్డులు ఎందుకు ఇవ్వలేదు? నిర్మాతలకే ప్రాధాన్యం ఇవ్వడం, పెట్టుబడిదారులకు ప్రభుత్వ సొమ్మును ధార పోయడం దేనికి సంకేతం? ఇందులోని మతలబు ఏమిటి? ఇంకో ప్రధానమైన అంశం చూస్తే.. కమిటీలోని వారికి సంబంధించిన వాళ్ల సినిమాలను ఎక్కువ సంఖ్యలో ఎంపిక చేయడాన్ని ఎలా సమర్థించుకుంటారు? సినిమాల్లో పనిచేసిన వాళ్లే జ్యూరీలో ఉండడం, వారి సినిమాలకు వారే అవార్డులు ఇచ్చుకోవడం అన్యాయం కాదా? నిబంధనలకు విరుద్ధం కాదా? అన్న ప్రశ్నలకు సమాధానం ఎవరు చెప్పాలి.

ఇక, అవార్డు విజేతలు కొందరు వాటిని అందుకునేందుకు ఉత్సవానికి రాలేదు. మరికొందరు తమ ప్రతినిధులను పంపారు. ఈ తీరు, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమాన్ని అవమానించినట్లు కాదా? ప్రభుత్వ పెద్దలకు ఇది

**గమనిక:** 16.6.2025 సంచికలోని 'ఫోన్ ట్యాపింగ్ హీట్ చల్లబడినట్లేనా?' వ్యాసంలో ఆ కేసులో ప్రధాన నిందితుడు ప్రభాకర్ ఫొటోకు బదులు అదే పేరు గల ఎమ్మెల్సీ ప్రభాకర్‌రావు ఫొటో పొరపాటున అచ్చయ్యింది. అందుకు చింతిస్తున్నాం.



# ప్రదానం

అవమానం కాదా? అవార్డుల స్వీకరణకు ప్రతినిధులను ప్రభుత్వం అంగీకరించడం తనను తక్కువ చేసుకున్నట్లు కాదా? రాష్ట్ర ప్రభుత్వం భారీ ఖర్చుతో నిర్వహించిన ఫిలిం అవార్డుల వేడుకలనకు హాజరయ్యేందుకు వెనుకడుగు వేసిన వాళ్లు.. రేపు తమ సినిమాలు విడుదలైనప్పుడు టికెట్ల రేట్లు పెంచాలని, ప్రోత్సాహకాలు ఇవ్వాలంటూ ప్రభుత్వం ముందు క్యూలు కడతారా? ప్రభుత్వ పెద్దలు ఏదో ఓ ఒత్తిడికి తలొగ్గి సినిమావాళ్ల ఆడించినట్లు ఆడబోరన్న నమ్మకం ఉందా? అంటే.. రాష్ట్ర ప్రభుత్వం సుప్రీమా? ఆ ప్రభుత్వాన్ని నడిపిస్తున్న ముఖ్యమంత్రి సుప్రీమా? లేదంటే.. రంగుల సినిమాలు నిర్మించే ఒక వర్గం సుప్రీమా? అన్నది తెలంగాణ సమాజంలోని వారి మనసులనూ తొలచి వేస్తోంది.

సుమారు ఆరునెలల క్రితం హైదరాబాద్ సంధ్య థియేటర్‌లో పుష్ప-2 సినిమా బెనిఫిట్ షో ప్రదర్శిత సమయంలో జరిగిన తొక్కిసలాటలో ఓ మహిళ ప్రాణాలు కోల్పోగా, కోమాలోకి వెళ్లిన ఆమె కుమారుడు ఇప్పటికీ సరిగా కోలుకోలేదు. ఆ సంఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కన్నెర్ర జేశారు. ప్రజల ప్రాణాలే ప్రభుత్వానికి ముఖ్యమని, ప్రజాభద్రత విషయంలో ఎవరికీ మినహాయింపు ఉండబోదని, ఎవరినీ వదిలిపెట్టేది లేదని శాసనసభలో ప్రకటించారు. తొక్కసలాట సంఘటనలో ఎ-1 ఉన్న నటుడు అల్లు అర్జున్‌పై కేసు నమోదు చేశారు. నిందితుడిగా జైలుకు పంపించారు. ముఖ్యమంత్రి నాటి నిర్ణయాన్ని ప్రజలందరూ, మేధావులు, విద్యావేత్తలందరూ, న్యూట్రల్‌గా ఉండేవాళ్లందరూ ప్రభుత్వం, ప్రత్యేకించి ముఖ్యమంత్రి ఆలోచనా శైలిని అభినందించారు. అంతలోనే కథ మలుపు తిరిగింది. రాష్ట్ర ప్రభుత్వం అల్లు అర్జున్‌కు ఉత్తమ నటుడి అవార్డు అందజేసింది. అదే సినిమా మొదటి భాగం జాతీయ అవార్డుకు ఎంపికైనప్పుడు, స్మగ్లింగ్ ఇతివృత్తం గల ఆ సినిమాకు అవార్డా? అని మంత్రి అనసూయ సీతక్క మీడియా ముందు ఆగ్రహావేశాలు వెళ్లగక్కారు. 'ఒక స్మగ్లర్ పాత్ర పోషించిన వాళ్లకు అవార్డులు ఎలా ఇస్తారు? ప్రభుత్వ యంత్రాంగంలో కీలక పాత్ర పోషించే వ్యవస్థనే కించపరిచేలా వ్యవహరించిన, అశ్లీల అంశాల్లోనూ నిమగ్నమైన ఓ స్మగ్లర్ పాత్రకు అవార్డులు ఇవ్వడం ఎక్కడి సంస్కృతి' అని మండిపడ్డారు. మరి.. ఇప్పుడు సాక్షాత్తూ అదే ప్రభుత్వం అవార్డు అందజేసింది. అంటే.. ప్రభుత్వం యువతకు ఏం సంకేతాలు ఇస్తోంది? ఎలాంటి ఆదర్శాలు ప్రోత్సహిస్తోంది? ఇలాంటి నిర్ణయాలతో యువతకు ఎలా దిశానిర్దేశం చేస్తోంది? ఇది అక్రమాలను, దుర్మార్గాలను, అవినీతిని, స్మగ్లింగ్‌ను ప్రేరేపించినట్లు కాదా? నేరప్రవృత్తిని ప్రోత్సహించినట్లు కాదా? దీనికి ప్రభుత్వం ఏం సమాధానం చెబుతుంది? మంత్రి సీతక్క ఎలా రియాక్ట్ అవుతారు? ప్రభుత్వాన్ని నడిపిస్తున్న వాళ్లకు, సహచర మంత్రులకు, అధికార యంత్రాంగానికి, ఫిలిం కార్పొరేషన్‌కు మధ్య అసలు సమన్వయమే లేదన్న అంశం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. ఈ ఒక్క అంశంలోనే కాదు.. అనేక అంశాల్లో తెలంగాణ ప్రభుత్వం దిగదుడుపుగా వ్యవహరిస్తోందన్న విమర్శలు కూడా పెద్ద ఎత్తున వస్తున్నాయి.

మరో అంశం... ఈ సినిమా అవార్డుల ఉత్సవాలను నిర్వహించడానికి మూడు రోజుల ముందు.. సింగర్ మంగ్లీ తన బర్త్‌డే పార్టీని హైదరాబాద్ శివార్లలోని ఓ ఫామ్‌హౌజ్‌లో ఘనంగా ఏర్పాటు చేసింది. అయితే, ఈ పార్టీకి అనుమతి లేకపోవడమే కాక అర్ధరాత్రి దాటి తెల్లవారు జాముదాకా డీజేల మోతలు, మద్యం పార్టీల కిక్‌లు ఆగకపోవడంతో పోలీసులు ఈ ఫామ్‌హౌజ్‌పై దాడి చేశారు. అక్కడి దృశ్యాలన్నీ రికార్డ్ చేశారు. మద్యం, విదేశీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ పరీక్షల్లో ఒకరికి పాజిటివ్ వచ్చిందని పోలీసులే స్వయంగా ప్రకటించారు. అయితే, అనుమతి తీసుకోవాలన్న విషయం తనకు తెలియదని సింగర్ మంగ్లీ వీడియో విడుదల చేశారు. సరే.. మంగ్లీకి విషయం తెలియక పోవచ్చు. కానీ,ఈవెంట్ ఆర్గనైజర్లకైనా తెలిసే ఉండాలి కదా.. ఇంత పెద్ద పార్టీ పెట్టుకుంటున్నప్పుడు ఏ విభాగం నుంచి ఏయే అనుమతులు తీసుకోవాలో నిర్వాహకులకు చెప్పాలి. ఈవెంట్ ఆర్గనైజర్లు అనుమతుల గురించి చెప్పలేదని అనుకోలేం. తాను సెలబ్రిటీనని, మరో రెండు రోజుల్లో ప్రభుత్వమే నిర్వహిస్తోన్న అవార్డు ప్రదానోత్సవ వేదికపై మెరిసి పోబోతున్నానన్న ధీమాతో అనుమతులు అవసరం లేదని భావించి ఉండవచ్చు. ఆ ప్రకారమే అవార్డుల వేడుక మొత్తం తానే అన్నట్లుగా గంటలకొద్దీ వేదికను సొంతం చేసుకుంది. తాను తప్ప మరెవరూ లేరన్నట్లు హల్‌చల్ చేసింది. ఈ పరిణామాలన్నీ సవాలక్ష ప్రశ్నలకు కారణమవుతున్నాయి. అసలు రాష్ట్రం ఎటు వెళుతోంది? పాలన ఎలా సాగుతోంది? లాంటి సందేహాలు చుట్టుముడుతున్నాయి. ప్రభుత్వం నిర్వహించిన ఒక్క ఫిలిం అవార్డుల కార్యక్రమంలోనే ఇన్ని విభిన్న, వివాదాస్పద, విమర్శలకు దారితీసే అంశాలు, పరిణామాలు ఉంటే.. అసలు ప్రభుత్వ పాలనలో ఎంత గందరగోళం నెలకొందో అనే సందేహాలు కలగక మానవు.

**సుజాత గోపగోని**
**సీనియర్ జర్నలిస్ట్, 6302164068**



కొల్లేరు అభయారణ్య ఆక్రమణలు, పర్యావరణానికి విఘాతం, ప్రజల ఇబ్బందులు, జిరాయితీ, డీఫాం భూముల అంశాలపై సుప్రీంకోర్టులో పిటీషన్లు దాఖలైన నేపథ్యంలో కేంద్ర సాధికారత కమిటీ (సీఈసీ) అతి త్వరలో పర్యటించనుంది. సీఈసీ కమిటీ సభ్యులు జి.భానుమతి, చంద్రప్రకాష్ గోయల్, సునీల్ లిమాయే, డాక్టర్ జైవర్ధన్ రమన్లాల్ భట్లు కొల్లేరు ప్రాంతాల్లో అధ్యయనం చేస్తారు. ఈ బృందం ముందుగా విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో భేటీ అవుతుంది. ఈ బృందం మండవల్లి, కైకలూరు. మండలాల్లో రెండు రోజుల పాటు పర్యటిస్తుంది. కైకలూరు మండలం పందిరిపల్లి గూడెం వద్ద బహిరంగ సభలో పాల్గొంటుంది.



# కొల్లేరు పరిశీలనకు కేంద్ర

ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాలలోని సహజ సిద్ధమైన మంచి నీటి సరస్సు–కొల్లేరు. లక్షకుపైగా ఎకరాల్లో వ్యాపించి ఉన్న ఈ సరస్సు, ప్రకృతి అందాలకు, అరుదైన వలస పక్షులకు ఆలవాలం. సరస్సు మధ్యలో 122 లంకలున్నాయి. 61 రకాల చేపలకు, 17 రకాల రొయ్యలకు కొల్లేరు నిలయం. ఇక్కడకు వలస వచ్చే పక్షులలో ముఖ్యమైనవి పరజ, పురాజము, నులుగు పిట్ట. సైబీరియా నుండి గ్రేట్ పెలికాన్ వంటి మొత్తం 189 రకాల పక్షులు వలసవస్తూ ఉంటాయి. గోదావరి, కృష్ణా నదుల డెల్టా ప్రాంతంలో సహజసిద్ధమైన లోతట్టు ప్రాంతంలో ఈ సరస్సు ఏర్పడింది. ఈ సరస్సుకు బుడమేరు, తమ్మిలేరు, రామిలేరు, గుండేరు నుండే కాక డెల్టా ప్రాంతం నుండి వచ్చే అనేక కాలువలు నీటిని చేరుస్తున్నాయి. కోల్లేరు నుండి నీరు ఉప్పుటేరు అనే 62 కిలోమీటర్ల పొడవున్న ఒకే వాగు ద్వారా బయటికి వెలుతుంది. సరస్సుకు ఆగ్నేయాన ఉన్న ఈ వాగు ద్వారా నీరు బంగాళాఖాతం చేరుతుంది.

కొల్లేటి సరస్సు 250 నుండి 340 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. సరాసరి లోతు 0.5 నుండి 2 మీటర్ల దాకా ఉంది. ఇక్కడ కొల్లేరు పక్షుల సంరక్షణ కేంద్రం ఉంది. ఈ అభయారణ్యంలోని ప్రధాన వృక్షజాలం ఫ్రాగ్మిట్స్ కర్కా, 10 అడుగుల ఎత్తు వరకు పెరిగే కలుపు మొక్క. ఇది కొన్ని జాతుల పక్షులకు ఆశ్రయం కల్పిస్తుంది. జల వృక్షసంపదలో నిమ్ఫెయే నౌచాలి, నైఫోయిడ్స్ ఇండికమ్, ఒట్టెలియా అలిస్మోయిడ్స్, నెచమంద్ర ఆల్టర్నిఫోలియా, లిమ్నోఫిలా ఇండికా, వల్లిస్నేరియా స్పైరాలిస్, బ్లైక్సా ఆక్టాండ్రా, ఇపోమియా ఆక్వాటికాస్, ఆర్టిక్ స్కులాటికాస్ వంటి జాతులు ఉన్నాయి. జెర్మినటం, టైఫా అంగుస్టాటా, ఫ్రాగ్మిట్స్ కర్కా అనేది అరుదైన వృక్షాలు.

**కాంటూర్ వివాదం**

సముద్ర మట్టానికి సమాన ఎత్తులో (సగటున సముద్ర మట్టం) పాయింట్లను కలుపుతూ మ్యాప్‌లో గీసిన రేఖలను కాంటూర్లు అంటారు. గతంలో, వర్షాకాలంలో సరస్సులో నీటిమట్టం కాంటూర్ 7,10 మధ్య ఉండేది. ఎండాకాలంలో కాంటూర్ 3కి పడిపోయింది. కాంటూర్ 3లోని వైశాల్యం 135 చదరపు కిలోమీటర్లు, కాంటూర్ 10 లోని వైశాల్యం 901 చదరపు కిలోమీటర్లు.

**ప్రకృతి విధ్వంసం**

ఇంతటి విశిష్టమైన కొల్లేరు కబ్జాదారుల కోరల్లో చిక్కుకుంది. కొల్లేరును ఆక్రమించి చేపల చెరువులు తవ్వడం విచ్చలవిడిగా సాగిస్తున్నారు. మొత్తం 15,742 ఎకరాల్లో చేపల చెరువుల ఆక్రమణలు ఏర్పడ్డాయి. అంతర్జాతీయ ప్రాముఖ్యం ఉన్న ఈ సరస్సు అదృశ్యమవుతున్నా అధికారులు, ప్రభుత్వాలు పట్టించుకోవడడం లేదు. అంతేకాదు మురుగు కూడా చేరి సరస్సు స్వరూపం కాలుష్య కాసారంగా మారుతోంది. గ్రేట్ పెలికాన్ వంటి 189 రకాల పక్షులు, 61 రకాల ప్రత్యేక మత్స్యజాతులు, 17 రకాల రొయ్యలకు, నీటి సంబంధమైన 17 వృక్షజాలాలకు కొల్లేరు నెలవన్న పేరున్నా ఆక్వాకల్చర్ అదంతా విధ్వంసం చేస్తోంది. 15 రకాల అరుదైన చేపల జాతులు ఇప్పటికే అంతరించిపోయాయి. ఏలూరులో రెండేళ్ల కిందట సంభవించిన వింతవ్యాధికి కొల్లేరు ఆక్వాసాగులో వాడుతున్న విష పదార్థాలే కారణమని జాతీయ హరిత ట్రైబ్యునల్‌లో కేసు నమోదైంది. ఆ నేపథ్యంలోనే జాతీయ హరిత ట్రైబ్యునల్ ఆదేశాల మేరకే తాజా కొల్లేరు ఆక్రమణల అంశం అధికారికంగా వెలుగుచూసింది.

**గ్రేట్ పెలికాన్ వంటి 189 రకాల పక్షులు, 61 రకాల ప్రత్యేక మత్స్యజాతులు, 17 రకాల రొయ్యలకు, నీటి సంబంధమైన 17 వృక్షజాలాలకు కొల్లేరు నెలవన్న పేరున్నా ఆక్వాకల్చర్ అదంతా విధ్వంసం చేస్తోంది. 15 రకాల అరుదైన చేపల జాతులు ఇప్పటికే అంతరించిపోయాయి.**

**సుప్రీంకు పర్యావరణవేత్తలు**

కొల్లేరు అక్రమ తవ్వకాలతో పక్షులు, వన్యప్రాణుల ఆవాసాలకు ప్రమాదం ఏర్పడుతోందని పర్యావరణవేత్తలు ఇరవై ఏళ్ల కిందటే సుప్రీంకోర్టుని ఆశ్రయించారు. దీంతో 2006లో సుప్రీంకోర్టు సాధికార కమిటీని నియమించింది. ఆ సాధికార కమిటీ కొల్లేరు సరస్సు ఆక్రమణలను స్వయంగా పరిశీలించింది. అప్పట్లో కొల్లేరు సరస్సులో దాదాపు 50వేల ఎకరాల్లో ప్రభుత్వ, జిరాయితీ, డి.ఫాం భూముల్లో చట్టానికి విరుద్ధంగా సాగుతున్న చేపల చెరువులను బాంబులు పెట్టి ధ్వంసం చేశారు. ఆపరేషన్ కొల్లేరు పేరుతో ఆక్రమణలను ధ్వంసం చేసి మళ్లీ కొల్లేరు మంచినీటి సరస్సును పునరుద్ధరించాలనే ఉద్దేశంతో ఆ కార్యక్రమం



# సాధికారత కమిటీ

చేపట్టారు. 5 కాంటూరులోపు ఉన్న ప్రాంతమంతటినీ కొల్లేరు అభయారణ్యంగా రక్షించాలని జీవో 120 ప్రకారం ఉత్తర్వులు ఇచ్చారు. సుప్రీంకోర్టు దీన్ని ఖరారు చేసింది. ఈ పరిధిలో 83,982.70 ఎకరాల భూమి ఉందని ప్రభుత్వం గుర్తించింది. అక్కడ ఏ ప్రభుత్వ, ప్రైవేటు, డి.ఫాం భూముల్లో చేపల చెరువులు తవ్వకూడదు. కొల్లేరును సంరక్షించాల్సిన బాధ్యత అటవీశాఖదే అని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

**15,742 ఎకరాల్లో మళ్లీ చెరువులు**

సాక్షాత్తూ సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని చర్యలు చేపట్టిన తర్వాత కూడా కొల్లేటిని కాపాడలేక పోతున్నారు. కొల్లేరు అభయారణ్యం పరిధిలో 2006 తర్వాత 2022 వరకు 15,742 ఎకరాల్లో మళ్లీ కొత్తగా చేపల చెరువులు తవ్వారని ప్రభుత్వం గుర్తించింది. అందులో 11,867 ఎకరాలు ప్రభుత్వ భూమి అని చెప్పింది. దీంతో కొల్లేరును ఆక్రమణల నుంచి రక్షించాలని కోరుతూ మళ్లీ పర్యావరణవేత్తలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కొల్లేరు పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, సరస్సులో సహజ నీటి ప్రవాహాన్ని అడ్డుకొని, వన్యప్రాణుల మనుగడకు ప్రమాదకరంగా మారిన ఆక్రమణలను తొలగించడంతో పాటు అవి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. మత్స్యకారుల జీవనోపాధికి ఎలాంటి అడ్డంకులు ఉండబోవనే విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించింది. చుట్టుపక్కల పరిశ్రమలు, పట్టణాలు, గ్రామాల నుంచి వచ్చే మురుగునీటిని, వ్యర్థాలను కొల్లేరులోకి వదలకుండా అడ్డుకట్ట వేయాలని స్పష్టం చేసింది. గతేడాది డిసెంబరు 11న జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, మూడు నెలల్లోపు కొల్లేరు సరిహద్దులను ఖరారు చేయాలని కూడ నిర్దేశించింది. ఇంకా ఈ కేసు విచారణలోనే ఉంది.

**ప్రజాప్రతినిధుల అండతో కబ్జాలు**

ఉమ్మడి పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలకు విస్తరించి ఉన్న కొల్లేరు సరస్సు అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తోంది. కొల్లేరువాసుల పేరుతో బయటి వ్యక్తులు వేల ఎకరాల ప్రభుత్వ భూమిని, సరస్సు ప్రాంతాన్ని ఆక్రమించి భారీ ఎత్తున చేపల, రొయ్యల చెరువుల వ్యాపారం సాగిస్తున్నారు. రూ. కోట్లాది విలువైన ఈ వ్యాపారంలో రాజకీయ నాయకులు, అధికారులు, స్థానికులకు వాటాలు అందుతున్నాయనేది బహిరంగ రహస్యం. ప్రస్తుతం అధికారంలో ఎవరు ఉన్నా, కొందరు ఎమ్మెల్యేలు ఈ కొల్లేరు కబ్జాలకు అండగా నిలుస్తున్నారని తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొత్త చెరువుల తవ్వకాలను ప్రోత్సహించడంలోనూ, అధికారులు జోక్యం చేసుకోకుండా ఒత్తిడి తేవడంలోనూ ప్రజా ప్రతినిధులు తమ ప్రభావాన్ని చూపించడం పరిపాటి. ఈ అక్రమ లీజుల ద్వారా వస్తున్న సొమ్ములో ప్రజాప్రతినిధులు, అధికారులు, కొంతమంది స్థానికులకు వాటాలు వెళ్తుండగా, మిగిలిన మొత్తాన్ని గ్రామాల ప్రజలు పంచుకుంటున్నారు. రెవెన్యూ అధికారులు కొందరు ప్రయోజనాలు పొందుతున్నప్పటికీ, కొల్లేరులో తమ పాత్ర లేదని, అటవీ శాఖదే బాధ్యత అని పేర్కొంటున్నారు. అయితే అటవీ శాఖ అధికారుల పైనా విమర్శలు ఉన్నాయి. వారు కేవలం నామమాత్రపు కేసులు పెడుతున్నారే తప్ప, ఆక్రమణలను పూర్తిగా తొలగించడంలో విఫలమవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. చెరువు గట్టును కొద్దిగా ధ్వంసం చేయడం, వాహనాలను సీజ్ చేసి కేసు పెట్టడం వంటి చర్యలకే అటవీ శాఖ పరిమితమవుతోంది. ఆ తర్వాత కొద్దిరోజుల్లోనే ఆ గట్లు తిరిగి పూడ్చుకుని యథేచ్ఛగా చెరువులు సాగు చేసుకుంటున్నా ఎవరూ అడ్డుకునే పరిస్థితి లేదని సమాచారం. ఈ పరిస్థితి కొల్లేరు పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగిస్తుందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**వాస్తవాలు గుర్తించేందుకు పర్యటన**

ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీఈసీ (సెంట్రల్ ఎన్విరాన్మెంట్ కమిటీ) ఈనెల 17, 18 తేదీల్లో కొల్లేరు గ్రామాల్లో పర్యటించి ఇక్కడి స్థితిగతులపై అధ్యయనం చేయనుంది. పక్షులే కాదు లక్షలాది మంది మత్స్యకారులు, రైతుల జీవనోపాధి ప్రశ్నార్థకంగా మారిందని దేశ అత్యున్నత న్యాయస్థానం గుర్తించిన కారణంగా ఈ ప్రాంతాన్ని ఏళ్ల తరబడి నివాసం ఉంటున్న మత్స్యకారుల్ని కూడా ఈ కమిటి కలవనుంది. దీంతో మత్స్యకారులు కూడా తమ సమస్యలను కమిటి దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నారు.

ఇటీవల కైకలూరు వేదికగా చేపల రైతులు– కొల్లేరు ఐక్య వేదిక ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. 122 గ్రామాల నుంచి కొల్లేరు పెద్దలు, ప్రజాప్రతినిధులు, రైతు, మత్స్యకార సంఘాలు, ప్రజలు భారీ సంఖ్యలో హాజరై ఏకరవు పెట్టారు. కమిటి ముందు కొన్ని అంశాలను ఉంచనున్నారు. ఈ బృందం నిడమర్రు మండలం తోకలపల్లి, భైనేపల్లి, ఆకివీడు మండలం సిద్దాపురం ప్రాంతాల్లో కొల్లేరును పరిశీలిస్తుంది. కొల్లేరులో 122 పరీవాహక గ్రామాలు ఉండగా.. మౌలిక వసతులు, శ్మశానాలకు భూములు, తాగునీటి చెరువులు, మట్టి పూడికలు వంటి అంశాలను సీఈసీకి వినతుల రూపంలో అందించేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. కొల్లేరు అభయారణ్యం 77,135 ఎకరాల్లో జిరాయితీ, డీఫాం పట్టా భూములు దాదాపు 20 వేల ఎకరాలు మినహాయించాలనే ప్రధాన డిమాండును సీఈసీ ముందు ఉంచనున్నారు. అటవీ నిబంధనలు కఠినంగా ఉన్నాయని, వాటిని సవరించి ప్రజల అవసరాలకు అనుగుణంగా మార్పు చేయాలని కోరనున్నారు.

సుకుమార్ కమిటీ సూచించినట్లుగా జిరాయితీలు 'డి' పట్టాల భూములను రైతులకు కేటాయించాలి. పక్షులకు, పర్యావరణానికి రక్షణ కల్పిస్తూనే.. వందల ఏళ్లుగా జీవిస్తున్న ప్రజలకు జీవనోపాధిని చూపించాలి. అటవీ నిబంధనలు సడలించి తాగునీరు, రోడ్లు, శ్మశానవాటికల అభివృద్ధి, ఇతర మౌలిక వసతులు కల్పించాలి. కొల్లేరు పరీవాహకంలోని 10 కిలోమీటర్ల మేర ఎకో సెన్సిటివ్ జోన్ అమలుతో చిన్న పరిశ్రమలు ఏర్పాటుకు వీల్లేదు. దీనివల్ల ప్రజలు ఉపాధి కోసం వలసల బాట పట్టాల్సి వస్తుంది.



**తురగా నాగభూషణం**
సీనియర్ జర్నలిస్ట్

# రైల్వేశాఖ నిర్వాకం





అశ్విని వైష్ణవ్

ప్రభుత్వం ఏ పార్టీ చేతుల్లో అయినా ఉండవచ్చు. కానీ దేశం అందరిది. దేశ భద్రత అందరి సమష్టి బాధ్యత అన్న ఇంగిత జ్ఞానం నశించిపోతోంది. దేశంలో కొన్ని పార్టీల కార్మిక సంఘాలు ఇలాంటి స్పృహ కోల్పోతున్నాయని అనిపిస్తుంది. ఈశాన్య రాష్ట్రం త్రిపుర నుంచి, కశ్మీర్‌కు విధి నిర్వహణ కోసం వెళుతున్న సరిహద్దు భద్రతా దళం కోసం ఏర్పాటు చేసిన ఒక రైలును చూసినప్పుడు ఎంతో బాధ కలుగుతుంది. త్వరలో ప్రారంభం కాబోయే అమరనాథ్ యాత్రకు భద్రత కల్పించ డానికి వీరిని నియమించారు. అంత దూరం ప్రయాణానికీ, అందునా పారా మిలటరీ వెళ్లడానికి ఏమాత్రం సరిపోయేటట్టు లేని రైలును అధికారులు ఉపయోగించారు. బోగీలన్నీ తీవ్రమైన దుస్థితిలో ఉన్నాయి. ఈ రైలులో ప్రయాణించడానికి బీఎస్ఎఫ్ జవాన్లు నిరాకరించారు. మొత్తం 1200 మంది జవాన్లు వెళ్లవలసి ఉంది. వీరు వెంటనే రైల్వే శాఖకు లేఖ ద్వారా ఈ విషయం తెలియచేశారు. ఈ విషయం మీద ఫిర్యాదు చేసిన తరువాత రైలును మార్చారని కూడా బీఎస్ఎఫ్ తెలియచేసింది. అగర్తలా నుంచి పూర్తి సౌకర్యాలు ఉన్న, భద్రతదళాల మర్యాదకు తగ్గట్టు మరొక రైలును ఏర్పాటు చేశారు.

దీని మీద రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కఠిన చర్యలు తీసుకున్నారు. అలీపూర్దౌర్ డివిజన్‌కు చెందిన నలుగురు ఉన్నతాధికారులను వెంటనే సస్పెండ్ చేశారు. ఇంత నిర్లక్ష్యంగా ప్రవర్తించినందుకు అధికారుల మీద జూన్ 11నే చర్యలు

# పూరీలో స్నానయాత్ర



ఒడిశాలోని పూరీలో స్నాన పూర్ణిమ లేదా దేవస్నాన పూర్ణిమను వీక్షించడానికి లక్షలాదిగా భక్తులు జూన్ 11న జగన్నాథస్వామి దేవస్థానానికి చేరుకున్నారు. ఇది జూన్ 27 నుంచి ఆరంభమయ్యే రథయాత్రకు నాంది పలుకుతుంది. స్నానయాత్రలో భాగంగా సేవకులు గర్భగుడిలోని జగన్నాథ స్వామి, బలభద్రస్వామి, సుభద్రాదేవి విగ్రహాలను స్నాన వేది అనే స్నానవేదిక వద్దకు ఊరేగింపుగా తీసుకొని వచ్చారు. ఊరేగింపును పహండి బిజే అని అంటారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు సంప్రదాయ సంగీత పరికరాలైన శంఖం లాంటి వాటిని మోగించారు. ఆ తర్వాత దేవస్థానంలో బంగారు బావి నుంచి 108 బిందెల నీరు తీసుకొనివచ్చి దేవతామూర్తులకు పవిత్రస్నానం చేయించారు. అనంతరం గజానన బేష లేదా హాథీ బేష అని పిలిచే ఏనుగు ముసుగులతో విగ్రహాలను అలంకరించారు. ఏనుగు ముసుగులు అలంకరించుకున్న దేవతామూర్తులను అనసరగృహ అనే ఏకాంత మందిరంలో ఉంచారు. స్నానం కారణంగా

# వందేభారత్ రైలులో వైష్ణోదేవి



జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, పాలక నేషనల్ కాన్ఫరెన్స్–ఎన్‌సీ పార్టీ అధ్యక్షుడు ఫరూఖ్ అబ్దుల్లా భావోద్వేగానికి గురయ్యారు. ఆనందంతో కంట తడిపెట్టారు. 87 ఏళ్ల వయస్సున్న ఆయన అంతలా ప్రవర్తించడానికి కారణం.. వందేభారత్ రైలు. యావత్ భారతదేశాన్ని కశ్మీర్‌తో అనుసంధానం చేసే వందేభారత్ రైలును ఫరూఖ్ అబ్దుల్లా తొలిసారిగా జూన్ 11న ఎక్కారు. ఆ రైలు శ్రీనగర్, కాత్రా పట్టణాల మధ్య రాకపోకలు సాగిస్తుంది. కాత్రాలో రైలు దిగిన ఆయన తన మనవళ్లు జామిర్, జాహిద్‌లతో కలిసి మూడు కి.మీ.లు నడిచి మాతా వైష్ణో దేవి దేవస్థానానికి చేరుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మూడు సార్లు దేవీ దర్శనం చేసుకున్నారు. అక్కడే రాత్రి నిద్ర చేశారు.

అమ్మవారి సన్నిధిలో గడపడం చాలా ఆనందంగా ఉందని మాజీ సీఎం అన్నారు. జమ్ముకశ్మీర్‌కు వందేభారత్ రైలు రాకతో లోయలో పెను మార్పునకు

తీసుకున్నట్టు కేంద్ర మంత్రిమండలి సమావేశంలో వైష్ణవ్ ప్రకటించారు. సస్పెండయిన వారిలో కోచ్ డిపో అధికారి, ముగ్గురు సెక్షన్ ఇంజనీర్లు ఉన్నారు. ఈ వివాదం మీద రైల్వేమంత్రి వెంటనే దర్యాప్తునకు ఆదేశించారు. ఇలాంటి లోపాలు భవిష్యత్తులో జరగకుండా చూడాలని కూడా ఆదేశించారు. భద్రతా బలగాలకు సౌకర్యంతో పాటు, వారి గౌరవాన్ని కాపాడే విధంగా ఉండాలని, వాటికి తాము అత్యున్నత ప్రాధాన్యం ఇస్తామని మంత్రి వెల్లడించారు. ఇంత ఇంగిత జ్ఞానం లేని అధికారులను రైల్వేశాఖ ఎలా భరిస్తున్నది. ఎందుకు భరిస్తున్నది. ఈ రైలుకు ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది? దేశం పరువు ప్రతిష్టలు ఏం కావాలి? కేంద్ర ప్రభుత్వం ఏమని సమాధానం ఇవ్వగలుగు తుంది? ఇలాంటి పరిస్థితి కల్పించాలన్నదే ఆ కొద్దిమంది అధికారుల ఉద్దేశమే అయితే తగిన చర్యలు తీసుకోవలసిందే.

జ్వరంతో బాధపడుతున్న ముగ్గురు దేవతలు అందరికీ దూరంగా ఏకాంతంలో ఉండిపోతారు. దైత, పైత సేవకులను మాత్రమే వారి దగ్గరకు అనుమతిస్తారు. ముగ్గురు దేవతలు 14 రోజుల తర్వాత కొత్త అవతారంలో దర్శనమిస్తారు. అలా దర్శనం ఇవ్వడాన్నే నబ జౌబన దర్శన అని అంటారు. స్నాన పూర్ణిమను పురస్కరించుకొని ఒడిశా ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝీ పూరీలో జగన్నాథ స్వామిని సందర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. రానున్న రథయాత్ర కోసమని రథం నిర్మాణ పనులను తనిఖీ చేశారు. స్నాన పూర్ణిమను పురస్కరించుకొని పూరీ పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటన లకు తావులేకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. 70 ప్లాటూన్ల పోలీసు బలగాలు, అధికా రులు స్నానయాత్రకు ఎలాంటి ఆటంకం రాకుండా చూసుకున్నారు.

## దర్శనానికి

దారి తీస్తుంది. పర్యాటక రంగం, ఉద్యానవన రంగం లబ్ధి పొందుతాయి. ఆర్థికంగా అభివృద్ధి చోటు చేసుకుంది అని తెలిపారు. గతంలో జమ్ము-శ్రీనగర్ జాతీయ రహదారి మూతపడిన ప్రతిసారీ విమానం టికెట్ ధరలకు రెక్కలు వచ్చేవి అని చెప్పారు. రైలు సేవలతో యాత్రికులకు, స్థానిక ప్రజలకు రవాణ విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవనే ఆశాభావాన్ని ఫరూఖ్ అబ్దుల్లా వ్యక్తం చేశారు. ఆయన కాట్రా నుంచి శ్రీనగర్‌కు తిరిగి వందేభారత్ రైలులోనే చేరుకోవడం విశేషం.




# వామపక్షాల భారత వ్యతిరేకతకు మరొక నిదర్శనం

వామపక్షాలకు భారత వ్యతిరేకత, మైనారిటీల హక్కుల రక్షణ పేరుతో హిందూ ద్వేషం నిరంతరం బయటపెడుతూనే ఉంటాయి. ఇటీవల శ్రీనగర్‌లోని టాగోర్ హాలులో సీపీఎం ఒకరోజు గోష్ఠి నిర్వహిం చింది. హాలంతా లాల్ సలామ్ నినాదాలంతో మారు మోగడమే కాదు. ఆర్టికల్ 370ని పునరుద్ధరించాలని, పాకిస్తాన్‌తో చర్చల ప్రక్రియ ప్రారంభించాలని కూడా సభ్యులు గొంతు చించుకున్నారు. ఈ సమావేశానికి ఒక విధంగా ప్రాధాన్యం ఏర్పడింది. కశ్మీర్ లోయలోని చాలా ప్రాంతీయ పార్టీలు ఇప్పుడు జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించడం కంటే రాష్ట్ర హోదా కల్పించాలని కోరుతున్న నేపథ్యంలో ఇది జరిగింది. ఊరంతా ఒక దారి అయితే ఎర్ర ఉలూపి కట్టెది మరొక దారి కదా! ఏ సమావేశం జరిపినా, ప్రభుత్వాలకి వ్యతిరేకంగా ఏ కార్యక్రమం తలపెట్టినా ప్రజల పేరుతోనే చేస్తారీ ప్రబుద్ధులు. ఈ సమావేశం కూడా జమ్ముకశ్మీర్ ప్రజల చట్టబద్ధమైన హక్కులను పునరుద్ధరించాలి అన్న నినాదంతో జరిపారు. ఈ సమావేశానికి సీపీఎం కొత్త ప్రధాన కార్యదర్శి ఎం. అలెగ్జాండర్ బేబీ (కేరళ) అధ్యక్షత వహించాడు. ఆర్టికల్ 370ని రాజ్యాంగంలో చేర్చే ముందు పెద్ద చర్చ జరిగిందని బేబీ తనదైన చరిత్రను గుర్తు చేశాడు. అయితే ఇది తాత్కాలిక ప్రాతిపదికన చేరిందన్న విషయం మరుగుపరిచాడు. 370 రద్దు చేసిన తరువాత కశ్మీర్‌లో శాంతి పరిఢవిల్లిందని, అభివృద్ధి జరిగిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెప్పడాన్ని బేబీ విమర్శించాడు. పాకిస్తాన్ కాల్పుల కారణంగా ఊరి ప్రాంతంలో జరిగిన నష్టాన్ని బేబీ వెళ్లి చూసి వచ్చారు. నష్టపోయిన వారికి కేంద్రం రూ. 1.3 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకోవడం సరికాదని విమర్శించాడు. పెహల్గామ్ దాడిలో మరణించిన పోనీవాలా అదిల్ షా కుటుంబాన్ని కూడా బేబీ పరామర్శించాడు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా కశ్మీర్‌లు చిరకాలంగా పోరాడుతున్నారని కూడా వ్యాఖ్యానించాడు. జేకేకి విభజించినందుకు స్థానిక సీపీఎం ప్రముఖుడు తరగామి కేంద్రాన్ని దుయ్యబట్టాడు.

# పశ్చిమ బెంగాల్‌లో శివాలయంపై దాడి



పశ్చిమ బెంగాల్‌లోని మహేస్థలలో ఒక శివాలయంపై ఇస్లాం మతోన్మాద మూక జూన్ 10న దాడి చేసింది. మందిరానికి చెందిన భూమిలో పండ్ల దుకాణాలను పెట్టుకొని ఆ భూమిని ఆక్రమించు కోవాలనుకున్న ముష్కరుల దుష్ట పన్నాగాన్ని స్థానిక హిందువులు అడ్డుకున్నారు. దీంతో మతోన్మాదులు శివాలయంపై దాడి చేశారు. పోలీసులను రాళ్లు, ఇటుకలతో గాయపరిచారు. ఇదే విషయమై బీజేపీ నేత సువేందు అధికారి మాట్లాడుతూ రబీంద్రనగర్ పోలీస్ స్టేషన్ సంఘటనాస్థలికి కొద్ది అడుగుల దూరంలో ఉన్నప్పటికీ, పోలీసులు నిమ్మకు నీరెత్తినట్టుగా హింసను చూస్తూ ఉండిపోయారని, ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఘటనకు సంబంధించిన వీడియోలను ఆయన సోషల్ మీడియాలో షేర్ చేశారు.

కథ

"నీ చిన్నప్పటి విషయాలు చెప్పు నాన్నా !" అడిగాను. యథాప్రకారం నాన్న నేను తీరిగ్గా కూర్చుంటే ఆయనకు తన చిన్నప్పటి విషయాలు చెప్పడం ఇష్టం, నాకు వినడం ఇష్టం. నాన్న చిన్నగా నవ్వి ఆలోచిస్తూ ఉన్నారు. అంటే ఆయనేదో చెప్పబోతున్నారని నాకు అర్థమైంది. అమ్మకు నాన్నకు పాలు వేడి చేసి చెరొక కప్పులో ఇచ్చి కూర్చున్నా.

నాన్న నెమ్మదిగా గొంతు సవరించుకున్నారు. ఈ మధ్య ఆయన గొంతు మరీ దగ్గరగా ఉంటే తప్ప వినపడ్డం లేదు. అయినా జీరబోయిన గొంతుతోనే చెప్పడం మొదలు పెట్టారు.

"పెళ్లి చేసుకోకపోతే, అయిన వాళ్లు ఎవరూ లేకపోతే జీవితం ఎలా ఉంటుంది? ఒంటరితనం బాధాకరం అని అందరు అనుకుంటారు, ముఖ్యంగా వృద్ధాప్యంలో. చాలా మంది విషయంలో అది నిజమే. జల్సారాయుళ్లు యవ్వనంలో విచ్చల విడిగా గడిపి, వార్ధక్యంలో జబ్బులతో ఇబ్బంది పడి, ఒంటరి వాళ్లు, కుటుంబం, పెళ్లాం, పిల్లలు లేనివారు ఇలాంటి పరిస్థితి వస్తుందనే నీతిని చాటుతారు. ఎందుకంటే నీవు ఎలా ప్రవర్తించినా క్షమించేది నీ కుటుంబం మాత్రమే అన్నది మనలో ఉన్న నమ్మకం. అందుకే ప్రతి వ్యక్తి, పెళ్లి ద్వారా ఏర్పడే కుటుంబం కావాలనుకుంటాడు. జగమంతా కుటుంబం అనుకునేవారికి సొంత కుటుంబం అవసరం లేదు. అలాంటి వారికి జగమంతా అతని అవసరంలో నిలబడుతుందా? ఇది కేవలం ఆ వ్యక్తి ప్రవర్తన మీద ఆధారపడుతుంది కదా!" అన్నారు నాన్న .

నేను అంగీకారంగా తలూపాను.

నాన్న కాసేపు ఆగి చిన్న నాటి స్మృతులను తలచుకుని చిరునవ్వు తెచ్చుకుని మళ్లీ మొదలెట్టారు "మా చిన్నతనంలో గ్రామాల్లో జన జీవనం చాలా నిరాడంబరంగా సాగేది. ఉన్నవాళ్లు, లేనివాళ్ల మధ్య అసూయ ద్వేషాలు అసలు లేవని కాదు కానీ, అవి బయటకు తెలియవచ్చేవి కావు. పనుల కాలంలో మగాళ్లు ఎవరి పనులు వాళ్లు చేసుకుని సాయంత్రాలు కమ్మాల కట్ట దగ్గర చేరుకొని ఓ గంటపాటు పిచ్చాపాటి మాట్లాడుకుని చీకటి పడగానే ముద్ద మింగి ముసుగేసుకుని పడుకునేవారు, ఆడాళ్లు పనులు చేసుకుని, పిల్లలకు అత్తమామలకు, బావలకు, మరదులకు వడ్డించి తామింత తిని తోడికోడళ్లు సఖ్యంగా ఉంటే కాసేపు ఊసులు చెప్పుకుని దీపాలార్పుకుని పడుకునేవారు. ఊర్లో ఎవరిళ్లల్లో అయినా పెళ్లి జరిగినప్పుడు, గ్రామఫోన్ రికార్డు పెట్టినప్పుడు, పీర్ల పండగకో, రామనవమి భజన జరిగే రోజుల్లోనో, నాలుగు ఊర్ల వాళ్లందరూ కలిసి వేసే నాటకాలకు సాధన చేసేటప్పుడు, నాటకం వేసేటప్పుడు తప్ప సాయంత్రాల్లో ఏడు తర్వాత పిట్ట కూడా తిరిగేది కాదు, ఏ శబ్దం వినపడేది కాదు. చదువుకునే పిల్లలు కూడా తక్కువుండేవాళ్లు, దీపం పెట్టుకుని చదువుకునేవాళ్లు ఉన్నా, వాళ్లు నిశ్శబ్దంకు భంగం కలిగించే వారు కాదు. ఆనాటి పల్లె భారతం కొత్తగా వచ్చిన స్వాతంత్ర్యాన్ని ఏం చేసుకోవాలో తెలియని అమాయకత్వంలో ఉండేది. స్వాతంత్ర్యం వచ్చేనాటికి నాకు పదేళ్లు."

నాకు ఊహ వచ్చినప్పటి నుండి పాత నారాయణ తెలుసు. అతను చలికాలం అంతా మా వరండాలోనే పడుకునేవాడు. నా చిన్నతనంలో నన్నెప్పుడూ ఆప్యాయంగా ఎత్తుకునేవాడు. ఆ ప్రత్యేకమైన ప్రేమకు కారణం నేను తల్లి లేని పిల్లాడినని తర్వాత ఎదిగాక అర్థమైంది. నారాయణ ఎర్రటి మనిషి. కాయకష్టం చేసేవాడు కాబట్టి ముదురు గోధుమ రంగులోకి తేలాడు. బక్కటివాడు కాదు, అలాగని లావుకాదు, మధ్యరకంగా ఉండేవాడు. నాకు గుర్తున్నంత వరకు అప్పటికే అతనికి జుట్టు బాగా తెల్లబడి ఉండింది. కోటేరు ముక్కుతో ఆకర్షణీయమైన ముఖం అతనిది. కళ్లు తీక్షణంగా ఉన్నా, నవ్వితే కళ్లలో కూడా నవ్వు కనపడేది. ఎక్కువ మాట్లాడేవాడు కాదు కానీ, తానే పోస్ట్ ఆఫీస్ నుంచి తెచ్చే దినపత్రికలో వచ్చే వార్తల గురించి ముఖ్యంగా రాజకీయాల గురించి, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పదేళ్లలో దేశ ప్రగతి గురించి, నెహ్రూ పాలన గురించి పాత నారాయణ నాన్నతో, ఇంకా మా ఇంటికి వచ్చే కొద్దిమంది స్నేహితులతో మాట్లాడ్డం వింటుండేవాడ్ని. అతను వార్తాపత్రికల్లో వచ్చిన వార్తల్ని చదవగలిగే వాడు, మరి బడికి వెళ్లి చదువుకున్నాడో, చదువుకున్న వాళ్ల దగ్గరికి వెళ్లి నేర్చుకున్నాడో గానీ ముఖ్యమైన వార్తల గురించి చర్చించేవాడు. నా జ్ఞాపకాల్లో అతను ఇప్పటికి ముతక ఖద్దరు బట్టల్లో ఆనాటి భారతీయ రైతు కూలికి ప్రతిబింబంగా నిలిచి వున్నాడు.

పాత నారాయణకు ఆ పేరు ఎలా వచ్చిందో నాకు తెలియదు, అప్పుడు తెలుసుకోవాలని తట్టలేదు. మా నాన్న దగ్గరికి వచ్చే స్నేహితుల్లో ఐదారు మంది నారాయణలు ఉండేవారు. గుర్తు కోసం ఒక్కో నారాయణ పేరుకు ఒక పిల్ల పేరు తగిలించేవారు. వాళ్లలో కుంతి నారాయణ, పిల్ల నారాయణ, ఎర్ర నారాయణ, కర్రి నారాయణ.. మన పాత నారాయణ కూడా వున్నారు. అయితే పాత నారాయణకు ఆ పేరు రావడానికి బహుశా అతను పాతవాడు, వయసులో పెద్దవాడు అవడం వలన అనుకుంటా. కానీ



అసలయిన కారణం చెప్పడానికి ఇప్పుడెవరూ లేరు. పాత నారాయణ తప్ప మిగతావాళ్లంతా చిన్నవాళ్లు. నారాయణ గుంపులోకి తర్వాత వచ్చిన వాళ్లనుకుంటా.

ఏమైతేనేం పాత నారాయణకు ఆ పేరైతే శాశ్వతంగా ఉండిపోయింది.

అతని చాలా చిన్నప్పుడే అమ్మానాన్న కలరాతో చనిపోయారు. తోబుట్టువులు ఎవరూ లేరు. ఇల్లు వాకిలి లేదు. ఎవరు ముందు పనికి పిలిస్తే వాళ్ల పొలంలోకి పోవడం, ఆ రోజుకు వాళ్ల ఇంట్లోనే తినడం... రాత్రికి మా ఊరి మధ్యలో ఉండే సత్రం "కమ్మాల కట్ట" దగ్గర పడుకునేవాడు.

స్నేహితులందరూ బీడీ కాల్చేవారు, కానీ నారాయణకు ఒక్క చెడు అలవాటు ఉండేది కాదు. కనీసం కాఫీ కూడా తాగేవాడు కాదు.

మా ఊర్లో ఎవరి ఇంట్లో పెళ్లి జరిగినా, నారాయణ పెద్దరికం తీసుకునేవాడు. చుట్టు పక్కల పల్లెల్లో ఉండే దూరపు చుట్టాలకు పెళ్లి పత్రికలూ ఇవ్వడానికి వెళ్లేవాడు. ఎవరైనా చనిపోయినప్పుడు ఆ వార్తని వాళ్ల బంధువులకు



# పాత నారాయణ

## డా. పేరం ఇందిరా దేవి





ఎవరూ పనికి పిలవని రోజుల్లో మా ఇంట్లో నిస్సంకోచంగా అడిగి అన్నం పెట్టించుకుని తినేవాడు. అయితే ఆ రోజు మా ఇంట్లో ఏదో ఒక పని చేసేవాడు, నారతో పగ్గాలు అల్లడమో, కట్టెలు కొట్టడమో, కల్లం శుభ్రం చేయడమో, సంగటికి జొన్నలు దంచడమో, ఇసుర్రాయితో రొట్టెకు జొన్న పిండి ఇసరడమో చేసేవాడు. ఊర్లో ఎవరు ఏమి చెప్పినా పలికే వాడు.

నారాయణకు మా ఊర్లో అందరు తెలుసు, తన కులం, పరాయి కులం అని పట్టించుకునేవాడు కాదు. అతని దృష్టిలో అది ముఖ్యం కాదు గుణం ముఖ్యం. నాన్న

తెలియజేయడానికి కూడా తనే వెళ్లేవాడు. ఏ ఇంట్లో ఏ కష్టం వచ్చినా, ఎవరికీ ఆరోగ్యం బాగా లేకున్నా పిలిస్తే చాలు వెళ్లేవాడు. అందరి బంధువు అతను. అతనికి రెండు జతల బట్టలు మాత్రమే ఉండేవి ఒకటి ఒంటి మీద, ఇంకొకటి తానే చవుడుతో ఉతికి ఆరేసుకున్నాక సంచిలోకి పెట్టేవాడు. ఆ సంచిని మా పెరట్లో గోడకున్న కట్టెకు తగిలించేవాడు. అందులో ఏమి దాచాడో అని పిల్లలం కుతూహలంతో వెతికేవాళ్లం. కానీ ఒక పంచ ఒక బనియన్ తప్ప ఏమీ ఉండేవి కాదు. అతనికి కూలి పనికి పోయినప్పుడు వచ్చిన డబ్బులు అన్నీ అప్పసామి గుడికే ఇస్తాడని అనే వాళ్లు. పనికి పోతే సాయంత్రం తోటల్లో బావి దగ్గర స్నానం చేసుకుని ఉతికిన తడి బట్టలే వేసుకునేవాడు. పెళ్లిళ్లలో చేసిన పనికి గుర్తింపుగా ఆ ఇంటివాళ్లు కొనిచ్చిన బట్టలు తప్ప అతనెప్పుడూ సొంతానికి చిన్న వయసులో ఉండగా కూడా బట్టలు కొనేవాడు కాదని నాన్న

నా బియ్యే అయ్యాక చుట్టుపక్కల ఊర్ల నుండి బియ్యే చదివిన నన్ను చూడ్డానికి వచ్చారని విన్నప్పుడు ఆశ్చర్యపోయా. తర్వాత తెలిసిందే మంటే పాత నారాయణ చదువు కోవడం ఎంత మంచి పనో, చదువు కున్నవాడు ఎంత ఎదుగుతాడో, ఎందరికి ఉపయోగపడ తాడో.. వెళ్లిన చోటల్లా చెప్పడం వలన వాళ్లకు చదువుపై గౌరవం పెరిగి నన్ను చూసి తమ పిల్లల్ని చదివించేందుకు వచ్చారు.



చెబుతుంటే విన్నాను. అతను బ్రహ్మచారిగానే ఉండిపోయాడు, యవ్వనంలో కూడా ఏ స్త్రీని తలెత్తి చూసేవాడు కాదని విన్నాను. పెద్దవాళ్లని 'అమ్మా' అని చిన్న వాళ్లని 'అక్కయ్యా' అని పిలిచేవాడని అతనంటే అందరికి గౌరవం. నమ్మకం కూడా అని నేను గ్రహించాను. కోడలిని పుట్టింటికి పంపడానికి, కూతుర్ని అత్తగారింటి దగ్గర వదలడానికి నారాయణనే తోడుగా ఇచ్చి పంపేవాళ్లు. ఊర్లో అందరు ఆడవాళ్లకి రక్త సంబంధం లేని సోదరుడు.

నారాయణకు పిల్లలంటే చాలా ఇష్టం. మేము చిన్నప్పుడు కల్లంలో ఆడుకుంటుంటే అప్పుడప్పుడు వచ్చి గోడ మీద కూర్చునే వాడు. చిల్లాకట్టె ఆడేప్పుడు ఒక పిల్లాడు కొట్టిన చిల్లా.. నారాయణ నుదుటికి తగిలి రక్తం వచ్చింది. వేరేవాళ్లకు తగిలి ఉంటే అక్కడి నుండి అందరం పారిపోయేవాళ్లం, కానీ నారాయణ కాబట్టి మేము ఆయన దగ్గరకు పరుగుతీసి దెబ్బ తగిలిందని బాధ పడ్డాం. నారాయణ రక్తం పంచెతో తుడుచుకుని నవ్వి, "ఆడుకోపోండి పెద్ద దెబ్బేమీ తగల్లేదులే" అని మమ్మల్ని కుదుట పరిచాడు. తీరిక వేళల్లో మా బడి గోడ దగ్గర కూర్చునేవాడు. మా అయ్యవారు చెప్పే వేమన, సుమతి పద్యాలు. శ్రీ కృష్ణ రాయబారం, తులాభారం నాటకంలో పద్యాలు నారాయణకు కంఠతా వచ్చేవి. రాగయుక్తంగా వాటిని పాడేవాడు. వేమన శతకంలోని పద్యాలను నన్ను అప్పజెప్పమని వాటి అర్థాన్ని మా వరండాలో కూర్చుని నాన్నకు ఇతర స్నేహితులకు వివరించేవాడు, అప్పటికి నాకు పద్యాలు కంఠతా వచ్చినా దాని భావం తెలిసేది కాదు, వాళ్ల చర్చ కూడా అర్థం అయ్యేది కాదు. పద్యాలు చక్కగా అప్పజెప్పానని "రోశిరెడ్డీ! నీ కొడుకును బాగా చదివించాలోయ్ తెలివైనోడు" అని నన్ను మెచ్చుకున్నట్లే అందరి పిల్లల్ని మెచ్చుకుని వాళ్లను బాగా చదువుకోమని ప్రోత్సహించేవాడు. సంతకు వెళ్లిన తల్లులు సరుకుల్నీ, పిల్లల్నీ మోయలేక ఇబ్బంది పడుతుంటే తన భుజం మీద ఎక్కించుకుని ఇంటిదగ్గర దించేవాడు. ఇలాంటివి ఎన్నో ఉంటాయి ఆయనకు పిల్లలపై ప్రేమకు ఉదాహరణలుగా, అందుకే పిల్లలకు కూడా ఆయనంటే ఇష్టం.

నారాయణకు పని చెప్పడానికి గానీ, సహాయం అడగడానికి గానీ ఎవరికీ మొహమాటముండేది కాదు. అలాగే ఊర్లో ఏ ఇంటికైనా అతను ఏ సమయంలో అయినా ఆ ఇంటి మనిషిలాగా ఆత్మీయునిలాగా వెళ్లే చనువు ఉన్నా, దాన్ని ఎప్పుడూ దుర్వినియోగం చేసుకునేవాడు కాదు. చలి కాలంలో మా ఇంటి వరండాలో పడుకున్నా, దుప్పటి కప్పుకునేవాడు కాదు. కింద ఏమీ పరచుకునేవాడు కాదు..కటిక నేలమీదే పడుకునేవాడు. మా నాన్న కంబళి ఇచ్చినా వద్దనేవాడు. చలి తగ్గాక కమ్మాలకట్ట దగ్గర మాత్రమే పడుకునేవాడు. ఎవరి పని మీద వేరే ఊరికి పోయినా, తినడం అయ్యాక ఆ ఊరి సత్రంలో తప్ప ఎవరింట్లోనూ పడుకునేవాడు కాదు. తన జీవితమంతా ఒకేరీతిలో బతికాడు, వార్ధక్యంలో సైతం ఆయన జీవన శైలిలో మార్పు ఉండేది కాదు.

నేను మదనపల్లిలో ఇంటర్ పరీక్షలు రాసి వచ్చినప్పుడు, "మనూళ్లో చదువుకున్నోళ్లు తక్కువబ్బా, ఇప్పటికి నువ్వే ఎక్కువ చదివావు, ఇంకా పెద్ద సదువు సదివి పేరం వోళ్ల పేరు, మీ నాయన కమాను రోశిరెడ్డి పేరు నిలపాల" అన్నాడు. తర్వాత నేను తిరుపతిలో బియ్యే చదువుతూ ఇంటికి వచ్చినప్పుడు "ఇంకెన్నేళ్లు చదువుతావు?" అని అడిగాడు.

"బియ్యే రెండేళ్లు ,ఎమ్మే రెండేళ్లు చదువుతే అప్పుడు పూర్తవుతుంది"అన్నాను.

నవ్వి "అయితే నేనది చూడాల" అన్నాడు.

నా బియ్యే అయ్యాక చుట్టుపక్కల ఊర్ల నుండి బియ్యే చదివిన నన్ను చూడ్డానికి వచ్చారని విన్నప్పుడు ఆశ్చర్యపోయా. తర్వాత తెలిసిందేమంటే పాత నారాయణ చదువు కోవడం ఎంత మంచి పనో, చదువుకున్నవాడు ఎంత ఎదుగుతాడో, ఎందరికి ఉపయోగపడతాడో.. వెళ్లిన చోటల్లా చెప్పడం వలన వాళ్లకు చదువుపై గౌరవం పెరిగి నన్ను చూసి తమ పిల్లల్ని చదివించేందుకు వచ్చారు. కొంచం సంతోషం, కొంచం సిగ్గు కలిగాయి వాళ్లని కలిసినప్పుడు. నారాయణ చేసిన పని కొంచం కూడా చిరాకు కలిగించలేదు. పైగా విద్య ప్రాధాన్యతను చాటి చెప్పాడని నాతో పాటు అందరు భావించారు. ఇంటింటికి వెళ్లి చదువు చెప్పించమని అందరికీ చెబుతున్నాడని మనూర్లో హైస్కూల్ రావడంతో పిల్లలకు 4 మైళ్లు నడిచి సింహాద్రిపురం పోయి చదివే బరువు తగ్గిందనే విషయం చెప్పి బడికి వెళ్లే విద్యార్థుల సంఖ్య పెంచాడని నాన్న చెప్పినప్పుడు చాలా సంతోషపడ్డాను.

ఎమ్మే ఎకనామిక్స్‌లో చేరడానికి అప్లికేషన్ పెట్టడానికి తిరుపతి వెళ్లడానికి తయారవుతున్న నాకు బయట కోలాహలం వినపడితే బయటికి వచ్చాను. పొలం పనికి వెళ్లిన పాత నారాయణ అక్కడే గుండె ఆగి సునాయాస మరణం పొందాడని చెప్పారు. కాసేపట్లోనే అతని శవాన్ని కమ్మాలకట్ట దగ్గరికి తీసుకొచ్చారు. నా తిరుపతి ప్రయాణం మానుకున్నాను. పాత నారాయణ చనిపోయాడని వార్త చుట్టుపక్కల పల్లెలకు సైతం పోయింది. గుంపులు గుంపులుగా ప్రజలు వస్తున్నారు. మా ఊర్లో పెద్ద మనుషులందరూ చేరి నారాయణ దేహాన్ని ఊరంతా తప్పెట్లతో తిప్పారు. కంట తడి పెట్టని పిల్లలు, పెద్దలు లేరు. ఆడవాళ్లు శోకాలు పెట్టి ఏడ్చారు. ఒక ఇంటి పెద్ద చనిపోతే ఆ ఇంటివాళ్లు, అతని బంధువులే ఏడుస్తారు. కానీ పాత నారాయణ కోసం కన్నీరు పెట్టని వాళ్లు ఊర్లోనే లేరు. మా ఊరే కాదు చుట్టుపక్కల ఊర్ల నుండి చాలా మంది అతని అంత్యక్రియలకు హాజరయ్యారు. ఏ పెద్ద రెడ్లకు, రాజకీయ నాయకునికి కూడా పాత నారాయణకు జరిగినట్టు చివరి వీడ్కోలు జరగలేదు. అనాథగా పెరిగి, అందరి బంధువుగా ఎదిగి, అందరి హృదయాల్లో ఆత్మీయుడుగా నిలిచిన పాత నారాయణకు లోకమంతా బంధువులే. జగమంతా ఆయన కుటుంబం అనుకున్నాడు కాబట్టి జగమంతా ఆయన్ని ప్రేమించింది. ప్రపంచానికి మనమేది ఇస్తామో అదే మనకు తిరిగి వస్తుంది ప్రపంచం నుంచి అనిపించింది.

"ఈ నాటికి 60 ఏళ్ల తర్వాత కూడా మన ఊర్లో నారాయణ గురించి తెలిసిన వాళ్లు, ఆయన గురించి విన్నవాళ్లు ఆయన్నీ గొప్పగా తలుచుకుంటూనే ఉంటారు. నేను ఇవాళ తలుచుకుని ఆయన కథను నీకు చెప్పినట్లు. సరే మరి, పాత నారాయణ కథ రాస్తావామ్మా?" నాన్న గొంతు మరింతగా జీరబోయింది, కళ్లలో పల్చటి కన్నీటి తెర. గత కాలపు జ్ఞాపకాల నెమరు వేసుకోవడంతో. బరువెక్కిన గుండెతో సరే అన్నట్లు తలూపాను.

వచ్చేవారం కథ..

**ధర్మజ గీత**

– విహారి



హైదరాబాద్ కుర్రాడు విశ్వనాథ్ కార్తికేయ చరిత్ర సృష్టించాడు. చిరుప్రాయంలోనే ఏడు ఖండాలకు చెందిన ఏడు అత్యున్నత శిఖరాలను అధిరోహించిన మొనగాడిగా నిలిచాడు.





# పర్వతారోహణలో పదహారేళ్ల తెలుగుతేజం!

ప్రపంచంలోనే అత్యధిక యువజన జనాభా కలిగిన భారత్‌లో కుర్రాళ్లు వయసుకు మించిన ప్రతిభతో రికార్డుల మోత మోగిస్తున్నారు. క్రికెట్ నుంచి పర్వతారోహణ వరకూ తమకు తామే సాటిగా నిలుస్తున్నారు. ప్రతిభకు వయసుతో ఏ మాత్రం సంబంధం లేదంటూ అపురూప విజయాలు, అరుదైన ఘనతలతో దేశానికే వన్నె తెస్తున్నారు.

ప్రపంచ చదరంగంలో తమిళనాడు కుర్రగ్రాండ్ మాస్టర్లు గుకేశ్, ప్రజ్ఞానంద, ఐపీఎల్ 18వ సీజన్ పోటీలలో 14 ఏళ్ల చిచ్చర పిడుగు వైభవ్ సూర్యవంశీ అసాధారణ రికార్డులతో చరిత్ర సృష్టిస్తే.. మన హైదరాబాద్ కుర్రాడు పడకంటి విశ్వనాథ్ కార్తికేయ పర్వతారోహణలో గతంలో ఎవ్వరూ సాధించలేని ఘనతను సొంతం చేసుకొని తెలుగు రాష్ట్రాలకే గర్వకారణంగా నిలిచాడు.

**16 ఏళ్ల చిరుప్రాయంలోనే...**

పదహారేళ్ల వయసులో కుర్రాళ్లంతా డాక్టర్లు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు కావటానికి సెట్‌ల మీద సెట్‌లు రాస్తూ.. నానాపాట్లు పడుతుంటే..విశ్వనాథ్ కార్తికేయ మాత్రం పర్వతారోహణమే తన జీవితంగా మలచుకొన్నాడు. చదువంటే అంతగా ఆసక్తిలేని ఆతను ప్రపంచంలోని అత్యున్నత శిఖరాలన్నింటినీ అధిరోహించాలని కంకణం కట్టుకొని సాధన మొదలు పెట్టాడు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో చిరుప్రాయంలోనే తన జీవిత లక్ష్యాన్ని నెరవేర్చుకొని ప్రపంచ గుర్తింపు పొందగలిగాడు. ప్రధానంగా తల్లి లక్ష్మి, తండ్రి రాజేంద్రప్రసాద్ అండగా నిలవడంతో ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన ఎవరెస్టు శిఖరాన్ని అలవోకగా అధిరోహించగలిగాడు.

**ప్రాణాలతో చెలగాటం పర్వతారోహణం..**

సముద్రమట్టానికి అత్యంత ఎత్తులో, మంచుతో నిండిన పర్వతాలను, శిఖరాలను అధిరోహించాలంటే గుండెబలం, శారీరక, మానసిక పటుత్వం ఉండి తీరాలి. ఎముకలు కొరికే చలిలో, రక్తం గడ్డ కట్టుకుపోయే వాతావరణంలో 8వేల మీటర్లకు పైబడిన ఎత్తులో ఉన్న ఎవరెస్టు లాంటి శిఖరాలను అధిరోహించడం అంటే మాటలా మరి! ఒక విధంగా చెప్పాలంటే ప్రాణాలనే పణంగా పెట్టి ప్రతికూల వాతావరణం, పరిస్థితులలో చేసే అత్యంత ప్రమాదకరమైన సాహసమే పర్వతారోహణం. పైగా ఏడు ఖండాలలోని ఏడు అత్యున్నత శిఖరాలను నూనూగుమీసాల వయసులో అధిరోహించడాన్ని గొప్పసాహసమే అని చెప్పాలి. అలాంటి సాహసాన్ని, ఘనకార్యాన్ని కార్తికేయ సాధించి తెలంగాణా రాష్ట్రానికే కాదు... భారత్‌కు గర్వకారణమయ్యాడు.

**ఏడు ఖండాలు...ఏడు అత్యున్నత శిఖరాలు...**

పదేళ్ల వయసు నుంచే పర్వతారోహణపై మక్కువ పెంచుకొన్న కార్తికేయ హైదరాబాద్ నగర శివారులోని యాప్రాల్‌లో సాధన చేస్తూ విశ్వపర్వతారోహణ జైత్రయాత్రకు సిద్ధమయ్యాడు. భారత సైనిక దళాలకు చెందిన మాజీ పర్వతా రోహకుడు లెఫ్ట్‌నెంట్ రోమిల్ భరత్‌వాల్ శిక్షణలో భరత మార్గదర్శనంలో గత ఐదేళ్లుగా శిక్షణ పొందిన కార్తికేయ ఏడు ఖండాలలోని ఏడు అత్యున్నత శిఖరాలను అధిరోహించడం ద్వారా చరిత్ర సృష్టించాడు.

ఆస్ట్రేలియాలోని అత్యున్నత శిఖరం కోస్కులోజ్ (సముద్రమట్టానికి 7, 310 అడుగులు ఎత్తు), హిమఖండం అంటార్కిటికాలోని మౌంట్ విన్సన్ (16050 అడుగులు), యూరోప్‌లోని అత్యంత ఎత్తయిన శిఖరం ఇల్బ్రస్ (18 వేల 510 అడుగులు), ఆఫ్రికా ఖండంలోని కిలిమంజారో శిఖరం (19వేల 341 అడుగులు), ఉత్తర అమెరికా ఖండంలోని అత్యున్నత శిఖరం డెనెల్లి (20 వేల 310 అడుగులు), దక్షిణ అమెరికా ఖండంలోని అకాన్ గువా శిఖరం (22వేల 838 అడుగులు), ఆసియా ఖండంలోనే కాదు.. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన శిఖరం ఎవరెస్టు (29వేల 029 అడుగులు)ను అధిరోహించడం ద్వారా తనకు తానే సాటిగా నిలిచాడు. అత్యంత చిన్నవయసులోనే ఏడు ఖండాలలోని ఏడు అత్యున్నత శిఖరాలను అధిరోహించిన రెండో అత్యంత పిన్నవయస్కుడిగా కార్తికేయ రికార్డుల్లో చేరాడు.

ప్రపంచ పర్వతారోహణ చరిత్రలో అత్యంత పిన్నవయసులో ఏడు అత్యున్నత శిఖరాలను అధిరోహించిన రికార్డు అమెరికాకు చెందిన జోర్డాన్ రోమెరో పేరుతో ఉంది. రోమెరో కేవలం 15 సంవత్సరాల వయసులోనే ఈ ఘనత సాధిస్తే.. కార్తికేయ 16 సంవత్సరాల వయసులో అదే ఘనత సాధించడం ద్వారా రెండోస్థానంలో నిలిచాడు. భారత్ కే చెందిన కామ్యా కార్తికేయన్ 17 ఏళ్ల వయసులో ప్రపంచంలోని ఏడు అత్యున్నత శిఖరాలను అధిరోహించగలిగారు.

2025 మే 26న సముద్రమట్టానికి 8వేల 848 మీటర్ల ఎత్తులో ఉన్న ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించి, భారత మువ్వన్నెల జెండాను ప్రతిష్టించడం ద్వారా ఓ పర్వతారోహకుడిగా తన జన్మచరితార్థమైందంటూ కార్తికేయ మురిసిపోతున్నాడు. ఈ ఘనత వెనుక తల్లిదండ్రుల త్యాగం, తాతలు, అమ్మమ్మనాయనమ్మల ప్రేరణ ఎంతో ఉందని కార్తికేయ గుర్తు చేసుకొన్నాడు. ఓ పర్వతారోహకుడిగా యుక్తవయసులోనే జీవిత లక్ష్యాలను నెరవేర్చుకొన్న విశ్వనాథ కార్తికేయ దేశంలోని కోట్లాదిమంది యువతకు స్ఫూర్తిగా నిలిచిపోతాడు.



**కృష్ణారావు చాప్పరపు**
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969

# నంద్యాల పోస్ట్‌మ్యాన్‌లకు ఘన సన్మానం

**నంద్యాల:** మారుమూల ప్రాంతాలకు సైతం నిరంతరం తపాలా సేవలు అందిస్తూ సమాచార వారధులుగా నిలుస్తున్న పోస్ట్‌మ్యాన్‌లకు జూన్ 12న నంద్యాలలో జాగృతి వారపత్రిక తరపున ఘనంగా సన్మానం జరిగింది.



ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది, సేవా భారతి నంద్యాల, కర్నూలు జిల్లాల సంఘటనా కార్యదర్శి నీలకంఠం ప్రధానవక్తగా పాల్గొని మాట్లాడుతూ, భారత సైన్యం తర్వాత, వాహన సదుపాయం లేని మారుమూల ప్రాంతాలకు కూడా వార్తలు, ఉత్తర ప్రత్యుత్తరాలతో పాటు ఎన్నో కీలక సేవలను భారతీయ తపాలావ్యవస్థ అందిస్తోందని కొనియాడారు. జాగృతిని ఇంటింటికీ చేరవేయడంలో తపాల సేవకుల కృషి అభినందనీయమని ఆయన ప్రశంసించారు. జాతీయతను బలోపేతం చేస్తూ, దేశాభివృద్ధికి జాగృతి పత్రిక చేస్తున్న కృషి ఎంతో గొప్పదని, భవిష్యత్తులో ఈ పత్రిక ప్రతి గడపకు చేరడం ఎంతో ఆవశ్యకమన్నారు.

పోస్ట్‌మాస్టర్ ఖాసీం వలి మాట్లాడుతూ జాగృతి పత్రికను చదివానని, జాతీయ భావాలను, సంస్కృతి సంప్రదాయాలను అందులో చక్కగా తెలియజేస్తారని తెలిపారు. ముఖ్యంగా 'ఆపరేషన్ సిందూర్' వంటి సమయాల్లో వాస్తవ విషయాలను సమాజంలోకి తీసుకువెళ్లడంలో ఈ పత్రిక కీలక పాత్ర పోషించిందని కొనియాడారు. తమ సిబ్బంది ఈ పత్రిక పంపిణీలో పాలు పంచుకోవడం, దానికి గుర్తింపుగా జాగృతిపత్రికవారు సన్మానించడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

జాగృతి నగరప్రముఖ్ చింతపల్లివాసు మాట్లాడుతూ, 1948లో ప్రారంభమైన జాగృతి 77 సం.లుగా జాతీయ భావజాగరణలో పునీతమైందన్నారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఆది నారాయణ (APM MAIL),ఎస్.వి.ఆర్ ఎమ్‌కె రెడ్డి Rtd staff, పోస్టుమాన్లు, శాఖ సిబ్బందితోపాటు సంఘమిత్ర ఆవాసం ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, జాగృతి జిల్లాప్రముఖ్ శ్రీనివాసులు తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్రకృతి వ్యవసాయమే శరణ్యం

**పిడుగురాళ్ల :** ప్రకృతి వ్యవసాయ సదస్సు జూన్ 11న పల్నాడు జిల్లా పిడుగురాళ్ల, శ్రీ సాయివృద్ధాశ్రమంలో, కొత్త గణేశునిపాడు గ్రామ సర్పంచ్ పొందూరి నర్సింహ్మారావు 20 ఎకరాల ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో జరిగింది. 13 గ్రామాలనుండి 55 మంది రైతులు ఈ సదస్సులో పాల్గొన్నారు. భవిష్యత్తరాల మనుగడకు ప్రకృతివ్యవసాయమే శరణ్యమనీ ప్రభుత్వాలు కూడా ప్రోత్సహించాలని మాట్లాడిన రైతులందరూ కోరారు. చివరగా ప్రకృతి వ్యవసాయ ఆదర్శ రైతు కొత్త గణేశునిపాడు సర్పంచ్ పొందూరి నర్సింహ్మారావుతోపాటు ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతు సోదరులను గ్రామవికాస్ తరపున సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామవికాస్ ప్రాంత సంయోజక్ తిరుపతయ్య, సహప్రాంత సంయోజక్ రెడ్డినాయుడు మార్గదర్శనం చేశారు.

## వార్తలు పంపేవారికి మనవి

★ కార్యక్రమం గురించిన ఫోటో తప్పకుండా పంపాలి. వేదిక ఫోటోతో పాటు పాల్గొన్న ప్రజల ఫోటో కూడా పంపాలి.

★ కార్యక్రమం జరిగిన తేదీ, ప్రదేశం పేరు, గ్రామం, మండలం, జిల్లా పేర్లను తప్పకుండా తెలపాలి.

★ వార్తను పంపినవారి పేరు, ఫోన్ నెంబరు తప్పక తెలియచేయాలి.

★ వార్తను **jagritiweekly@gmail.com** కు మాత్రమే పంపాలి. – సంపాదకుడు

# దివ్యాంగ విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ స్టడీ సెంటర్



**అనంతపురం :** సక్షమ్ స్థాపన దివస్ సందర్భంగా జూన్ 10న అనంతపురంలో దివ్యాంగ విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్ స్టడీ సెంటర్ హాల్ ప్రారంభించారు. ఎంపిక చేసిన వికలాంగులకు 2 వీల్ చైర్స్, 6 నాలుగు చక్రాల ట్రాలీలను, 30 మందికి యూడిఐడి కార్డ్స్ అందించారు. సేవా కేంద్రం నిర్వహణ కోసం ప్రతినెలా ఆర్థికంగా సహాయం చేస్తున్నటువంటి 5 మంది దివ్యాంగ మిత్రులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సక్షం జాతీయ ప్రధాన కార్యదర్శి ఉమాష్ అందారే, రాష్ట్ర సంఘటన కార్యదర్శి కృష్ణమోహన్ తదితర కమిటీ సభ్యులతోపాటు 85 మంది పాల్గొన్నారు.

## యెల్లెంకి హన్మంతరావు ఇక లేరు

**పెద్దపల్లి :** సంఘకార్యంలోనే జీవితం గడిపిన జ్యేష్ట స్వయంసేవక్ యెల్లెంకి హన్మంతరావు జూన్ 9న కన్ను మూశారు. వయస్సు 80 సం.లు. వీరు పెద్దపల్లి జిల్లా గోదావరిఖని కేంద్రంగా సింగరేణి కంపెనీలో ఉద్యోగం చేశారు.

సుదీర్ఘకాలం పెద్దపల్లి ఖండ కార్యవాహగా పనిచేస్తూ ఎంతో మంది కార్యకర్తలను తీర్చిదిద్దారు.



దేశంలో ఎమర్జెన్సీ విధించినప్పుడు హన్మంతరావు జైలు కెళ్లారు.

హన్మంతరావు జిల్లా కార్యవాహగా, విభాగ్ సంపర్క ప్రముఖ్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. తెలంగాణ ప్రాంత సహకారభారతి సంస్థ ప్రాంత బాధ్యత స్వీకరించి గట్టి పునాదులు వేయడంలో తనవంతు పాత్ర పోషించారు. కరినగర్ మాధవ సేవాసమితికి అధ్యక్షుడిగా సేవలు అందించారు. గోదావరిఖనిలో శ్రీ వివేకానంద చారిటబుల్ ట్రస్ట్‌ను ప్రారంభించి సుదీర్ఘ కాలం కార్యదర్శిగా వృత్తి విద్యా జూనియర్ కళాశాల నడిపించి ఎంతోమంది యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించారు.

సంఘప్రచారక్‌గా పనిచేసే అవకాశం లభించలేదని హనుమంతరావు భావించి ఐదు సంవత్సరాలు ముందుగా ఉద్యోగానికి స్వచ్ఛంద పదవీ విరమణ చేసి జీవితాంతం సంఘ పనిలోనే పూర్తి సమయం గడిపిన ధన్యజీవి.

## సామూహిక సాగర హారతి





**బాపట్ల :** జ్యేష్ట పౌర్ణమి సందర్భంగా హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో జూన్ 10న బాపట్ల జిల్లా, చీరాల మండలం, వాడరేవు (సముద్ర తీరం)లో సామూహిక సాగహారతి కార్యక్రమం జరిగింది.
ఈ కార్యక్రమంలో బ్రహ్మశ్రీ కృష్ణ చాముండేశ్వరి మహర్షి స్వామి పాల్గొని సందేశం ఇచ్చారు. ★




భక్తాగ్రేసరులు

## జయదేవ



జయదేవుడు కృష్ణభక్తుడు. బెంగాల్‌లోని వీరభూమి జిల్లా కెందుబిల్వ గ్రామంలో జన్మించిన ఆయన సర్వవిధాల విరక్తి కలిగి తీర్థయాత్రలు చేస్తూ పూరీక్షేత్రానికి చేరాడు. విరాగి అయిన ఆయన, జగన్నాథుడి ఆజ్ఞానుసారం అక్కడి సుదేవుడనే కుమార్తె పద్మావతిని పెళ్లాడాడు. ఆమె భర్తకు నీడలా మెలగుతూ సర్వవిధాల సపర్యలు చేసేది. పూరీలోనే అష్టపదులు రాసిన జయదేవుడు, కొంతకాలం స్వస్థలంలో ఉండి, భార్యా సమేతంగా యాత్రలు ప్రారంభించాడు. అలా... గౌడ దేశీయుడు లక్ష్మణసేన మహారాజు ఆశ్రయం పొందాడు. ఆయన భక్తి, విద్వత్తు, అంకితభావాలకు ముగ్ధుడైన మహారాజు తన కొలువులో ప్రధానుని చేసి సర్వసైన్యాధ్యక్ష బాధ్యతలు అప్పగించాడు. జయదేవుడు తనకు కీడు తలపెట్టిన వారినీ మన్నించే గుణం కలవాడు. రాజాశ్రయానికి ముందు, తనపై దాడి చేసిన వారిని క్షమించి, వారికి మహారాజుతో ధనసహాయం చేయించాడు. అయినా, ఆ దుండగులు 'కృతఘ్నత' ప్రదర్శించి ప్రకృతి కోపానికి బలైపోయారు. జయదేవుడు కొంతకాలానికి రాజాశ్రయాన్ని వీడి స్వస్థలం చేరి, అక్కడే కాలం చేశాడు. ఆయన సంస్మరణార్థం గ్రామంలో మాఘ సంక్రాంతి నాడు నేటికి పెద్ద తీర్థం నిర్వహిస్తున్నారు.

## కథ | తెలివైన ఏనుగులు

ఆ అడవికి రాజు సింహం. దానికోరోజు ఏనుగు మాంసం తినాలనిపించింది.

ఆ విషయం మంత్రి అయిన నక్కకు చెప్పింది. అప్పుడా నక్క ఏనుగుల దగ్గరకి వెళ్లింది.

పెద్ద ఏనుగు మిగతా ఏనుగులతో.. 'నక్క వస్తోంది. మీరంతా జాగ్రత్తగా ఉండండి' అని హెచ్చరించింది.

నక్క తిన్నగా పెద్ద ఏనుగు దగ్గరకి వచ్చి 'రాజుగారికి పిల్లలు లేరు కదా! ఆయన తర్వాత రాజు ఉండాలి కదా! అందుకే ఈ అడవిలో ఉన్న జంతువులన్నిటికీ ఒక పోటీ పెడతారట. కానీ.. రాజుగారికి నిన్నే రాజుగా చేయాలనుంది. అందుకే నిన్నే గెలిపిస్తారు. నీతో ఏదో మాట్లాడాలన్నారు. రాజుగారిని కలుద్దాం పద' అంది నక్క.

అప్పటికే నక్క గురించి ఏనుగులకి తెలుసు. అందుకే దానికీ, సింహానికి బుద్ధి చెప్పాలను కున్నాయి.

'ఓ.. తప్పక వస్తాం మంత్రివర్యా! మీరు ముందు పదండి' అన్నాయి ఏనుగులు.

నక్క.. సింహం దగ్గరకు వెళ్లింది. 'వెళ్లిన పని అయిందా?' అని అడిగింది సింహం గంభీరంగా.



## పద్యము

**వరపైన చేను దున్నకు**
**కరవైనను బంధుజనులకడ కేగకుమీ**
**పరులకు మర్మము సెప్పకు**
**పిరికికి దళవాయితనము బెట్టకు సుమతీ**

భావం : అనావృష్టి ఏర్పడినప్పుడు, పొలం దున్ని సాగు ప్రయత్నం చేయకూడదు. ఎంత కరవుకాలం వచ్చినప్పటికీ బంధుజనులను ఆశ్రయించకూడదు. సన్నిహితులు కాని వారయిన ఇతరులకు, శత్రువులకు గుట్టుగా ఉంచవలసిన రహస్యాలను చెప్పవద్దు. ధైర్యం లేనివారిని సైన్యాధికారిగా నియమించవద్దు.

## శ్లోకము

**అఖండమండలాకారం**
**వ్యాప్తం యేన చరాచరమ్**
**తత్పదం దర్శితం యేన**
**తస్మై శ్రీగురవే నమః**

భావం : సమస్త చరాచర ప్రపంచంలో వ్యాపించిన అఖండమైన/పరిపూర్ణమైన (జ్ఞాన)శక్తిని గురువు మనకు దర్శింప చేశారు. ఆయనకు వందనం.

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| కౌటిల్యుడు | చరకసంహిత |
| చరకుడు | అష్టాధ్యాయి |
| వరాహమిహిరుడు | అర్థశాస్త్రం |
| ఆర్యభట్ట | బృహత్ సంహిత |
| పాణిని | ఆర్య భట్టీయం |

సమాధానాలు : కౌటిల్యుడు–అర్థశాస్త్రం; చరకుడు–చరకసంహిత; వరాహమిహిరుడు–బృహత్‌సంహిత; ఆర్యభట్ట–ఆర్య భట్టీయం; పాణిని–అష్టాధ్యాయి.

## శాస్త్రవేత్తలు

### ఆషిమా ఛటర్జీ
(1917-2006)



ఈమె రసాయన శాస్త్రవేత్త. ఆర్గానిక్ కెమిస్ట్రీలో అనేక పరిశోధనలు చేశారు. 'వింకా' (నిద్ర గన్నేరు) మొక్క నుంచి సేకరించిన ఆల్కలాయిడ్‌ల ద్వారా మూర్ఛ వ్యాధికి మందును రూపొందించారు. మలేరియా నివారణ ఔషధాన్ని కనుక్కున్నారు. ఆషిమా భారత విశ్వవిద్యాలయాల నుంచి డాక్టరేట్ అందుకున్న రెండో మహిళ. ఈమె సింథటిక్ ఆర్గానిక్ కెమిస్ట్రీలో, మొక్కల ఉత్పత్తులపై పరిశోధనలు చేశారు.

## జనరల్ నాలెడ్జ్

1. ఎలక్ట్రానిక్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్) ఎక్కడుంది?
2. 'పెడగాగి' అనేది దేనిని అధ్యయనం చేసే శాస్త్రం?
3. విటమిన్ 'డి'ని కనుగొన్న శాస్త్రవేత్త?

సమాధానాలు :1. హైదరాబాద్; 2. బోధనా పద్ధతులు; 3. హాప్‌కిన్స్

## మెదడుకు మేత

అడ్డగోడమీద
బుడ్డ చెంబు, తోసినా
ఇటుపక్క పడదు.
అటు పక్క పడదు?

జవాబు : ఆబోతు మూపురం.



'మహారాజా! మీరు ఏనుగును అడిగారు. నేను ఏనుగుల గుంపునే తీసుకొస్తున్నాను. కొద్దిసేపటిలో వస్తాయి. నచ్చినన్ని రోజులు, నచ్చినంత తినొచ్చు ఆగండి' అంది పళ్లికిలిస్తూ..

కొద్ది సేపటికి ఒక ఏనుగు గుహలోకి వచ్చింది. 'ప్రణామములు మహారాజా! మేం మీ కోసం జంతువుని బహుమతిగా తెచ్చాం అది ఈ గుహలోకి పట్టేంత చిన్న జంతువేం కాదు. మంత్రివర్యా... మీరు, రాజుగారు ఒకసారి బయటికి రండి' అంది.

నక్క, సింహం ఆశగా బయటికి వస్తుండగా.. ఏనుగులన్నీ పెద్దగా ఘీంకారం చేస్తూ.. మూకుమ్మడిగా దాడి చేశాయి. ఆ దెబ్బకు ఆ రెండూ చనిపోయాయి. ★

## మంచిమాట

నీ మనసులో నీకు
ప్రశాంతత దొరకకపోతే
మరెక్కడో దాన్ని
వెతకడం వెర్రితనం



# వారఫలాలు

23-29 జూన్ 2025



సింహంభట్ల సుబ్బారావు
6300674054



**మేషం : అశ్వని, భరణి, కృత్తిక 1వ పాదం**

కుటుంబసభ్యులతో అకారణంగా విభేదాలు. వాహనాలు, గృహం కొనుగోలు యత్నాలు మందగిస్తాయి. నిరుద్యోగులకు శ్రమాధిక్యం. వ్యాపారులకు సాదా సీదాగా ఉంటుంది. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు. రాజకీయవేత్తల యత్నాలు నత్త నడకన సాగుతాయి. క్రీడాకారులు, పరిశోధకులకు కొన్ని సమస్యలు ఎదురుకావచ్చు. 25,26 తేదీలలో శుభవార్తా శ్రవణం. విందువినోదాలు. విష్ణుసహస్ర నామ పారాయణ చేయండి.



**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

విద్యార్థులకు నూతనోత్సాహం. ఆర్థిక ఇబ్బందులు తీరి ఊపిరిపీల్చుకుంటారు. పుణ్యక్షేత్రాలు సందర్శన ఇంటి నిర్మాణయత్నాలు అనుకూ లిస్తాయి. వ్యాపారులు కొత్త పెట్టుబడులతో విస్తరిస్తారు. ఉద్యోగులకు విధుల్లో మరింత అనుకూలత. రాజకీయవేత్తలకు ఊహించని అవకాశాలు రావచ్చు. రచయితలు, వైద్యులు పట్టుదలతో అనుకున్నది సాధిస్తారు. 28,29 తేదీల్లో అనారోగ్యం. నిర్ణయాలు మార్చుకుంటారు. హయగ్రీవస్తోత్రాలు పఠించండి.



**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

స్థిరాస్థి వివాదాలు పరిష్కారమవుతాయి. వాహనాలు, ఆభరణాలు కొంటారు. ప్రముఖులు పరిచయమవుతారు. పాత సంఘటనలు గుర్తుకు తెచ్చుకుంటారు. దైవదర్శనాలు చేసుకుంటారు. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగులు సమస్యల సుడి నుండి బయటపడతారు. కళాకారులు పోగొట్టుకున్న అవకాశాలు దక్కుతాయి. క్రీడాకారులు, పరిశోధ కులకు ఉత్సాహం పెరుగుతుంది. 23,24 తేదీల్లో మానసిక ఆందోళన. దేవీస్తోత్రాలు పఠించండి.



**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

ముఖ్యమైన కార్యక్రమాలు విజయవంతం. కుటుంబంలో శుభకార్యాలపై సంప్రదిస్తారు. ఆలోచనలు కార్యరూపంం. పుణ్య క్షేత్రాలు సందర్శి స్తారు. వ్యాపార లావాదేవీలు లాభసాటిగా ఉం టాయి. ఉద్యోగులకు చిక్కులు వీడి ప్రగతి కనిపిస్తుంది. కళాకారులకు ఆహ్వానాలు అందుతాయి. రచయితలు, క్రీడాకారులకు అంచనాలు నిజమవుతాయి. 27,28 తేదీల్లో ఖర్చులు తప్పవు. ఆరోగ్యంపై శ్రద్ధ వహిం చండి. నవగ్రహస్తోత్రాలు పఠించండి.



**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

రాబడి మెరుగ్గా ఉంటుంది. ప్రత్యర్థులు స్నేహితులుగా మారి చేయూతనిస్తారు. వాహనాలు, భూములు కొనుగోలు. పుణ్యక్షేత్రాలు సందర్శన. వ్యాపారులకు ఆశించిన లాభాలు. ఉద్యోగులకు ఉన్నతపోస్టులు. కళాకారులకు సంతోషకరమైన సమాచారం. రచయితలు, క్రీడాకారులకు అనుకూల పరిస్థితులు. 26,27 తేదీల్లో వృథా ఖర్చులు. మానసిక ఆందోళన. దత్తాత్రేయ స్తోత్రాలు పఠించండి.



**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. రావలసిన డబ్బు అందుతాయి. ఇళ్లు, వాహనాలు కొంటారు. నిరుద్యోగుల కలలు ఫలిస్తాయి. వ్యాపార సంస్థలు విస్తరిస్తారు. కొత్త భాగస్వాములు చేరతారు. ఉద్యోగులకు కొత్త హోదాలు దక్కి ఉత్సాహంగా గడుపుతారు. పారిశ్రామికవర్గాలకు సానుకూల సమయం. 28,29 తేదీలలో ఖర్చులు అధికం. కుటుంబంలో ఒత్తిడులు. గణేశాష్టకం పఠించండి.



**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

సమాజంలో పేరుప్రతిష్ఠలు మరింత పెరుగుతాయి. వ్యాపారులకు లాభాలు మరింత ఉత్సాహన్నిస్తాయి. ఉద్యోగుల బాధ్యతలు పెరిగినా సమర్థతను నిరూపించుకుంటారు. రాజకీయవర్గాలకు శుభవార్తలు అందుతాయి. రచయితలు, క్రీడాకారులు స్వీయానుభవాలతో గుర్తింపు పొందుతారు. 24,25 తేదీలలో ఖర్చులు. స్వల్ప అనారోగ్యం. దూర ప్రయాణాలు. గణేశాష్టకం పఠించండి.



**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

ఆస్తి వివాదాల నుంచి బయటపడతారు. మీ ఊహలు నిజం కాగలవు. అనుకున్న కార్యక్రమాలలో విజయం. వ్యాపారులకు లాభసాటి ఉద్యోగులకు ఉన్నతాధికారుల తగిన గుర్తింపు లభిస్తుంది. రాజకీయవేత్తలు విదేశీ పర్యటనలు జరుపుతారు. వైద్యులకు ఉత్సాహవంతంగా ఉంటుంది. 25,26 తేదీల్లో అనుకోని ఖర్చులు. స్నేహితులతో కలహాలు. నవగ్రహస్తోత్రాలు పఠించండి.



**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

ప్రముఖుల నుంచి అందిన సమాచారం ఊరటనిస్తుంది. కార్యక్రమాలు విజయవంతంగా సాగుతాయి. వాహనాలు, భూములు కొనుగోలు చేస్తారు. వ్యాపారులకు కొత్త పెట్టుబడులు సమకూరి ఉత్సాహరా ఉంటుంది. ఉద్యోగులకు నూతన నోత్సాహం. విధుల్లో ఆటంకాలు తొలగుతాయి. కళా కారులకు నూతన అవకాశాలు. 27,28 తేదీల్లో వృథా ఖర్చులు. దుర్గాదేవి స్తోత్రాలు పఠించండి.



**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

మీ నైపుణ్యం వెలుగులోకి వస్తుంది. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. విద్యార్థులు, నిరుద్యోగులకు కొత్త ఆశలు చిగురి స్తాయి. కుటుంబ సభ్యుల మెప్పును పొందే నిర్ణయాలు. వ్యాపారులకు చికాకులు తొలగి ఊరట. ఉద్యోగులకు సంతోషకర సమాచారం. కళాకారులకు ఊహించని అవకాశాలు. క్రీడాకారులు, వైద్యులు ఇంతకాలం పడిన శ్రమ ఫలిస్తుంది. 24,25 తేదీల్లో ఇంట్లో ఒత్తిడులు. ఆరోగ్యసమస్యలు. గణేశాష్టకం పఠించండి.



**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

బంధువులతో వివాదాలు తీరి ఊరట చెందు తారు. ఆస్తి వివాదాలు తీరి ఊపిరిపీల్చుకుంటారు. వ్యాపారులకు కొత్త పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగులకు బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు. రాజకీయవేత్తలకు విజయాలు. కళా కారులు, రచయితల కృషి ఫలిస్తుంది. 23,24 తేదీల్లో అనుకోని ధనవ్యయం. కుటుంబంలో చికాకులు. దూర ప్రయాణాలు. కనకధారాస్తోత్రాలు పఠించండి.



**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. విద్యార్థులకు ఊహించని అవకాశాలు. వాహనాలు, భూములు కొంటారు. వ్యాపారులకు విస్తరణలో ముందడుగు పడుతుంది. ఉద్యోగులకు శ్రమ ఫలించి మంచి గుర్తింపు లభిస్తుంది. పారిశ్రామికవేత్తలకు ప్రయత్నాలలో పురోగతి కనిపిస్తుంది. పరిశోధకులు, సాంకేతిక నిపుణుల ఆశలు నెరవేరతాయి. 26,27 తేదీల్లో కుటుంబంలో చికాకులు. మానసిక అశాంతి. లక్ష్మీస్తోత్రాలు పఠించండి.

# పదరసం - 519

## ఆధారాలు

**అడ్డం**

1. మేలుకొలుపు (4)
4. దేశ అత్యున్నత పురస్కారం (5)
7. గీతమే (2)
8. ఆనకు ప్రకృతి (2)
9. ఇత్తడే (2)
11. చలి తడబడింది (2)
12. మధ్యాహ్నం తరువాత...(3)
13. మెరుపుతీగ (4)
16. కొండ (3)
17. కథలకు వికృతి (3)
18. ఇదో దుంపకూర (2)
21. ఊరు...(2)
23. కురువృద్ధుడి తండ్రి (4)
26. ఉత్తర రామచరిత్ర కర్త (4)
28. దుఃఖం, బాధ (2)
30. అమ్మే (2)
32. తెలంగాణలో ఆషాఢంలో పెద్ద పండుగ (3)
34. ఉత్తరప్రదేశ్ రాజధాని (2)

**నిలువు**

2. శపథం (3)
3. తెలంగాణ రాష్ట్ర పుష్పం (3)
5. గుట్టు.. (3)
6. అందమైన, సుందరం... (4)
8. అంతరిక్షం (3)
9. బంగారం (4)
10. ఆందోళన, కలవరం (3)
12. వ్యాయామం (2)
14. గుడిసె లాంటిదే (2)
15. ద్వారం (3)
18. పొలం... (2)
19. వస్త్రం, కొలను (3)
20. దీని పాలు గరిటడైనా చాలట (4)
22. ఒక అప్సరస (2)
23. శంభువును పిలవండి(2)
24. మిగతా (3)
25. తేనీరు అంగ్లంలో (1)
27. స్వాధీనం (2)
29. అనేక... (2)
31. శీర్షం (2)
33. అంగ్ల మాసాల్లో అయిదవది (1)

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | | 3 | ■ | 4 | 5 | | 6 | |
| ■ | | ■ | 7 | | ■ | | ■ | | ■ |
| 8 | | ■ | | ■ | 9 | | ■ | | ■ |
| | ■ | 10 | ■ | 11 | | ■ | 12 | | |
| 13 | 14 | | 15 | ■ | 16 | | | ■ | ■ |
| ■ | 17 | | | ■ | | ■ | ■ | 18 | 19 |
| 20 | ■ | ■ | 21 | 22 | ■ | 23 | 24 | | |
| | ■ | 25 | ■ | 26 | 27 | | | ■ | |
| 28 | | ■ | 29 | ■ | | ■ | 30 | 31 | ■ |
| | ■ | 32 | | | ■ | 33 | ■ | 34 | |

## పదరసం - 518 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 ఉ | 2 ప | 3 న | య | 4 నం | ■ | 5 జ | న | 6 కు | 7 డు |
| 8 ప | ది | లం | ■ | 9 ద | ఉ | యం | ■ | 10 బే | రం |
| కా | ■ | 11 ద | వ | నం | ■ | ■ | 12 ఆ | రు | ■ |
| 13 రం | 14 పం | ■ | ■ | ■ | 15 ఆ | డ | ప | డు | 16 చు |
| ■ | 17 జ | 18 గ | 19 ము | ■ | వ | ■ | ద | ■ | ట్ట |
| 20 వ | రం | గ | ల్లు | ■ | 21 డ | 22 జా | ■ | 23 క | రి |
| లు | ■ | నం | ■ | వెం 24 | ■ | 25 మా | 26 వి | ■ | కా |
| 27 వ | 28 ని | ■ | 29 కు | డి | ■ | 30 త | రి | ■ | లు |
| ■ | 31 రు | ధి | రం | ■ | 32 కు | ■ | 33 వి | 34 రి | ■ |
| 35 కా | డు | ■ | గం | ■ | 36 క్షి | తి | ■ | 37 కృ | న |

సి ని మా

గడిచిన ఐదు నెలల్లో తెలుగు సినిమాల్లో ఆశించిన స్థాయి విజయాలు లేవు. 'పేరు గొప్ప ఊరు దిబ్బ' అన్న చందంగా విడుదలైన సినిమాల సంఖ్యకు కొదవలేదు. నిర్మాతలకు లాభాలు తెచ్చిపెట్టిన చిత్రాలు మూడు, నాలుగు మాత్రమే. ఈ నేపథ్యంలో జూన్ 20న విడుదలైన 'కుబేర' నుంచి డిసెంబర్ 5న విడుదల కాబోతున్న 'డెకాయిట్' సినిమాల మధ్యలో రాబోతున్న పాన్ ఇండియా, క్రేజీ ప్రాజెక్ట్స్ పై భారీ అంచనాలు నెలకొన్నాయి.












# 'కుబేర' నుండి 'డెకాయిట్' వరకూ...

నాగార్జున ప్రస్తుతం సోలో హీరోగా కంటే ఇతరుల చిత్రాలలో కీలక పాత్రలు పోషించడానికి మొగ్గు చూపుతున్నాడు. అలా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ధనుష్ హీరోగా తెరకెక్కిన ద్విభాషా చిత్రం 'కుబేర'లో నటించాడు. అలానే రజనీకాంత్ 'కూలీ'లోనూ కీలక పాత్ర పోషించాడు. ఆ సినిమా ఆగస్ట్ 14న రాబోతోంది. ఇక తన కుమారుడు అఖిల్ నటిస్తున్న 'లెనిన్' చిత్రంలోనూ నటిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. కాగా, కొంతకాలంగా సక్సెస్ కోసం ముఖం వాచిపోయిన తెలుగు సినిమా రంగం 'కుబేర'తో ఊపిరి పీల్చుకోబోతోందని తెలుస్తోంది. రొటీన్‌కు భిన్నంగా ఈ సినిమాను తెరకెక్కించినట్టు దర్శకుడు శేఖర్ కమ్ముల చెబుతున్నాడు. అలానే జూన్ నెలాఖరుకు మరో పాన్ ఇండియా మూవీ 'కన్నప్ప' విడుదల అవుతుంది. పలుమార్లు రకరకాల కారణాలతో వాయిదా పడిన ఈ సినిమాను ఐదు భాషల్లో విడుదల చేయబోతున్నారు. విడుదలకు ముందే సినిమాపై వ్యక్తమైన పలు అభ్యంతరాల నడుమ ఈ సినిమా రివైజింగ్ కమిటీకి వెళ్లి అక్కడ నుంచి సెన్సార్ సర్టిఫికెట్ పొందింది.

జూలై మాసంలో ఆసక్తికరమైన చిత్రాలు కొన్ని వెలుగు చూస్తున్నాయి. చిత్రం ఏమంటే ఇవన్నీ కూడా ఇప్పటికే విడుదల కావాల్సినవి, రకరకాల కారణాలతో వాయిదా పడినవి. అందులో ప్రధానంగా చెప్పుకోవాల్సింది నితిన్ 'తమ్ముడు' మూవీ. దిల్ రాజు నిర్మించిన ఈ సినిమాకు వేణు శ్రీరామ్ డైరెక్టర్. పేరు సాఫ్ట్ గా ఉన్నా కథలో చాలా డెప్త్ ఉందని ఈ సినిమా ట్రైలర్ చూస్తుంటే అర్థమౌతోంది. అదే రోజున విజయ్ దేవరకొండ 'కింగ్ డమ్' మూవీ విడుదల కావాల్సి ఉంది. కానీ ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ ఆలస్యం కావడంతో దీనిని జూలై నెలాఖరు లేదా ఆగస్ట్‌కు వాయిదా వేసే అవకాశం కనిపిస్తోంది. జూలై 24న రావాల్సిన చిరంజీవి 'విశ్వంభర' కూడా వీఎఫ్ఎక్స్ పని పూర్తి కానందున ఆ తేదీకి రావడం లేదు. ఇక జూలై 11న అనుష్క నటించిన పాన్ ఇండియా మూవీ 'ఘాటీ' రాబోతోంది. సీనియర్ జర్నలిస్ట్ చింతకింద శ్రీనివాస్ ఈ సినిమాకు కథను అందించారు. క్రిష్ జాగర్లమూడి స్వీయ దర్శకత్వంలో 'ఘాటీ'ని తెరకెక్కించారు. 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' తర్వాత అనుష్క నటించిన సినిమా ఇదే కావడం విశేషం. గాలి జనార్దన రెడ్డి కొడుకు కిరీటి రెడ్డి హీరోగా పరిచయం అవుతున్న 'జూనియర్' మూవీ తెలుగు, కన్నడ భాషల్లో జూలై 18న రాబోతోంది. అదే నెలాఖరులో హోంబలే ప్రొడక్షన్స్ నుండి త్రీడీ మూవీ 'మహావతార్ నరసింహ' విడుదల కానుంది.

ఆగస్ట్ నెలలోనూ ఆసక్తికరమైన సినిమాలు వస్తున్నాయి. ఇప్పటికే విడుదల కావాల్సిన పవన్ కళ్యాణ్ 'హరిహర వీరమల్లు'ను జూలై నెలాఖరులో లేదా ఆగస్ట్ మొదటి వారంలో విడుదల చేసే ఆస్కారం ఉంది. ఎన్టీఆర్, హృతిక్ రోషన్ హిందీ సినిమా 'వార్-2'తో పాటు రజనీకాంత్ 'కూలీ' ఆగస్ట్ 14న వస్తోంది. ఆ నెలాఖరులో 27న రవితేజ 75వ చిత్రం 'మాస్ జాతర' విడుదల అవుతోంది.

సెప్టెంబర్ నెలలోనూ దసరా హంగామా ఈసారి బాగానే కనిపిస్తోంది. ఆ నెల మొదటి వారంలో తేజ సజ్జా 'మిరాయి' సినిమా పాన్ ఇండియా స్థాయిలో రానుంది. 'హను-మాన్' తర్వాత తేజ నటించిన ఈ సినిమాను కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. సెప్టెంబర్ 5నే శివ కార్తికేయన్ హీరోగా ఎ.ఆర్. మురుగదాస్ రూపొందిస్తున్న 'మదరాసి' రానుంది. అదే నెలాఖరులో దసరా కానుకగా పవన్ కల్యాణ్ 'ఓజీ', బాలకృష్ణ, బోయపాటి కాంబోలో రూపుదిద్దుకుంటున్న 'అఖండ-2' వస్తున్నాయి. అయితే ఇప్పటికే సెప్టెంబర్ 25న సాయి దుర్గా తేజ్ నటిస్తున్న పాన్ ఇండియా మూవీ 'సంబరాల యేటి గట్టు' విడుదల కావాలి. కానీ పవన్ 'ఓజీ' వస్తే ఇది వాయిదా పడటం ఖాయం. అక్టోబర్‌లోనూ అనువాద చిత్రాల హంగామా బాగానే ఉంది. కన్నడ అనువాద చిత్రం 'కాంతార చాప్టర్ 1'ను అక్టోబర్ 2న విడుదల చేయబోతు న్నారు. అదే నెల 17న ప్రదీప్ రంగనాథన్ 'డ్యూడ్' చిత్రం, సిద్ధు జొన్నలగడ్డ 'తెలుసు కదా' రాబోతు న్నాయి. ఇది దీపావళి వారం కావడంతో మరికొన్ని సినిమాలు విడుదలైనా ఆశ్చర్యపోనక్కర్లేదు. నవంబర్ లో మాసంలో విడుదలయ్యే సినిమాల ప్రకటన ఏదీ ఇంతవరకూ రాలేదు. ఇక డిసెంబర్‌లో ప్రభాస్ నటిస్తున్న పాన్ ఇండియా మూవీ 'ది రాజా సాబ్' వస్తోంది. ఇటీవలే ఈ సినిమా టీజర్‌ను గ్రాండ్‌గా విడుదల చేశారు. ఈ హారర్ కామెడీ మూవీలో ప్రభాస్ రెట్రో లుక్ తో కనిపిస్తాడని అంటున్నారు. ఇక అదే నెలాఖరులో 25న అడివి శేష్ నటిస్తున్న 'డెకాయిట్' రిలీజ్ కాబోతోంది. ఈ మధ్యలో మరికొన్ని క్రేజీ ప్రాజెక్ట్స్ వచ్చే ఆస్కారం ఉంది. నిఖిల్ 'స్వయంభూ' సినిమా కూడా ఇదే ఏడాది జనం ముందుకు రాబోతోంది. అలానే రామ్ పోతినేని, శర్వానంద్ నటిస్తున్న ప్రామిసింగ్ మూవీస్ సైతం ఈ మూడు నాలుగు నెలల్లో విడుదల కానున్నాయి. ప్రథమార్ధంతో పోల్చితే ఈ యేడాది ద్వితీయార్థం విజయాల శాతం ఎక్కువగా ఉండే ఛాయలు కనిపిస్తున్నాయి. మరి ఏం జరుగుతుందో చూడాలి.

**– అరుణ,** సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్

# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు




వెల : ₹.300/-




వెల : ₹.100/-




వెల : ₹.400/-




వెల : ₹.200/-




వెల : ₹.200/-




వెల : ₹.499/-




వెల : ₹.200/-




వెల : ₹.120/-




వెల : ₹.300/-




వెల : ₹.525/-




వెల : ₹.499/-




వెల: PB ₹.549/-




వెల :₹.450/-




వెల : ₹.399/-




వెల : ₹.125/-

**పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : కేశవనిలయం, బర్కత్‌పురా. 040-27563236, 9290127329, 8179163138

వై.ఎం.ఐ.ఎస్. బిల్డింగ్, సిబిఐ ఆఫీస్ రోడ్, కోఠీ, హైదరాబాద్. 9440589722,

From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 77 Issue : 35




మిమ్మల్ని ఆలోచింపజేసే ఇంటర్వ్యూలు,
ఆసక్తిని రేకెత్తించే సామాజిక, సాంస్కృతిక అంశాలను
జాగృతి ఇప్పుడు యూట్యూబ్ ద్వారా అందిస్తోంది.
జాతీయ దృష్టికోనంతో వివిధ అంశాలపై
మంచి ఆలోచనలు మన ముందుంచుతోంది.
రండి, జాగృతి యూట్యూబ్ ఛానల్‌ను చూడండి, సబ్‌స్క్రైబ్
చేయండి, మీ అభిప్రాయాలు అందరితో పంచుకోండి.

www.youtube.com/@Jagrititv

చెప్పండి మెచ్చండి పంచండి